# సినాదం
నిఖార్సైన జర్నలిజం

గురువారం, మే 29, 2025 | సంపుటి - 20 | సంచిక 139 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## ఎన్టీఆర్ నుంచి ప్రేరణ పొందా

### ప్రధాని నరేంద్ర మోదీ నివాళి



న్యూఢిల్లీ : ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళి అర్పించారు. ఆయన తెలుగు సినీ రంగంలో విశిష్ట నటుడు.. దార్శనికత ఉన్న నాయకుడు అని కొనియాడారు. సినిమాల్లో ఎన్టీఆర్ పోషించిన పాత్రలను ఇప్పటికీ ప్రజలు తలచుకుంటూనే ఉంటున్నారని చెప్పారు. సమాజ సేవ, పేదలు, అణగారిన వర్గాల సాధికారతకు కృషి చేశారన్నారు. ఆయన నుంచి ఎంతో ప్రేరణ పొందినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ ఆశయాలను సాధించేందుకు కృషి చేస్తోందని వివరించారు.

# విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న బిఆర్ఎస్

### ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులకు మోసం

**కెసిఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ ఉద్యోగాలు**

**కాంగ్రెస్ వచ్చాక 15 నెలల్లో 55 వేల ఉద్యోగాల భర్తీ**

**బిఆర్ఎస్ నేతలు కనిపిస్తే ఎక్కడిక్కడ నిలదీయండి**

**చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని హితవు**

**ఎస్సీ గురుకుల టాపర్లకు బహుమతులు అందించిన రేవంత్**



గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని, ఉద్యోగాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండపడ్డారు. తమ ఇంట్లో ఉద్యోగాలు వస్తే చాలనే ధోరణిలో నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. తమ ప్రభుత్వం హయాంలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. గతంలో కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయని ఆయన వ్యంగ్యంగా అన్నారు.

హైదరాబాద్ : తెలంగాణ వస్తే.. ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ఆశలపై నీళ్లు చల్లారు. మాజీ సీఎం తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లోనే 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది. ఇంకా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువత సంఖ్య లక్షల్లో ఉంది. బుధవారం హైదరాబాద్ లోని బాబూ జగజ్జీవన్‌రామ్ భవన్‌లో ఎస్సీ గురుకులాల్లో టెన్త్, ఇంటర్ చదివి.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీకి ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదంటూ బీఆర్ ఎస్ నేతలను ఆయన నిలదీశారు. పీజీలు చేసిన విద్యార్థులు ఎంతో విలువైన కాలాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న పిల్లలకు తాము ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. ఒక్క ఏడాదిలోనే 59 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. గత 15 ఏళ్లుగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదన్నారు. తమ హయాంలో 563 గ్రూప్-1 పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. గ్రూప్-1లో 89శాతం పోస్టులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కాయని సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు. 2లో

## కొత్త చీఫ్ జస్టిస్‌గా ఏకే సింగ్

**సిఫార్సు చేసిన సుప్రీం కొలీజియం**

హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టు కొత్త చీఫ్ జస్టిస్‌గా అపరేష్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) పేరును కొలిజియం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్ ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ఇక ప్రస్తుత తెలంగాణ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఉన్న సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలిజియం సిఫార్సు చేసింది. 2



## మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ నివేదికపై మండిపడ్డ కెటిఆర్

- అది ఎన్‌డిఎ నివేదిక అంటూ విమర్శలు
- కెసిఆర్‌కు పేరు రావడం ఇష్టం లేకే కుట్రలు
- ఎక్స్ వేదికగా కెటిఆర్ ఆరోపణలు



హైదరాబాద్ : మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ-) ఇచ్చిన నివేదికను ఎన్డీయే నివేదిక అనడంలో ఎలాంటి తప్పు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. నాణ్యత లేనిది కాళేశ్వరం, మేడిగడ్డలో కాదని.. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న 2లో



# కెసిఆర్‌తో మరోమారు హరీష్ రావు భేటీ

**కెసిఆర్‌తో మరోమారు హరీష్ రావు భేటీ**

**కాళేశ్వరంపై లోతుగా చర్చించిన నేతలు**

గజ్వెల్ : కాళేశ్వరం కమిషన్ నోటీసులు అందిన నేపథ్యంలో ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు మూడున్నర గంటలగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న కమిషన్ ఇచ్చిన నివేదిక, అందించిన నోటీసులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల 5న కమిషన్ ముందు విచారణకు హాజరు కానున్నట్లు ఇప్పటికే నిర్ణయం తీసుకున్న కేసీఆర్, ముందు జాగ్రత్తగా కమిషన్ వద్ద ఉత్పన్నమయ్యే ప్రశ్నలు, వాటికి ఇవ్వాల్సిన సమాధానాలపై హరీష్‌రావుతో సమాలోచనలు జరిపినట్లు- సమాచారం. విజిలెన్స్ నివేదికలో పేర్కొన్న అంశాలు, ఎక్కడా లోపాలు జరిగాయన్న విషయాలపై పూర్తిగా ఆరా తీసినట్లు 2లో

## పంటనష్టపోయిన రైతులకు ఊరట

**పరిహారాన్ని ఖాతాల్లో జమచేసిన ప్రభుత్వం**

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి శుభవార్త చెప్పింది. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఆసరాగా నిలిచింది. రైతులకు ఊరటనిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పంట నష్ట పరిహారం నిధులను బుధవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇటీవల వడగంట్ల వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా 29 జిల్లాల్లోని 5,528 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ అంచనా నివేదిక ప్రచారం ప్రభుత్వం రూ. 51.52 కోట్లను విడుదల చేసింది.


మిగతా 2లో

# జూన్ 2 నుండి రాజీవ్ యువ వికాసం

**లబ్ధిదారులకు మంజూరు లేఖలు అందించాలి**

**జాబితా మేరకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి**

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటి సిఎం భట్టి ఆదేశం**




రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన అన్ని జిల్లాలలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లా ఇన్చార్జి మంత్రులకు లబ్ధిదారుల జాబితాను సమర్పించి వారి అనుమతితో జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్నారు.

హైదరాబాద్ : బుధవారం భట్టి విక్రమార్క, రాష్ట్ర బి.సి.సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకం అమలు ప్రగతిని అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆశలను ముందుకు తీసుకు వెళ్లే క్రమంలో గౌరవ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా భావించి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 5 లక్షల మంది యువతకు 6 వేల 250 కోట్లతో స్వయం ఉపాధి కల్పించ నున్నారని భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, లబ్ధిదారులకు నిజమైన లబ్ధి చేకూరే విధంగా యూనిట్ల ఎంపిక ఉండాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. తద్వారా ఎంచుకున్న యూనిట్ల ద్వారా యువతి యువకులకు ఆదాయ వనరుగా, లబ్ధిదారుని కుటుంబం ఆర్థికంగా బలపడే విధంగా రాజీవ్ యువ వికాసం పథకం 2లో

# రాజకీయ, సినీ రంగాల్లో రాణించిన ఏకైక నేత

**ఎన్టీఆర్‌కు నివాళితో రెండోరోజు మహానాడు ప్రారంభం**

**వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పుష్పాంజలి**



కడప : దివంగత ముఖ్య మంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు నివాళితో టీడీపీ మహానాడు రెండవ రోజు ప్రారంభమైంది. స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మహానాడు వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ముఖ్యనేతలు నివాళులర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. మహానాడు తొలిరోజు కీలక అంశాలపై చర్చించుకున్నా మన్నారు. పార్టీ బలోపేతం, ప్రజలకు మేలు చేసేలా చర్చలు జరిగాయన్నారు. తెలుగుజాతి ఆరాధించే మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ జయంతి అంటే తెలుగుజాతికి పండగ రోజు అని అన్నారు. ఒకే వ్యక్తి రెండు రంగాల్లో రారాజుగా రాణించడం చరిత్రలో చూడలేదన్నారు. ఎన్టీఆర్ అంటే పేదవాడికి భరోసా.. 2లో



## అస్తవ్యస్తంగా ముంబై డ్రైనేజీ వ్యవస్థ

**భారీ వర్షం పడితే సముద్రం తలపించేలా వీధులు**

**పాలకలు చిత్తశుద్ధి లోపంతో ప్రజలకు అవస్థలు**

ముంబై : ముంబై మహానగరంలో ఏటా వర్షాలు వస్తే నరకం చూడాల్సిందే. చిన్నపాటి వర్షం అయినా చిగురుటాకులా వణికిపోతుంది. అలాంటిది సాధారణం కన్నా రెండు వారాల ముందుగానే ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు 107 ఏళ్ల నాటి రికార్డులను చెరిపివేస్తూ కురిపించిన కుండపోతతో దేశ ఆర్థిక రాజధాని అతలాకుతలమైంది.

మిగతా 2లో

# రైతులకు కేంద్రం శుభవార్త

**వరి తదితర పంటలకు మద్దతు ధరల పెంపు**

**వరిపై 69 రూపాయలు పెంచుతూ నిర్ణయం**



కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రైతులకు శుభవార్త చెప్పింది. వరి మద్దతు ధర పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్ సీజన్‌కు వరి మద్దతు ధరను 69 రూపాయలకు పెంచింది. తాజా పెంపుతో క్వింటా వరి మద్దతు ధర 2,369 రూపాయలకు చేరింది.

న్యూఢిల్లీ : కేంద్రం మద్దతు ధర కోసం 2.70 లక్షల కోట్ల రూపాయలు కేటాయించింది. అంతేకాదు.. రైతులకు వడ్డీ రాయితీ కింద 15,642 కోట్ల రూపాయలు కేటాయించింది. పెట్టుబడిపై రైతులకు 50 శాతం లాభం ఉండేలా నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్ సీజన్‌లో వరి సహా 14 పంటలకు మద్దతు ధర పెంపునకు ఆమోదం తెలిపింది. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి క్వింటాల్ వరిపై రూ.69 పెంచడంతో కనీస మద్దతు ధర రూ.2369కి చేరింది. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. గత 10-11 ఏళ్లలో ఖరీఫ్ పంటలకు ఎంఎస్‌పీ భారీగా పెంచినట్లు- ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కోసం ఎంఎస్‌పీ పెంపును కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందన్నారు. ఆయా పంటలకు ఎంఎస్‌పీ కోసం రూ. 2.7లక్షల కోట్లు- కేటాయిస్తున్నట్లు- తెలిపారు. రైతులకు వడ్డీ రాయితీ కింద రూ. 15,642 కోట్లతో పాటు- అన్నదాతల పెట్టుబడిపై 50శాతం మార్జిన్ ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- మంత్రి పేర్కొన్నారు. మరోవైపు, ఏపీలోని బద్వేల్- నెల్లూరు నాలుగు వరుసల రహదారి అభివృద్ధికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ. 3,653 కోట్లతో 108.134 కి.మీల పొడవున ఈ రహదారిని అభివృద్ధి చేయనుంది. బద్వేల్‌లోని గోపవరం నుంచి నెల్లూరు జిల్లాలోని గురివిందపూడి వరకు నిర్మాణం 2లో

# మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ నివేదికపై మండిపడ్డ కెటిఆర్

రాజకీయాల్లోనే అని విమర్శించారు. ఎన్ని కుట్రలు సృష్టించినా.. ఎప్పటికీ వాస్తవమే నిలుస్తుందన్నారు. అశాస్త్రీయ ఆరోపణలను ఎల్ అండ్ టీ ఖండించడం సంతోషమన్నారు. కాళేశ్వరం ప్రపంచంలోని అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ అని, కేసీఆర్ దూరదృష్టి గల నాయకుడు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని ఇప్పటిదాకా బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయింది. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్ఏ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ- సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయింది. క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టీ- పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు- లాంటిదే. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకుని, ఏడాదిన్నర దాకా సాగదీసి ఇటీ-వల ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు, పొంతనలేని అంశాలుండటం రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టింది. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టు-కుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణికమని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనం. కేసీఆర్‌కు పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేశారని ఎక్స్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండగొట్టి, 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు కారణమయ్యారు. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్పై బురదజల్లేందుకు కుట్రలు చేసిన కాంగ్రెస్-బీజేపీ.. ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలన్న కుతంత్రాలతోనే తుది నివేదిక పేరిట నయా డ్రామాకు తెరతీశారు. ప్రాజెక్టు ప్రణాళికల నుంచి నిర్మాణ నాణ్యత వరకూ అడుగడుగునా ఎక్కడా రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టుపై బురదజల్లడం మాని, ఇకనైనా ఎల్ అండ్ టీ- అభ్యంతరాలకు ప్రభుత్వం, ఎన్డీఎస్ఏ సమాధానం చెప్పాలి. ఎన్డీఎస్ఏ వాదనలన్నీ తప్పుల తడక అని తేలిపోయిన నేపథ్యంలో దీన్ని కుంటిసాకుగా చూపి దాటవేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలి. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ముఖ్యమంత్రితో పాటు- కాంగ్రెస్-బీజేపీల కుట్ర రాజకీయాలకు తెలంగాణ రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం' అని ఎక్స్‌లో కేటీఆర్ రాసుకొచ్చారు.

# జూన్ 2 నుండి రాజీవ్ యువవికాసం



తొద్పడాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. దశల వారిగా జరిగే లబ్ధిదారుల ఎంపిక పక్రియలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు శిక్షణ, క్షేత్ర స్థాయిలో యూనిట్ల గ్రౌండింగ్ వరకు అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని ఈ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి తో పాటు- రాష్ట్ర జి.డి.పి. లో వారిని భాగస్వామ్యం చేసే విధంగా యూనిట్ల ఎంపిక జరగాలని సి.ఎస్ సూచించారు. అదేవిధంగా వాతావరణ శాఖ విడుదల చేసిన హెచ్చరికల నేపథ్యంలో సంబంధిత జిల్లాలలో కురుస్తున్న వర్షాల పట్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముందు జాగ్రత్తలపై దృష్టి సారించాలని సి.ఎస్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్సీ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ ఇ.శ్రీధర్, బీసీ సంక్షేమ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్‌తో మరోమారు హరీష్ రావు భేటీ

ఇది కాకుండా, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఏం సూచించింది? బ్యారేజీ కుంగడపై సాంకేతిక కారణాలు ఏమిటన్న దానిపై పూర్తి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కమిషన్ ఎదుట హాజరైన కొంతమంది రిటైర్డ్ ఇంజనీర్లతో కేసీఆర్ ఫోన్ ద్వారా మాట్లాడినట్లు-, కమిషన్ అడిగిన ప్రశ్నలు ఏమిటి? ఇంజనీర్లు ఇచ్చిన సమాధానాలు ఎలా ఉన్నాయన్న విషయాలపై కూడా ఆయన చర్చించినట్లు సమాచారం. మొత్తంగా సమాధానాలు సిద్దం చేసుకుని కమిషన్ ముందుకు హాజరయ్యేలా కెసిఆర్ సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

# రాజ్యసభకు కమలహాన్ ఖరారు

### నాలుగు సీట్లలో ఒకటి ఇచ్చేందుకు డిఎంకె ఓకే

చెన్నై : మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎమ్) పార్టీ అధినేత , ప్రముఖ నటుడు కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఎంఎన్ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు. ఈ విషయాన్ని డీఎంకేఎంఎన్ఎం ఖరారు చేశాయి. ఎనిమిది రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడుకు చెందిన అన్బుమణి రామదాస్, ఎం.షణ్ముగమ్, ఎన్. చంద్రశేగరన్, ఎం.మహమ్మద్ అబ్దుల్లా, పి. విల్సన్, వైగో ఎగువసభ పదవీ కాలం జులై 25తో ముగిసింది. ప్రస్తుతం ఆ రాష్ట్ర అసెంబ్లీలో డీఎంకేకు 134 మంది ఎమ్ఎల్ఏలు ఉన్నారు. దాంతో నాలుగు స్థానాలనూ ఆ పార్టీనే దక్కించుకుంటుందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. విపక్ష ఇండియా కూటమిలో ఎంఎన్ఎం భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే , కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రం లోని 39 లోక్‌సభ స్థానాలు , పుదుచ్చేరి లోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువ సభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వం లోని కూటమి అంగీకరించింది. ఆయన 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. అవినీతి, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు గ్రామాల సాధికారత కోసం దీనిని ఏర్పాటు- చేసినట్టు- తెలిపారు. అన్నాడీఎంకేకు ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేల బలంతో ఒక్క రాజ్యసభ ఎంపీ గెలుస్తుంది. ఒకవేళ మరో అభ్యర్థిని కూడా గెలిపించు కోవాలని భావిస్తే అది బీజేపీ, పీఎంకే ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. బీజేపీ ప్రస్తుతం అన్నాడిఎంకే పక్షానే ఉంది. తప్పకుండా ఇరు పార్టీలు సహకరించుకునే అవకాశం ఉంది.

# విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న బిఆర్ఎస్

ఈ రోజు అంటే బుధవారం తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి అని గుర్తు చేశారు. వారి స్ఫూర్తిని కొనసాగించేం దుకు తెలుగు యూనివర్సిటీకి వారి పేరు పెట్టుకున్నామన్నారు. కోటిలోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నామని తెలిపారు. ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారని ఆయన స్పష్టం చేశారు. జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు... మంచి చదువుతోనే అందరికీ గుర్తింపు వచ్చిందని చెప్పారు. ఆత్మనూన్యత భావాన్ని వీడాలంటూ దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. వారిలోని ఆత్మనూన్యత భావాన్ని తొలగించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బర్రెలు, గొర్రెలు, చేపలు వంటి స్కీములు తెచ్చారని గుర్తు చేశారు. కానీ మీకు చదువు చెప్పి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తామని ఎందుకు చెప్పలేదంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది వాస్తవం కాదా? అని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కానీ మేం మొదటి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. మొదటి ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. అంతేకాదు గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేశామన్నారు. కానీ నోటికాడి కూడును కింద పడేసినట్లు-.. రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని గత ప్రభుత్వ పెద్దలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో గ్రూప్ 1 పరీక్షలు కూడా నిర్వహించని పార్టీలు కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారన్నారు. అందుకే ఇది సామాజిక సమస్యగా మారుతోందని పేర్కొన్నారు.వాళ్లింట్లో ఎన్నికల్లో ఓడిపోతే ఆరు నెలలు తిరగకుండానే ఇంకో ఉద్యోగం ఇచ్చుకున్నారని బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. కానీ మీకుమాత్రం ఉద్యోగాలు రాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. అలాంటి వారు మీకు ఎదురైతే ప్రశ్నించండంటూ యువతకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మొదటి పాతికేళ్ల వయసు వరకు బాగా చదువుకుంటేనే మీరు మీ జీవితంలో రాణిస్తారన్నారు. తప్పుదారి పడితే కన్న తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి ఉంటుందని విద్యార్థులకు ఆయన కీలక సూచన చేశారు. అలాంటి పరిస్థితులు ఎప్పుడూ తెచ్చుకోవద్దంటూ విద్యార్థులకు హితవు పలికారు. కష్టపడండి.. సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో రాణించి తల్లిదండ్రులకే కాదు.. రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో తొలిసారిగా దళితుడిని వైస్ చాన్స్‌లర్‌గా నియమించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళిని నియమించామని గుర్తు చేశారు. అలాగే అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రజా ప్రభుత్వంలో ఎంపిక చేసుకున్నామని వివరించారు. వీరందరికీ కేవలం కులం ప్రాతిపదికన గుర్తింపు రాలేదు.. చదువుకున్నారు కాబట్టే వారికి ఈ గుర్తింపు వచ్చిందని విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందన్నారు. అన్ని రంగాల్లో మీరు రాణించాలని మనస్ఫూర్తిగా తాను కోరుకుంటు-న్నానని తెలిపారు. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు.చాలా మంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదు.. చదువు మాత్రమే. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యమవుతుంది. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాల్సిన అవసరం ఉంది. యంగ్ ఇండియా నా బ్రాండ్.. నా బ్రాండ్ అంబాసిడర్లు మీరే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులు ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను సిఎ ఆసక్తిగా తిలకించారు.

# అస్తవ్యవస్తంగా ముంబై డ్రైనేజీ వ్యవస్థ

ఎంతటి మహానగరమైనా వరుణుడు కన్నెర్ర చేస్తే నడిసంద్రంలా మారుతున్న తీరు మన పాలకుల ముందుచూపు లేమికి నిదర్శనంగా నిలిచిపోతోంది. గతంలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ... ఇలా ఎన్నో ఉదాహరణలు ఉండనే ఉన్నాయి. 2021లో ఇదే ముంబై నగరం భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయింది. ఆకస్మికంగా భారీ వర్షాలు కురిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై నిపుణుల కమిటీలు పలు సిఫార్సులు చేశాయి. కానీ, పాలకులు వాటిని అమలు చేయకుండా బుట్టదాఖలు చేయడం వల్లనే ఇటువంటి నష్టాలు తిరిగి సంభవిస్తున్న పరిస్థితి. ప్రధానంగా ఆక్రమణలు, డ్రైనేజీ వ్యవస్థ అల్లకల్లోలం చేస్తున్నాయి. ఆర్థిక నగరానికి ఆదాయం ఉన్నా దానిని బాగు చేసే ఆలోచనలో పాలకులు లేరు. ఎవరు అధికారంలో ఉన్న ముంబై అతలాకుతలం కావాల్సిందే. మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ చూపకపోవడం నగరాలు, పట్టణాలు నీట మునకకు కారణమవుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజిలు తదితర మౌలిక వసతులు కల్పించి, నీటి ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకునేందుకు ఇప్పటి-కై-నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భుజంభుజం కలపాలి. ప్రకృతికి అనుకూలంగా ఉండే ప్రాజెక్టులను రూపొందించడం, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం, నూతన నగరాల నిర్మాణంలో, ఉన్న నగరాల విస్తరణలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం లాంటి చర్యలు అత్యావశ్యకం. ఈ ఏడాది 16 రోజులు ముందుగానే రావడం గత 75 ఏళ్లలో ఇదే తొలిసారి. మునిగిన రహదారులు, భూగర్భ మెట్రో లైన్లు, రైల్వే స్టేషన్లతో నగర జీవనం స్తంభించిపోయింది. రోడ్డు, రైలు, విమాన సర్వీసులకూ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎల్లో అలర్ట్‌ను జారీచేయడం ద్వారా ఈ స్థాయి వర్షాలను అంచనా వేయడంలో భారత వాతావరణ శాఖ విఫలమైనట్టే! గతంలో వయనాడ్‌లో భారీ వర్షాలతో కొండచరియల బీభత్స సమయంలోనూ వాతావరణ శాఖ వైఫల్యం మనమెరిగిందే! ఇంతటి భారీ వర్షపాతానికి సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల, వాతావరణ మార్పులు ప్రధాన కారణమని ఐఎండి చెబుతోంది. ధారాపాతంగా రాత్రంతా కురిసిన 200 మిల్లీమీటర్లకు మించిన వర్షపాతం ముంబైని ముంచెత్తింది. పొరుగున ఉన్న కొలాబాలో సోమవారం 295 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం 1918 నాటి రికార్డు 279.4 మిల్లీమీటర్లను తిరగరాసింది. దక్షిణ ముంబైలో 13 గంటల్లోనే 252 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల్లోనూ వర్షాలు ప్రభావం చూపాయి. కేరళలో రుతుపవనాలు ప్రవేశించిన పది రోజులకు మహారాష్ట్రకు రావాల్సి ఉండగా 24 గంటల్లోనే ఇక్కడ ప్రతాపం చూపాయి. సాధారణంగా ఏటా జూన్ 11న ముంబైలో రుతుపవనాలు ప్రవేశిస్తాయి. వాతావరణ శాఖ మరింత అధునాతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా నష్టాల తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం అమలుకు అమెరికాలాంటి అగ్రరాజ్యాలు చేతులెత్తేయడం, పర్యావరణ పరిరక్షణకు చేసిన తీర్మానాల అమలుకు శ్రద్ధ చూపని ధనిక దేశాల తీరు ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను భారీగా పెంచేస్తున్నాయి. మూడో ప్రపంచ దేశాలకు పెనుముప్పుగా మారిపోతున్నాయి. ఏటా అంతక్రితం ఏడాదితో పోలిస్తే భారీ వర్షాలు నమోదవుతూనే ఉన్నాయని కేంద్రప్రభుత్వ ఎర్త్ సైన్స్ విభాగం ఐదేళ్ల క్రితమే అంచనా వేసింది. కుండపోత వర్షాలు కురిసినా చెరువులు, వాగులు, వంకలు లాంటి సహజ సిద్ధమైన ప్రవాహ మార్గం ద్వారా గతంలో వెళ్లిపోయేవి. నగరాలు, పట్టణాల విస్తరణ, అక్రమార్కుల కబ్జాలు, వాటికి పాలకుల ప్రోత్సాహం... ఇవన్నీ నీటి ప్రవాహానికి ఎక్కడికక్కడ అడ్డంకులుగా వున్నాయి. గత ఏడాది విజయవాడను ముంచెత్తిన వరదలు కూడా ఇలాంటివే. ప్రకృతి వైపరీత్యాల నష్టాల తీవ్రతకు పాలకుల విధాన వైఫల్యమే ప్రధాన కారణం.

# రాజకీయ, సినీ రంగాల్లో రాణించిన ఏకైక నేత

రైతులకు నేస్తం అని వెల్లడించారు. ఎన్టీఆర్ రూపొందించిన పసుపు జెండా శాశ్వతంగా ఉంటుందని స్పష్టం చేశారు. 2024 ప్రజల తీర్పుతో విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు వెళ్తున్నామని అన్నారు. పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇదిలావుంటే నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘన నివాళి అర్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. 'యుగపురుషుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, తెలుగు వారి ఆరాధ్య దైవం, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు, సంక్షేమానికి కొత్త బాట చూపిన సంఘ సంస్కర్త, 'అన్న' నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. పేద ప్రజలకు కూడు, గూడు, గుడ్డ అనే మూడు అవసరాలను తీర్చడమే తన జీవితాశయంగా భావించిన ధీరోదాత్తుడు అన్న ఎన్టీఆర్. 'సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు' అనే నినాదంతో ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం చెప్పిన దార్శనికుడు ఆయన. అన్నగా ఆడబిడ్డలకు ఆస్తి హక్కు ఇచ్చినా, మండల వ్యవస్థతో పాలనారంగాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లినా, పక్కా ఇళ్ల నిర్మాణంతో పేదలకు అండగా నిలిచినా, కిలో రెండు రూపాయలకే బియ్యాన్ని అందించి పేదల ఆకలి తీర్చినా ... ఏది చేసినా ఆయన మనసులో ఉన్నది ఒక్కటే... 'నా తెలుగు జాతి సగౌరవంగా తలెత్తుకు నిలబడాలి' అనే సంకల్పమే. చరిత్రలో స్థానం సంపాదించుకోవడం కాదు... చరిత్రనే సృష్టించిన చిరస్మరణీయుడు అన్న ఎన్టీఆర్. ఈనాటికీ తెలుగుదేశం ఉజ్వలంగా ప్రకాశిస్తున్నదంటే అది ఆయన ఆశీర్వాదబలమే. ఆ మహనీయుడి సంకల్పాన్ని నెరవేర్చేందుకు అహర్నిశలూ కష్టపడుతూనే ఉన్నాం.... సమసమాజాన్ని సాధించే దిశగా సాగుతున్నాం. అనితరసాధ్యమైన ఎన్నో పనులు చేసిన అన్న నందమూరి తారకరామారావుకు మరొక్కమారు ఘన నివాళి అర్పిస్తున్నాను.' అని చంద్రబాబు పోస్టులో పేర్కొన్నారు.

# లక్ష్మీనరసింహుడి దయతోనే ఇంతగా ఎదిగా

### ఆలయ పునఃప్రతిష్టలో పాల్గొన్న భట్టి

ఖమ్మం : ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం యడవల్లి గ్రామంలో శ్రీ యోగానంద లక్ష్మి నరసింహస్వామి ఆలయ పున:ప్రతిష్ట మహోత్సవం అభివృద్ధి పనులకు డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క భూమి పూజ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ. 4 కోట్ల 74 లక్షల 50 వేల రూపాయలను కేటాయించారు. పున:ప్రతిష్ట కార్యక్రమం అనంతరం డిప్యూటీ- సీఎం భట్టి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం ఆరాధ్యదైవంగా ఉందన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో ప్రచారం ఇక్కడ నుంచే మొదలు పెడతా అని, స్వామి వారి ఆశీస్సులతోనే తాను ఈస్థాయిలో ఉన్నానని చెప్పారు. దశాబ్దాలుగా లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఆరాధ్యదైవంగా ఉంది. ప్రతి ఎన్నికల సమయంలో ప్రచారం ఇక్కడ నుంచే మొదలు పెడతా. రూ. 4 కోట్ల 74 లక్షల రూపాయలు దేవాలయ అభివృద్ధి కి కేటాయించాము. మీరందరూ గెలిపిస్తేనే నేను ఉప ముఖ్యమంత్రిని అయ్యాను. రాష్ట్ర ప్రజలందరూ చల్లగా ఉండాలని ప్రజా ప్రభుత్వం మంచి పాలన అందిస్తుంది. సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ పోతుంది. రాష్ట్రంలో ఉన్న మహిళలకు వడ్డీ లేని రుణం కింద 20 వేల కోట్ల రూపాయలు ఇస్తుంది. 22 వేల కోట్ల రూపాయలు రెండు లక్షల లోపు రైతులకు రుణమాఫీ చేశాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని వారికి రూ.12 వేలు ఇస్తున్నాం' అని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రతి ఎన్నికల కార్యక్రమం ఇక్కడి నుంచే మొదలు పెట్టా. శ్రీయోగనంద లక్ష్మి నరసింహ స్వామి ఆశీస్సులతో నేను ఈస్థాలో ఉన్నా. లక్ష్మి నరసింహ స్వామి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలకు ఉండాలి. ప్రజా సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుంది. పేద ప్రజలకు గ్యాస్, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ లాంటి పథకాలు ఈ ప్రభుత్వం అందజేస్తుంది. రైతు భరోసా, రుణమాఫీ, ఆత్మీయ భరోసా పథకాలను ప్రభుత్వం అందజేస్తుంది. పేద ప్రజలకు ఇందిరా గిరి ఆవాస్ యోజన పథకం కూడా ఉంది' అని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

# వ్యక్తిగత ఎజెండాతో విమర్శలు తగవు

హైదరాబాద్ : తెలంగాణ బీజేపీ నేతలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ముఖ్యనేతలతో సమావేశమై నేతలకు క్లాస్ ఇచ్చారు. కొందరు నేతలు వ్యక్తిగత ఎజెండాలో పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు- ప్రెస్ మీట్లు- పెట్టి వ్యక్తిగత దూషనలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ కార్యాలయాన్ని వ్యక్తి గత అవసరాలకు వాడుకుంటే ఊరుకునేది లేదని నేతలకు గట్టిగా చెప్పారు. పార్టీ ఆఫీసులో పార్టీ లైన్ ప్రకారమే మాట్లాడాలని సూచించారు. ఇక మీదట ప్రెస్ మీట్లు- పెట్టాలంటే అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇది తనతో పాటు- అందరికీ వర్తిస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ పార్టీ నేతలు హుందాగా ప్రవర్తించాలని సూచించారు. బీజేపీ అంటే బాధ్యతగల పార్టీ అని సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన పార్టీ అని కీలక వ్యాఖ్యాలు చేశారు. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా పార్టీ ఆఫీస్‌ను ఆశ్రయిస్తున్నారని.. అలాంటి వారికి న్యాయం చేసేలా నేతలు పోరాటం చేయాలని సూచించారు. అలా కాకుండా, ఇష్టం వచ్చినట్లు- ప్రెస్‌మీట్‌లు పెట్టి వ్యక్తిగత దూషణలకు దిగుతే చర్యలు తప్పవని స్ట్రాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు.

# రైతులకు కేంద్రం శుభవార్త

చేపట్టే ఈ కారిడార్‌తో కృష్ణపట్నం పోర్టుకు ప్రయాణ దూరం దాదాపు 33.9 కిలోమీటర్లు తగ్గనుంది. అలాగే, ఈ కారిడార్ నిర్మాణంతో భారీగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్రం తెలిపింది. వరి సహా మొత్తం 14 ఖరీఫ్ పంటలకు క్వింటాల్‌పై కనీస మద్దతు ధర కేంద్రం పెంచింది. వీటిలో వరి సాధారణ, గ్రేడ్- ఏలకు రూ.69 పెంచగా.. జొన్నలు రూ. 328; సజ్జలు రూ.150; రాగులు రూ.596; మొక్కజొన్న రూ.175; కందిపప్పు రూ.450; పెసర రూ.86; మినుములు రూ.400; వేరుశెనగ రూ.480; పొద్దుతిరుగుడు రూ.441; సోయాబీన్ రూ.436; కుసుమలు రూ.579; వలిశలు (గడ్డినువ్వులు) రూ.820; పత్తి రూ.589 చొప్పున కనీస మద్దతు ధరను పెంచారు.

# కొత్త చీఫ్ జస్టిస్‌గా ఏకే సింగ్

అపరేష్ కుమార్ సింగ్ 1965, జూలై 7న జన్మించారు.ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1990 నుంచి 2000 వరకు పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తరవాత 2001లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012, జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా అపరేష్ కుమార్ నియమితులయ్యారు. ఇక 2022 నుంచి 2023 వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2023, ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్ పదోన్నతి పొందారు.

# పంటనష్టపోయిన రైతులకు ఊరట

ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మే నెలకు పంట నష్టపరిహారం నిధులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి తుమ్మల ప్రకటించారు.

# రాజ్యసభ సభ్యుడిగా పాక

### ప్రమాణం చేయించిన ధన్‌ఖడ్

న్యూఢిల్లీ : రాజ్యసభ సభ్యుడిగా బిజెపికి చెందిన పాక వెంకట సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం మధ్యాహ్నం సత్యనారాయణ చేత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ దన్‌ఖడ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్, ఎంపీ లక్ష్మణ్, ఏపీ మంత్రి సత్య కుమార్ హాజరయ్యారు. విజయసాయి రెడ్డి రాజీనామాతో ఏర్పడిన ఖాళీ స్థానానికి పాక సత్యనారాయణ అభ్యర్థిని బీజేపీ ప్రకటించింది. ఏపీ నుంచి బీజేపీ ఎంపీగా పాక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏప్రిల్ 2028 వరకు సత్యనారాయణ పదవిలో కొనసాగనున్నారు. 1961లో ఏపీలోని భీమవరంలో పాక సత్యనారాయణ జన్మించారు. 15ఏళ్ల వయస్సులోనే అంటే 1976లో ఆయన ఆర్ఎస్ఎస్‌లో చేరారు. ఆర్ఎస్ఎస్‌లో పాక సత్యానారాయణ క్రియాశీలకంగా పనిచేశారు. 1980లో బీజేపీలో చేరిన పాక.. ఆ తరవాత భీమవరం మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 1996 లోక్‌సభ ఎన్నికల్లో నరసాపూర్ నుంచి బీజేపీ తరపున పోటీ- చేసి ఓడిపోయారు. ఆ తరువాత 2006 ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ- చేసి ఓటమిని చవిచూశారు. 2006 నుంచి 2010 వరకు భీమవరం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే 2012 నుంచి 2018 వరకు ఏపీ బీజేపీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. అలాగే 2014లో ఉమ్మడి ఏపీ ఎన్నికల మేనిఫెస్టో ముసాయిదా కమిటీ- సభ్యుడిగా ఉన్నారు. 2018 నుంచి 2021 వరకు బీజేపీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడిగా పాక సత్యనారాయణ పనిచేశారు. ప్రస్తుతం ఆయన బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ- చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఇక.. విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి కూటమి ప్రభుత్వం పాక సత్యనారాయణను నామినేట్ చేసింది. 2025, మే 6న ఆయన ఏకగ్రీవంగా ఎన్ని-కై-నట్లు- కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ క్రమంలో ఈరోజు రాజ్యసభ సభ్యుడిగా పాక సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు.

# 12 లక్షలు లంచం డిమాండ్

రంగారెడ్డి : లంచం తీసుకుంటున్న అధికారులు ఎంత మందిని అరెస్ట్ చేసినా.. అవినీతి చేసే వాళ్లలో మాత్రం ఏమాత్రం మార్పు రావడం లేదు. చిన్న పని పెద్ద పని అనే తేడా లేకుండా లంచం డిమాండ్ చేసే అధికారులు రోజురోజుకీ పెరిగిపోతున్నారు. తాజాగా అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో లంచగొండి అధికారి చిక్కాడు. పట్టాదార్ పాస్ పుస్తకంలో 7 గుంటల స్థలం నమోదుకు లంచం డిమాండ్ చేసిన ఇబ్రహీంపట్నం ఆర్ఐ కృష్ణని అధికారులు అరెస్ట్ చేశారు. రూ.12లక్షలు ఇస్తే భూమిని పాస్‌బుక్‌లో నమోదు చేస్తానని బాధితుడిని కృష్ణ బెదిరించాడు. ఆర్ఐతో మాట్లాడిన కాల్ రికార్డులను బాధితులు ఎసిబి అధికారులకు ఇచ్చారు. దీంతో ఆర్ఐ కృష్ణను ఎసిబి అధికారులు అరెస్ట్ చేశారు.

# సంక్షేమ హాస్టళ్లలో పిల్లలతో వెట్టి చాకిరి

### శానిటేషన్ సిబ్బందిని తొలగింపు

### కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కవిత మండిపాటు



హైదరాబాద్ : కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో సంక్షేమం కొరవడిందని, పిల్లలే టాయ్‌టెల్ శుభ్రం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఉన్న పరిస్థితిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. స్వీపింగ్, శానిటేషన్ కోసం ఒక్కో గురుకుల పాఠశాలకు ప్రతి నెల బీఆర్ఎస్ ప్రభుత్వం రూ . 40,000 కేటాయిస్తే నలుగురు తాత్కాలిక ఉద్యోగులు పనిచేసేవారని కవిత గుర్తు చేశారు. వీరు టాయిలెట్లు-, తరగతి గదులు శుభ్రం చేసేవారు. గత సంవత్సరం ఆగస్టు నెల నుండి ఈ పద్ధతి కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించినందున పిల్లలే టాయిలెట్లు-, గదులు మాత్రమే కాకుండా పాఠశాల హాస్టల్ ఆవరణలోని బయటి పనులు అన్ని కూడా విద్యార్థులే రెగ్యులర్‌గా చేసుకోవాలని చెప్పారని కవిత పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు గురుకుల పాఠశాలలోని వాచ్‌మెన్ వాటర్ ట్యాంక్ క్లీన్ చేస్తూ ప్రమాదవశాత్తు మరణించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాష్ట్రంలోని 240 గురుకుల విద్యాసంస్థలలో అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించి వారు చేసే వార్డెన్ పనులను పిల్లలతో చేయించాలని చెప్తున్నారు. ఇప్పటివరకు వార్డెన్లే అన్ని రకాల నిర్వహణలు చూసుకున్నా పిల్లలు కమిటీ-గా ఏర్పడి క్వాలిటీ- చెక్ చేసుకునేవారు. కానీ ఇకపై పిల్లలే వంటశాల నిర్వహణ మరియు మెస్ పనులు కూడా చేయవలసి వస్తుందన్నారు. శ్రమను గౌరవించడం నేర్పడం వేరు, విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించడం వేరు. అసలు మొత్తంగా శానిటేషన్ వర్కర్స్‌ను తొలగించి ఆ పనులు పిల్లలతో రెగ్యులర్‌గా చేయించడం నేరమని కవిత పేర్కొన్నారు. ఇక్కడ ఆడియోలో వర్షిని గారు చెప్పిన దాంట్లోనే సమాధానం ఉంది. బోర్డు తుడవడం టాయిలెట్ కడగడం ఒకటి కాదు. మేడం గారి పిల్లలు చదువుకునే చోట అందరూ వాడే టాయిలెట్లను వీరు క్లీన్ చేయగలరా. అది కూడా రెగ్యులర్‌గా. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో చదివే పిల్లలు ఏమైనా పోష్ బ్యాక్ గ్రౌండ్ నుండి వచ్చారా? వెళ్లి కూర్చోగానే టేబుల్ పైకి ఫుడ్ రాదు అనడం.. ఎందుకు ఇలాంటి పనులు చేయరు చేయాల్సిందే అని ఒక ఐఏఎస్ అనడం దుర్మార్గం. ఈ వివక్షల నుండి తప్పించడానికే కదా ఈ పిల్లలకు సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు- చేయించి చదివించేది. ఇది డిగ్నిటీ- ఆఫ్ లేబర్ నేర్పడం కాదు. కుల వివక్ష, శ్రమ దోపిడీ మాత్రమే అని కవిత అన్నారు. దీంతో పాటు- 240 మంది అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించడం కూడా. గతంలో లాగానే పిల్లలు క్వాలిటీ మాత్రమే తనిఖీ చేసుకునే ఏర్పాటు- ఉండాలి. అంతే కానీ పిల్లలతో పూర్తిస్థాయి వార్డెన్, శానిటేషన్ వర్కర్స్ చేయించే పని చేయించడం కరెక్ట్ కాదు. నలుగురు శానిటేషన్ వర్కర్స్ ఒక వార్డెన్ మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో కలిపి 1200 మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయం. ఒకవైపు ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడం మరోవైపు అత్యవసరమైన చోట వారిని తొలగించి ఆ పని భారం విద్యార్థుల మీద ఉంచడం తప్పు అని కవిత పేర్కొన్నారు. పోష్ పిల్లలు కాకపోయినా అందరూ పిల్లలు సమాజం దృష్టిలో, ప్రభుత్వం దృష్టిలో సమానమే అన్న సంకేతాలను పంపాల్సిన గురుకుల పాఠశాలలు వివక్ష కేంద్రాలుగా మారకూడదు. ఎస్సీ వర్గాల పిల్లలు ప్రధానంగా చదివే గురుకుల పాఠశాలలో ఈ నిర్ణయం మానవతావాదులు ముక్తకంఠంతో ఖండించవలసింది. కాంగ్రెస్ ప్రభుత్వ పేదల వ్యతిరేక ఆలోచన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను, తక్షణమే ఆ అధికారిని తప్పించాలి, నెలకు మెయింటెనెన్సు డబ్బులు పాఠశాలలకు ఇవ్వాలి. పిల్లలతో పనిచేయించటం ఆపివేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

## పోలీసుల కళ్లుగప్పి రిమాండ్ ఖైదీ పరార్

జగిత్యాల : పోలీసులను ఓ రిమాండ్ ఖైదీ బురడీ కొట్టించాడు. కోర్టు ఆవరణలో కుటుంబసభ్యులతో మాట్లాడుతూనే.. పోలీసుల కండ్లుగప్పి పరారయ్యాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలో చోటు చేసుకుంది. పరారీలో ఉన్న నిందితుడు కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబసభ్యులను వివరాలు అడిగి పలు ప్రాంతాల్లో వెతుకుతున్నారు. కస్టడీ నుంచి ఖైదీ తప్పించుకోవడం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. జగిత్యాల సబ్ జైలులో పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన జున్ను ప్రసాద్ రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. గల్ఫ్ పంపిస్తానని మోసం చేసిన కేసుల్లో అరెస్ట్ అయి జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఇటీవలే అతడిపై కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. జగిత్యాల సబ్ జైలులో ఉన్న ప్రసాద్‌ను విచారణలో భాగంగా మంగళవారం కొడిమ్యాల పోలీసులు పీటీ- వారెంట్‌తో తీసుకెళ్లి జగిత్యాల కోర్టులో హాజరుపర్చారు. కేసు పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడు ప్రసాద్‌కు రిమాండ్ విధించారు.

## వివాహేతర సంబంధంతో ఆత్మహత్య

గద్వాల : వివాహేతర సంబంధం ఆత్మహత్యకు దారితీసింది. ఈ కారణంగా ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మరొకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న సంఘటన జోగులాంబ గద్వాల్ జిల్లా రాజోలిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలికి చెందిన మహిళ (32)కు భర్త, కుమార్తె ఉన్నారు. ఇదే గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పుల్లన్నతో మహిళకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నెల 12న ఇద్దరూ గ్రామం విడిచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై అప్పట్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. కుమార్తెను చూడాలనిపించి మహిళ.. ఈనెల 25న గ్రామానికి వచ్చి ఇష్టపూర్వకంగానే అతనితో వెళ్లినట్లు- పోలీసుల ఎదుట చెప్పింది. దీంతో ఇద్దరినీ పోలీసులు ఇళ్లకు పంపించారు. ఈ క్రమంలో రెండు కుటుంబాల మధ్య గొడవలు జరగడంతో 27న పుల్లన్న ఎలుకల మందు తాగడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ విషయం తెలియడం, మరో వైపు భర్త కూడా తీవ్రంగా బాధపడుతుండటంతో మనస్తాపానికి గురైన మహిళ.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు- ఎస్ఐ తెలిపారు.

## మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ

### దండుగులను అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్ : మేడ్చల్ జిల్లాలోని షాపూర్‌నగర్‌లో మావోయిస్టు పేరుతో బెదిరింపు లేఖ కలకలం సృష్టించింది. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సోదరుడి కుటు-ంబాన్ని లేఖలో లక్ష్యంగా చేసుకున్నారు. రూ.50 లక్షలు ఇవ్వకపోతే కూన రవీందర్‌గౌడ్ కుమారుడు కూన రాఘవేందర్ గౌడ్‌ను చంపుతామని అందులో పేర్కొన్నారు. రెండు ఇళ్లను బాంబులతో పేల్చేస్తామని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి ముందు వస్తువులు ధ్వంసం చేసి అక్కడ లేఖను ఉంచారు. ఈ క్రమంలో జీడిమెట్ల పోలీసు స్టేషన్ పరిధిలో మావోయిస్టుల లేఖ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 21న మావోయిస్టుల పేరుతో నిందితులు లేఖ రాశారు. వారిని కూన రాఘవేందర్‌గౌడ్ ఇంట్లో అద్దెకు ఉంటున్న రాజు, అతడి స్నేహితుడిగా గుర్తించారు. నిందితుల వద్ద నాటుబాంబులు, 3 సెల్‌ఫోన్లు, 2 బెదిరింపు లేఖలను స్వాధీనం చేసుకున్నారు. నాటుబాంబులను వారు విజయనగరంలో కొనుగోలు చేసినట్లు తెలిసింది. కారుపై ఎరుపు రంగు టవల్‌లో లేఖ పెట్టి వెళ్లిపోయారు. ఘటన ఈ నెల 21న జరిగినట్లు- రాఘవేందర్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల్లో ఓ వ్యక్తి మాస్క్ ధరించి వచ్చినట్లు- గుర్తించారు. తాజాగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.

## తెలంగాణ భాష, యాసకు మరింత గుర్తింపు తీసుకొస్తాం

### "సురవరం ప్రతాప రెడ్డి జయంత్యోత్సవం పురస్కార ప్రదానోత్సవం"లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



సురవరం ప్రతాప రెడ్డి స్ఫూర్తితో తెలంగాణ భాష, యాసకు మరింత గుర్తింపు తీసుకొచ్చేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం శాంతా వసంతా ట్రస్ట్ సౌజన్యంతో సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన "సురవరం ప్రతాప రెడ్డి" 129వ జయంత్యోత్సవం, పురస్కార ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన కలంతో నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ వైతాళికుడిగా సురవరం ప్రతాప రెడ్డి చరిత్ర పుటల్లో నిలిచారని ఈ సందర్భంగా మంత్రి కొనియాడారు. మనకు కూడా భాష, యాస ఉందని చాటిచెప్పిన గొప్ప వైతాళికులన్నారు. కేవలం సాహితీవేత్తగా మాత్రమే ఆయనను చూడటం సరికాదని, గొప్ప స్వాతంత్ర పోరాట యోధుడన్నారు. అలాంటి మహనీయుడి గొప్పతనాన్ని భావి తరాలకు తెలిసేలా తెలుగు విశ్వ విద్యాలయానికి పెట్టామని వివరించారు. ఇది ఆయనకు మనం ఇచ్చే గొప్ప గౌరవమన్నారు. అనంతరం ఈ ఏడాదికి గానూ ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అనుమాండ్ల భూమయ్య, ప్రముఖ రచయిత, పరిశోధకులు డాక్టర్ సంగి శెట్టి శ్రీనివాస్ కు సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఎల్లూరి శివా రెడ్డి, శాంతా వసంతా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ కె.ఐ.వర ప్రసాద్ రెడ్డి, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ కార్యదర్శి సురవరం పుష్పలత, ట్రస్ట్ సభ్యులు సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి, సురవరం రఘువర్ధన్ రెడ్డి, సురవరం విజయభాస్కర్ రెడ్డి, సురవరం రంగా రెడ్డి, సురవరం అనిల్ కుమార్ రెడ్డి, సురవరం కపిల్ తదితరులు పాల్గొన్నారు.

## ముప్పై ఏళ్ల పోరాటానికి దక్కిన గుర్తింపు

### మందకృష్ణ మాదిగా వెల్లడి

హైదరాబాద్ : వ్యక్తిగతంగా నా పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఇది ఉద్యమకారులందరికీ దక్కిన గౌరవం అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. పద్మశ్రీ పురస్కారం ఉద్యమానికి దక్కిన అభినందనలు అని తెలిపారు. 1994లో ఉద్యమం మొదలైందని, ఎమ్మార్పీఎస్‌ది ముప్పై ఏళ్ల పోరాటమన్నారు. సమాజంలో అన్ని వర్గాల అండదండలతోనే ఉద్యమం సాధ్యమయిందన్నారు. సుప్రీంకోర్టు సైతం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా మందకృష్ణ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. పద్మశ్రీ పురస్కారం ఉద్యమానికి దక్కిన అభినందనలు. వ్యక్తిగతంగా నా పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఇది ఉద్యమకారులందరికి దక్కిన గౌరవం. సమాజంలో అన్ని వర్గాల అండదండలతోనే ఉద్యమం సాధ్యమయింది. 1994లో ఉద్యమం మొదలైంది, ఎమ్మార్పీఎస్‌ది ముప్పై ఏళ్ల పోరాటం. సుప్రీంకోర్టు సైతం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఉద్యమ లక్ష్యం నెరవేరింది, కేంద్రం గుర్తింపు కూడా ఇచ్చింది. పద్మశ్రీ అవార్డును గౌరవంగానే కాదు బాధ్యతగా ఫీల్ అవుతున్నాం. ఇంకా పరిష్కారం కాని సమస్యల కోసం భవిష్యత్ ప్రయాణం ఉంటు-ంది. చట్టసభల్లో పరిష్కారం కావాల్సిన సమస్యలు ఉన్నాయి. రాజకీయాల్లోకి వచ్చినా కండువా మారదు. రాజకీయ చైతన్యం కోసం కూడా సిద్ధం అవుతాం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతోనే మాదిగలకు అన్యాయం జరిగింది. ఏపీలో చంద్రబాబు నాయుడు మాదిగలకు ప్రాతినిధ్యం పెంచారు' అని మందకృష్ణ మాదిగ అన్నారు.

## గోదావరి వృధా జలాలు వాడుకుంటే తప్పేంటి

### చివరి రాష్ట్రం కవడంతోనే వాడుకోవాలని నిర్ణయం
### బకచర్లపై బిఆర్ఎస్ అనవసర రాద్దాంతం
### నదుల అనుసంధానంతో తెలంగాణకు కూడా మేలు
### కడప మహానాడు వేదికపై చంద్రబాబు వ్యాఖ్యలు

కడప : వృథాగా సముద్రంలో కలిసిపోతున్న గోదావరి జలాలను వాడుకుంటే వచ్చే నష్టమేంటని సిఎం చంద్రబాబు అన్నారు. వృథా జలాలను వినియోగంలోకి తేవాలన్న లక్ష్యం మేరకు బనకచర్ల ప్రతిపాదనలు చేశామని, అయితే దీనిపై బిఆర్ఎస్ పార్టీ రాద్దాంతం చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏకగ్రీవంగా మరోసారి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహానాడులో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో గంజాయిని పూర్తిగా నియంత్రిస్తామన్నారు. శాంతిభద్రతలను ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. తప్పు చేసినవారి పట్ల చండశాసనుడిలా ఉంటానని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమకు ద్రోహం చేసిన పార్టీ వైసీపీ అని ఫైర్ అయ్యారు. రాయలసీమను ఎడారి కానివ్వమని, రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. అలాగే, 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని చంద్రబాబు తెలిపారు.బనకచర్ల వరకు నీరు తేవాలన్నదే తమ లక్ష్యమన్నారు. నదుల అనుసంధానం పూర్తి చేస్తామని, నదీ జలాల వినియోగంలో ఏపీ చివరి రాష్ట్రమని, నదుల అనుసంధానంతో తెలంగాణకూ లాభమేనని చంద్రబాబు వివరించారు. ఈ అంశంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. బనకచర్లతో తెలంగాణకు ఎలాంటి నష్టం జరగదని, సముద్రంలోకి పోయే నీటిని వాడుకుంటే తప్పేంటని చంద్రబాబు ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణ తనకు రెండు కళ్లు వంటివి అని చంద్రబాబు పేర్కొన్నారు. ఇంతవరకు శక్తిమేర పార్టీని సమర్థంగా నడిపానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నా బలం, బలగం.. టీ-డీపీ నాయకులు, కార్యకర్తలేనని పేర్కొన్నారు. ఇంతవరకు జరిగిన అన్ని మహానాడుల కంటే కడప మహానాడు ప్రత్యేకమన్నారు. తెలుగుజాతి ఉన్నంతవరకు టీడీపీ ఉంటుందని, రానున్న 40 ఏళ్లకు ప్రణాళికలు రూపొందించుకున్నామని స్పష్టం చేశారు. ఫ్యాక్షనిజం, నక్సలిజాన్ని తుదముట్టించిన పార్టీ టీడీపీ అన్నారు. గత ఐదేళ్లు ఏపీలో శాంతిభద్రతలు లేవని, వైసీపీ హయాంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబాయిని హత్య చేసి ఆ నింద మనపై మోపాలని చూశారని అయితే తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదన్నారు. తప్పు చేసిన వారిని ఎట్టిపరిస్థితిలోనూ వదిలిపెట్టేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.

## సరిహద్దు రాష్ట్రాల్లో నేడు మాక్ డ్రిల్స్

### హర్యానాలో రాత్రికి బ్లాక్ అవుట్

న్యూఢిల్లీ : సరిహద్దు రాష్ట్రాల్లో మరోమారు గురువారం మాక్ డ్రిల్స్ నిర్వహించ బోతున్నారు. పాక్‌తో యుద్ధం ఆగినా.. రెండు దేశాల మధ్య పరిస్థితులు మాత్రం నివురుగప్పిన నిప్పులాగే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే మాక్ డ్రిల్స్ మళ్లీ మొదలవ్వనున్నాయి. గురువారం పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న నాలుగు రాష్ట్రాల్లో మాక్ డ్రిల్స్ జరగనున్నాయి. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, జమ్మూకాశ్మీర్‌లలో అధికారులు సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు. హర్యానా ప్రభుత్వం కూడా రాష్ట్ర వ్యాప్తంగా ' ఆపరేషన్ షీల్డ్' పేరిట మాక్ డ్రిల్స్ నిర్వహించనుంది. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి మాక్ డ్రిల్ మొదలవుతుంది. మొత్తం 22 జిల్లాల్లో అధికారులు మాక్ డ్రిల్స్ నిర్వహించ నున్నారు. ఎమర్జెన్సీ పరిస్థితులకు సిద్ధంగా ఉండటం కోసం ఈ మాక్ డ్రిల్స్ జరగనున్నాయి. హర్యానాలోని కీలక ప్రాంతాల్లో రాత్రి 8 గంటల సమయంలో 15 నిమిషాల పాటు- బ్లాక్ అవుట్ ఉండనుంది. విద్యుత్ సరఫరా పూర్తి స్థాయిలో నిలిచిపోనుంది. అయితే, హాస్పిటల్స్, ఫైర్ స్టేషన్స్, పోలీస్ స్టేషన్స్‌కు ఇందులో మినహాయింపు ఉంది.పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదులకు, వారికి సాయం చేస్తున్న పాకిస్తాన్‌కు సరైన విధంగా బుద్ధి చెప్పడానికి భారత ప్రభుత్వం సిద్ధమైంది. భారత ప్రజలకు యుద్ధం జరగొచ్చంటూ హింట్ ఇచ్చేసింది. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహించింది. ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల ఏరివేత మొదలెట్టింది. మే 7వ తేదీన పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై ఎయిర్‌ఫోర్స్ దాడులు చేసింది. దాదాపు 100 మందికిపైగా ఉగ్రవాదులు చనిపోయారు. ఉగ్రవాదుల్ని చంపటంతో పాకిస్తాన్ తట్టు-కోలేకపోయింది. యుద్ధానికి కాలు దువ్వింది. 3 రోజుల పాటు- యుద్ధం జరిగింది. రెండు దేశాల మధ్య జరిగిన ఈ యుద్ధంలో పాక్ దారుణంగా దెబ్బతింది. చివరకు కాళ్ల బేరానికి వచ్చింది.

## లిఫ్టులో ఇరుక్కున్న కుమారుడు

### తట్టుకోలేక గుండెపోటుతో తండ్రి మృతి

భోపాల్ : మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో దారుణ సంఘటన చోటు చేసుకుంది. కుమారుడు లిఫ్ట్‌లోఇరుక్కుపోవడంతో తనని కాపాడుకోలేననే భయంతో తండ్రి గుండెపోటుతో మృతి చెందారు. భోపాల్‌లోని జత్కేడి ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో రిషిరాజ్ భట్నాగర్(51) తన భార్య, పిల్లలతో నివసిస్తున్నారు. సోమవారం కుమారుడిని వెతుక్కుంటూ కిందకు వచ్చారు. కుమారుడు కనిపించడంతో అతన్ని ఇంటికి వెళ్లమని సూచించిగా.. ఎనిమిదేళ్ల పిల్లాడు లిఫ్ట్(ం÷బిష) ఎక్కాడు. వెంటనే పవర్‌కట్ కావడంతో లిఫ్ట్‌లో ఆ పిల్లాడు ఇరుక్కుపోయాడు. దీంతో రిషిరాజ్ తీవ్ర ఆందోళనకు గురి కావడంతో అయనకు గుండెపోటు వచ్చింది. కొన్ని నిమిషాల్లో పవర్ రావడంతో పిల్లాడు సురక్షితంగా బయటకు వచ్చాడు. అయితే అప్పటికే పడిపోయిన రిషిరాజ్‌ను అపార్ట్‌మెంట్ వాసులు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రిషిరాజ్‌ను పరీక్షించిన వైద్యులు ఆయన మృతి చెందినట్లు- నిర్ధారించారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## ఎఐ టెక్నాలజీతో ఎన్టీఆర్ ప్రసంగం

### మహానాడులో ఆకట్టుకున్న ప్రయోగం

కడప : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 102వ జయంతిని పురస్కరించుకుని .... రెండో రోజు కడపలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికపై ఎఐ ఎన్‌టిఆర్ ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసిన పథకాలు, సాధించిన అభివృద్ధి గురించి ఎఐ ఎన్‌టిఆర్ మాట్లాడారు. తాను ప్రారంభించిన పథకాలను గుర్తుచేస్తూ, చంద్రబాబు నాయకత్వంలో రూపుదిద్దుకున్న ప్రస్తుత సంక్షేమ పథకాలపై ప్రశంసలు కురిపించారు. ఈ ఎఐ ప్రసంగంతో ఎన్‌టిఆర్ అభిమానులు, మహానాడుకు హాజరైన ప్రతినిధులు, కార్యకర్తలు మరింత ఉత్తేజంగా మారారు.

## అస్వస్థతకు గురైన గులాంనబీ ఆజాద్

### రియాజ్ ఆస్పత్రిలో చికిత్స

న్యూఢిల్లీ : విదేశీ పర్యటనలో ఉన్న కేంద్రమాజీమంత్రి గులాంనబీ ఆజాద్ అస్వస్థతకు గురయ్యారు. ఆయన బహ్రెయిన్‌లో ఆస్వస్థతకు గురికాగా రియాజ్‌ని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నరు. పహల్గంలో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు భారత్ సిద్ధమైంది. ఈ మేరకు అన్ని పార్టీల నుంచి ఎంపిలను ఎంపిక చేసి.. విదేశీ పర్యటనకు పంపించింది. అయితే ఈ బృందం సభ్యుల్లో ఒకరైన జమ్ముకశ్మీర్ మాజీ సిఎం, డెమోక్రటిక్ ప్రోగ్రేసీవ్ ఆజాద్ పార్టీ చీఫ్, మాజీ ఎంపి గులాం నబీ ఆజాద్ కూడా ఉన్నారు. అయితే ఆయన బహ్రెయిన్ పర్యటనలో అస్వస్థతకి గురయ్యారు. ఈ విషయాన్ని ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్న బిజెపి ఎంపి బైజయంత్ పాండా ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆజాద్ ప్రస్తుతం రియాజ్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని పేర్కొన్నారు. ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని.. కొన్ని -టె-స్టులు చేయాల్సి ఉందని తెలిపారు. సౌదీ పర్యటనలో ఉండగా.. ఆయన అనారోగ్యానికి గురి కావడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇప్పటివరకూ ఆయన సహకారంతో బహ్రెయిన్, కువైట్‌లో పర్యటనలు విజయవంతంగా జరిగాయని.. అల్జీరియా పర్యటనలో ఆయన లేని లోటు- స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలి !

వ్యవసాయ రంగంలో కీలక మార్పులు వస్తున్నాయి. రైతులు కూడా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పుల ను గమనిస్తున్నారు. కొత్త తరహా సేద్యానికి అలవాటు పడుతున్నారు. కేవలం వరిపైనే ఆధారపడకుండా కూరగాయలు, పళ్లతోటల పెంపకం,పాడిపశువుల పెంపకంపైనా శ్రద్ధ పెడుతున్నారు. ఈ క్రమంలో రైతులకు మరింత ఆసరా దక్కాలి. బ్యాంకులు కొర్రీలు లేకుండా రుణాలు ఇవ్వాలి. పంటలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు మారాలి. వారికి వ్యవసాయశాఖ పరంగా అన్ని సూచనలు, సలహాలు అందాలి. అన్నింటికిమించి బీమా సౌకర్యం అందించాలి. ఇలా చిన్నిచిన్న సాయాలుచేస్తే రైతాంగం మరింతగా కష్టపడి దేశ పురోభివృద్ధిలో భాగస్వామ్యం కాగలదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం దిగుబడులు భారీగా పెరిగాయి. ఈ రెండు రాష్ట్రాల్లో ముందునుంచి పంటల దిగుబడి పెరుగుతూ వస్తోంది. రైతులు చెమటోడ్చి పంటలు పండిస్తున్నా ఆర్థికంగా మాత్రం ఎదగడం లేదు. పంటలు బాగా పండాయనడానికి ధాన్యం రాశులే దీనికి నిదర్శనం. ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్న దృశ్యాలు చూస్తుంటే ఎంతగా ధాన్యం దిగుబడి అయ్యిందో గమనించాలి. ఓ వైపు జోరుగా కొనుగోళ్లు జరుగుతున్నా మరోవైపు తమ ధాన్యం కొనడం లేదని రైతులు ఆందోళనలకు దిగితున్నారు. ఉచిత విద్యుత్‌కు తోడుగా, అందుబాటులో నీరు ఉండడంతో జిల్లాల్లో ధాన్యం దిగుబడులు పెరిగాయి. తెలంగాణ కూడా ఇప్పుడు వ్యవసాయికంగా బాగా పురోగమించిందనే చెప్పాలి. మరోవైపు ధాన్యం దిగుబడిలో ఇప్పటికే అగ్రస్థానం లో నిలిచిందని సిఎం రేవంత్ అన్నారు. కాళేశ్వరం నీళ్లు లేకున్నా పంటల దిగుబడి పెరిగిందని మంత్రులు అంటున్నారు. వరిదిగుబడి, ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిం దని భారత ఆహార సంస్థ గతంలో చేసిన ప్రకటన తెలంగాణ వ్యవసాయరంగం పురోగమిస్తోందనడానికి సంకేతం. వ్యవసాయ రంగంలో విప్లవం సాధించిన ఘనత ఎలా ఉన్నా, ధాన్యాగారంగా మారడానికి అన్నదాతల కష్టాలను అభినందించాల్సిందే. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణ మాదిరిగా ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. గ్రామాల్లోనే కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనడం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ దశలో వ్యవసాయంలో మరో విప్లవాత్మక మార్పునకు తెలంగాణ సర్కారు దృఢ నిశ్చయంతో ఉన్నది. కృష్ణా, గోదావరి, మూసీ నదీ జలాలు పుష్కలంగా లభిస్తున్న తరుణంలో పంట మార్పిడి దిశగా నియంత్రిత సాగు విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నది. గిరాకీ ఉన్న పంటల్నే పండించడం, డిమాండ్ ఉన్నప్పుడే పంటను మార్కెట్‌కు తేవడం.. నియంత్రిత వ్యవసాయం లక్ష్యం. వ్యవసాయానికి పెట్టుబడి సాయం మొదలు విత్తనాల్లో సబ్సిడీ, ఎరువుల్లో రాయితీ సమకూర్చుతున్న ప్రభుత్వం... రైతులు మూస విధానం వీడి మంచి ఆదాయం పొందేలా మేధోమథనం జరిపింది. ఈ మేరకు జిల్లా నేలలకు అనువైన పంటలు వేసి లాభాలు గడించేలా ప్రణాళిక రూపొందించింది. ఒకే రకమైన పంటలసాగుతో ధరలు తగ్గి రైతులు నష్ట పోతున్న నేపథ్యంలో డిమాండ్ ఉన్న పంటలకు రైతులు కూడా మొగ్గుచూపు తున్నారు. ఇక అవసరమున్న పంటలను పండించాలన్న లక్ష్యంతో వ్యవసాయ రంగం బహుముఖంగా అభివృద్ధి చెందనుంది. కరోనా కాలం కష్ట సమయంలో ధాన్యాగారంగా,యావద్దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ అవతరించింది. ఈ విజయం వ్యవసాయరంగ పురోభివృద్ధిలో సాధించిన మైలురాయిగా చూడాలి. అయితే ఉభయ రాష్ట్రాల్లో కరువులు, వలసలతో కొండంత కష్టాలతో కుమిలిపోయిన అన్నదాతల జీవితాలు మాత్రం గట్టెక్కడం లేదు. రైతుభరోసా పెట్టుబడి సాయంతో పాటు 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరా అవుతున్నా అనేక కష్టాలను ఈదాల్సి వస్తోంది. అన్నింటికి మించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కక పోవడం, సకాలంలో కొనుగోళ్లు చేయకపోవడం వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదు. యాసంగి దిగుబడిలో మునుపెన్నడూ ఎరుగని రీతిలో వరి దిగుబడి సాధించి రైతులు రికార్డు సృష్టించారు. ఆ తరువాత పండించిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనడంతో అన్నదాతలకు భరోసా దక్కింది. తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన యాసంగి ధాన్యం విలువ పదివేల కోట్ల రూపాయల పై మాటే అని తెలుస్తోంది. యాసంగిలో పండిన వరిధాన్యం సేకరణలో జాతీయస్థాయిలో తెలంగాణది కీలక భాగస్వామ్యమని ఎఫ్‌సిఐ పేర్కొన్నది. ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను అభినందించారు. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారింది.. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు చెల్లించినట్లు ప్రకటించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి.. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేస్తున్నారని సిఎం రేవంత్ అన్నారు.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి.. కలెక్టర్లు ప్రోయాక్టివ్‌గా ఉండాలి.. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి.. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండని కూడా సూచించారు. ఒక్క నిముషం వృధా చేయొద్దు.. నిర్లక్ష్యం వహించొద్దు.. అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి.. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉంది.. సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టాలి. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి.. అప్పుడే కొన్ని సమస్యలయినా తీరుతాయి. రైతులకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం, కూలీల సమస్యను అధిగమించడం కూడా ముఖ్యం.

# ఆర్టీసీని గట్టెక్కించడం అందరి బాధ్యత



## కార్మికులను కాపాడుకోవడమూ ముఖ్యమే


హైదరాబాద్ : నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించడం కోసం ఎండి సజ్జన్నార్ రకరకాల ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే కరిమింగిన వెలగపండులా ఆర్టీసీ రోజురోజుకూ కుదేలవుతోంది. ప్రస్తుత నష్టాలను చార్జీల ద్వారా గట్టెక్కించడం అసాధ్యం. దీనికితోడు పెరుగుతున్న డీజిల్ ధరలు కూడా ఆర్టీసికి గుదిబండగా మారాయి. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ మరింత నష్టాల్లోకి దిగజారింది. కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో వెనకాడరాదు. అదేపనిగా టిక్కెట్ ధరలు పెంచినా గట్టెక్కించడం అసాధ్యం. ఆర్టీసిని లాభాల్లోకి తీసుకుని రావడంతో పాటు, కార్మికులకు కాపాడుకునే బాధ్యత యాజమాన్యంపై ఉంది. అయితే ఎండిగా సజ్జన్నార్ బాధ్యతలు తీసుకున్న తరవాత గతంకన్నా మేలనే చెప్పాలి. అనేక విధాలుగా ఆర్టీసీని గట్టెక్కించే చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడా చిన్న అవకాశం వదలకుండా కృషి చేస్తున్నారు. ఆర్టీసీని రక్షించుకునే ప్రయత్నంలో కార్మికుల జీవితాలకు కూడా భరోసా కల్పించి ముందుకు సాగాల్సి ఉంది. ప్రజలకు ఉత్తమ, మెరుగైన రవాణా సౌకర్యాలు, బస్సుల్లో అధికరద్దీని తగ్గించడం, అనుకూలమైన, అందుబాటు టికెట్ ధరలు, ఎక్కువ సంఖ్యలో బస్సులు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో సాగుతున్నది. ఆర్టీసీ రక్షణతో పాటు,కార్మికులు పక్షాన కూడా ఆలోచనతో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించాల్సి ఉంది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆధీనంలోని వివిధ రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాయి. వాటిని పాక్షికంగా లేదా పూర్తిగా ప్రైవేటీకరించే దిశగా ప్రయత్నిస్తున్నాయి. అనేక సంక్షేమ పథకాల అమలు వల్ల ఎప్పటికప్పుడు నిండుకుంటున్న ఖజానాతోపాటు, ఆర్థిక మాంద్యం దెబ్బతో బడ్జెట్ లెక్కలను నేల మీదకు దించక తప్పలేదు. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యే పనికాదనేది ఆర్థిక రంగ నిపుణుల అభిప్రాయం. మారిన పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్టుకు పూర్తిగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతున్న వారు మినహా మిగిలిన జనం పెద్దగా ఇబ్బంది పడటంలేదు. ఆర్టీసీని కూడా ఏదో రకంగా గట్టెక్కించి లాభాల్లోకిరాకున్నానస్టాలు రాకుండా చూడగలగాలి. ఇది ఏ ఒక్కరిద్దరి సమస్యనో కాదు. 50వేల మంది కార్మికులు, వారి కుటుంబాలతో ముడిపడి ఉన్న అంశం. నిబద్ధతతో పని చేస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తోన్న ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తోందని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లింపు, 21 శాతం ఫిట్‌మెంట్ తో 2017 పీఆర్సీ, 2013 ఆర్పీఎస్ బాండ్ల డబ్బుల విడుదలతో పాటు– పెండింగ్ డీఏలను మంజూరు చేసిందని గుర్తు చేశారు. విధి నిర్వహణలో మరణించిన 2,350 మంది సిబ్బంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలను కల్పించామన్నారు. మెడికల్ అన్ ఫిట్ అయిన మరో 537 మందికి ఉద్యోగాలు ఇచ్చామని వీసీ సజ్జనార్ వెల్లడించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమం ద్వారా ప్రతి ఉద్యోగికి వైద్య పరీక్షలు చేశామని సజ్జనార్ పేర్కొన్నారు. ఈ ఆరోగ్య టెస్టుల ఫలితంగా 726 మంది ఉద్యోగులకు, 184 మంది ఉద్యోగుల జీవిత భాగస్వామ్యులను ప్రాణాప్రాయం నుంచి సంస్థ కాపాడిందన్నారు. అలాగే, మహాలక్ష్మి పథకం అమలుతో సిబ్బందిలో పెరిగిన పని భారాన్ని తగ్గించేందుకు తాత్కాలికంగా డ్రైవర్, కండక్టర్ పోస్టులకు నియామకాలు చేపడుతుంటే.. కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీలో 3036 రెగ్యులర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చిందని.. సాంకేతిక కారణాల వల్ల నియామక పక్రియలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఆ నియమాకాలు కచ్చితంగా జరుగుతాయి.. అందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. తమ మనుగడ కోసం ఐదారు నెలలుగా కొందరు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నా.. ఉద్యోగులు ఎంతో సమయమనంతో ఉన్నారని వీసీ సజ్జనార్ చెప్పారు. అలాగే, ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ కొనుగోలు చేసేలా అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వీసీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వెనుక ఉద్యోగులు, సంస్థ ప్రయోజనాలే ఉంటాయో తప్ప.. ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలు ఉండవన్నారు. ప్రతి నిర్ణయం చాలా పారదర్శకంగా, సంస్థ నియమ నిబంధనలకు లోబడే ఉంటుందని ఎండీ సజ్జనార్ వెల్లడించారు.

# ఎన్టీఆర్‌కు టిడిపి నేతల ఘననివాళి

### రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది ప్రత్యేక ముద్ర

### తీర్మానాన్ని ప్రవేశ పెట్టిన అశోక గజపతి

కడప : సాటిలేని చరిత్ర ఎన్టీఆర్‌దని.. ఆయన నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని తెదేపా సీనియర్ నేత అశోక్‌గజపతి రాజు అన్నారు. ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా మహానాడులో నేతలు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. యుగపురుషుడికి నివాళి తీర్మానాన్ని అశోక్‌గజపతిరాజు ప్రవేశపెట్టగా.. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, చినరాజప్ప బలపరిచారు. ఎన్టీఆర్‌తో కలిసి రాజకీయ ప్రయాణం నా అదృష్టం. తెలుగు జాతి ఉన్నంత వరకు తెదేపా కొనసాగుతూనే ఉంటుంది. ఎన్నో ఒడుదొడుకులు ఎదురైనా చంద్రబాబు భయపడలేదు. తెదేపా కుటుంబ పెద్దగా చంద్రబాబు నాయకత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాలని అశోక్‌గజపతి రాజు అన్నారు.తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని మహోన్నత శిఖరంపై నిలబెట్టిన వ్యక్తి ఎన్టీఆర్. తెలుగు జాతి చరిత్రను తిరగరాసి వెలుగులు నింపిన మహనీయుడు ఆయన అని మంత్రి పయ్యావుల కేశవ్ నివాళి అర్పించారు. సినీ రంగంలో రారాజుగా విరజిల్లుతూ రాజకీయాల్లో తనకంటూ ఓ ముద్ర వేసుకున్న వ్యక్తి ఎన్టీఆర్ అని మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు అన్నారు. పేదవాడి ఆకలి తీర్చడానికి కృషి చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ మేరకు దివంగత నేతకు ఆయన నివాళి అర్పించారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ఆదర్శ నేత అని ఆయన ఎప్పుడూ పేదల సంక్షేమం కోసం తపించారని అన్నారు. అలాంటి ఆశయాలను నాయకులు కొనసాగించాలన్నారు. తెలుగుజాతికి ఇవాళ పర్వదినమని అన్నారు. రైతు కుటుంబంలో పుట్టి ఎన్టీఆర్ అసాధారణ ప్రతిభ చూపారని కొనియడారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల్లోనే అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఆయనదేనన్నారు. బడుగు, బలహీనవర్గాలు, మహిళల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ కృషి చేశారన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలన్నారు. కొందరికే పరిమితమైన అధికారాన్ని సామాన్యుల వద్దకు తీసుకువచ్చారన్నారు. తెలుగు జాతికి సేవ చేయాలని సినీ రంగాన్ని విడిచి పెట్టి ఎన్టీఆర్ రాజకీయంలోకి వచ్చారనిమంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సినీ రంగంలో తెలుగు జాతికి ఎన్టీఆర్ మంచి పేరు తెచ్చారని అచ్చెన్నాయుడు అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా అచ్చెన్నాయుడు, పలువురు టీడీపీ నేతలు నివాళర్పించారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాజకీయలోకి వచ్చిన తర్వాత ప్రజల్లో చైతన్యం తెచ్చారని తెలిపారు. ఆనాడు జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలను ఏకం చేసి పోరాటం చేసిన ఘనత ఎన్టీఆర్‌దని గుర్తుచేశారు.బడుగు బలహీన వర్గాలకు అవకాశం ఇచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని వెల్లడించారు. వెనుకబడిన, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ కృషి చేశారని కొనియాడారు. వికేంద్రీకరణ, ఫెడరల్ వ్యవస్థ బలోపేతం కోసం పనిచేశారన్నారు. నేషనల్ ఫ్రంట్‌తో కేంద్రంలో ప్రత్యామ్నాయం తీసుకువచ్చారన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు ఎన్టీఆర్ పెద్దపీట వేశారని, కిలో బియ్యం రూ.2కే ఇచ్చారని కొనియాడారు. రైతు రుణాలు రద్దు, రూ.50కే హార్స్ పవర్ కరెంట్ అందజేసిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు.




# ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ నివాళి

### ఘాట్ వద్ద పలువురు శ్రద్ధాంజలి

హైదరాబాద్ : ఎన్టీఆర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్‌లు నివాళి అర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను వారు గుర్తుచేసుకున్నారు. ప్రముఖుల రాక సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు–చేశారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద నందమూరి రామకృష్ణ, సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరి నివాళి అర్పించారు. నందమూరి అభిమానులు, తెదేపా నేతలు అక్కడికి తరలివచ్చారు. తండ్రికి నివాళి సందర్భంగా తనయుడు రామకృష్ణ ఉద్వేగానికి లోనయ్యారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు శత జయంతి పురస్కరించుకుని పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద మాజీ టిడిపి నేతలు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రపంచ ఖ్యాతి గడించిన ఏకైక తెలుగు బిడ్డ ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేలా కృషి చేస్తామన్నారు. రాజకీయాల్లో, సినిమాల్లో ఆయనకు తారాస్థాయిలో అభిమానులున్నారు. మరోవైపు ఎన్టీఆర్ జయంతి వేళ ఆయన అభిమానులు, తెదేపా కార్యకర్తలు ఎన్టీఆర్ ఘాట్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఆయన సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఎన్టీఆర్ అంటే ఓ ప్రభంజనం అని.. ఆయనో సంచలనం అని అన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలుగు దేశం పార్టీ స్థాపించి దేశ రాజకీయాల్లో తెలుగు వారి సత్తా చాటిన రాజకీయ యోధుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగు జాతి చరిత్ర ఉన్నంత కాలం ఎన్టీఆర్ చరిత్ర నిలిచిపోతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

# కలియుగంలో భగవన్నామస్మరణమే

తిరుమల : కలియుగంలో భక్తి పారాయణం అన్నది భగవంతుడి కృప పొందడానికి ఉన్న ఏకైక మార్గం. తపస్సులు ఆచరించి భగవంతుడిని సాధించడానికి ఈ కలికాలంలో అసాధ్యం. నామస్మరణ ద్వారా అనుభూతి కలుగుతుంది. అది అనుభవించిన వారికే దాని మాధుర్యం తెలుస్తుంది. భగవన్నామ స్మరణ ఒక్కటే వారికి మోక్షదాయకమని వేదపురాణాలు చెబుతున్నాయి. సప్త వ్యసన పరులైనా చనిపోయేముందు రామనామ జపం చేస్తారు. నారాయణుడి పేరును తలుస్తారు. నారాయణ నామం పదేపదే ఉచ్చరించడం వల్ల నేరుగా వైకుంఠానికి చేరుకుంటామన్న భావన కారణంగా ఇలా చేస్తారు.అందుకే భగవంతుడు స్మరణతోనే సాక్షాత్కరించే యుగం ఇది. కలియుగంలో కేవలం మనస్సును లగ్నం చేసి స్మరించాలి. భగవంతుణ్ని చేరడానికి నామస్మరణే సులభమైన భక్తి మార్గమని మన పూర్వీకులు, మునులు సూచించారు. శ్వాస, ధ్యాసలను ఆ పరమాత్ముని నామ జపం మీదే ఉంచి ఆయన్ని చేరడానికి ప్రయత్నించాలి. భజనలు, పారాయణాలు, పూజలు మాత్రమే చేయాల్సి ఉంటుంది. ప్రముఖ వాగ్గేయకారులంతా భగవంతుడి నామస్మరణలో తమదైన స్తోత్రాలు చేశారు. అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు లాంటి వారంతా భగవంతుడిని ప్రేమతో ఆరాధించారు. నామస్మరణలు, భజనలు, ఆరాధనలు కేవలం భక్తిని మాత్రమే కాకుండా మనిషిలో ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం కలిగిస్తాయి. అనిర్వచనీయమైనా ఆత్మానందాన్ని ఇస్తాయి. మానసిక ఉల్లాసానికి కారణ మవుతాయి. ఆశావహదృక్పథం, ప్రేమతత్వం పెరుగుతంది. ఈ జీవితంలో భగవన్నామ స్మరణ ఒక్కటే ముక్తికి దగ్గరి దారి అని మహర్షులెందరో చాటిచెప్పారు. భగవంతుని అనుగ్రహం పొందడానికి, ఆయన ప్రేమను పొందడానికి ప్రేరణ భక్తి ఒక్కటే. భగవానుని ఆశీస్సులతో నిత్యజీవితంలో ఎదురయ్యే కష్టనష్టాల నుంచి ఉపశమనం పొందడానికి కూడా ప్రేరణ ఇస్తాయి. ఉన్నంతలో సంతృప్తిగా, సంతోషంగా, జీవన విధానాన్ని తీర్చిదిద్దుకునేందుకు ఆధ్యాత్మికత అన్నది దోహపడుతుంది. అంతెందుకు మనమంతా సన్మార్గంలో పయనించాలన్న బలమైన భావన, విశ్వాసం ఏర్పడుతాయి. వేదాంతపరమైన అంశాలను, గురువుల బోధనను, మత గ్రంథాలలో ప్రస్తావించిన విషయాలను కొంత వరకైనా అవగాహన చేసుకొని ఆచరణ చేయడం మంచింది. అయితే ఆచరణలో పెట్టకుండా ఎన్ని ప్రబోధాలు విన్నా, ఎన్ని గ్రంథాలు పారాయణం చేసినా ప్రయోజనం ఉండదు.



ఆధ్యాత్మికం

## రజతోత్సవ సభను విజయవంతం చేయండి



**తొర్రూరు, :** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని 143 హెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి ఆర్ లెనిన్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో మంగళవారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రజతోత్సవ వేడుకల గోడపత్రికను 143 హెచ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి ఆర్ లెనిన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక జర్నలిస్టుతో కలిసి లెనిన్ మాట్లాడుతూ ఈనెల 31న హైదరాబాద్ ప్రాంతంలోని స్థానిక జలవిహార్ ఆడిటోరియం నెక్లెస్ రోడ్డు వేదికలో ఏర్పాటు చేయబోయే తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం 25వ వసంతాల సంబరాలను జరుపుకుంటున్న తరుణంలో తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన జర్నలిస్టు మిత్రులందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలపై పోరాటానికి టీ జెఎఫ్ ముందుంటుందని జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం టీ జె ఎఫ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబర్ తీగల కృష్ణారెడ్డి, 143 హెచ్ జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జల వినోద్ రెడ్డి,జర్నలిస్టు సంఘం నాయకులు దేవరకొండ కృష్ణ ప్రసాద్, నన్నపు రాజు నారాయణ రాజు,ఆకుతోట యాకయ్య, సదాశివుడు, సిరికొండ విక్రమ్, ఇమ్మడి రాంబాబు, బందు శ్రీధర్,సాదు సుమన్, మహమ్మద్ అమీర్, వెల్తూరి పూర్ణచందర్, నాల్లం శ్రీనివాస్, యశ్వంత్, సైదులు, రమాకాంత్, శివ, మనోహరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తులు చేసుకోండి

**- సింగరేణి జీఎం బి.వెంకటయ్య**



**యైటింక్లయిన్ కాలని. :** ఒల్వో డంప్ ట్రక్ పై ఇస్తున్న ఉచిత ఆపరేటర్ శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలని, సింగరేణి రామగుండం రెండవ ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య ఒక ప్రకటనలో భూనిర్వాసిత కుంబాలను కోరారు. ఇందుకు గాను సింగరేణి పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువకులు, పదవ తరగతి పాసై, మైనింగ్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఎంవిటిసి) మోడల్. 2 సర్టిఫికట్, హెవీ గూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, మూడేళ్ల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. శిక్షణ రామగుండం.1వ డివిజన్ లోని టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ (టిటిసి) లో 12 రోజుల పాటు థియరీ ప్రాక్టికల్స్ ఉంటుందని, తెలిపారు. ఇక ఆసక్తి కలిగిన అభ్యర్థులు స్తానిక ఏరియా ఎంవిటిసి కార్యాలయంలో దరఖాస్తులను స్వయంగా అందజేయాలని, అలాగే నిరుద్యోగ యువకులు ఈ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇక శిక్షణ ను 02.06.2025 నుండి ప్రారంభమవుతున్నట్లు జీఎం వెంకటయ్య ఆప్రకటనలో వివరించారు.

## ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**- అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్యలు తీర్చాలి**

**- మునిసిపల్ కమీషనర్ కు బిజెపి నేతల వినతి**



**పెద్దపల్లి, మే28, :** వర్షాకాలం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు మెరుగుగైన వసతులు కల్పించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పెద్దపల్లి మునిసిపల్ కమీషనర్ ఆకుల వెంకటేష్ కు వినతిపత్రాన్ని సమర్పించిన అనంతరం బిజెపి నేత పల్లె సదానందం మాట్లాడుతూ, మునిసిపల్ పరిధిలోని 36వార్డుల్లో పరిశుభ్రత కనుమరుగయ్యిందని, డ్రైనేజీ వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని ఆరోపించారు. అంతర్గత రోడ్లు అద్వాన్న పరిస్తితికి చేరుకున్నాయని, రంగంపల్లి చీకురాయి రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుండి మునిసిపల్ శాఖ పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని, సరిపడా నిధులు వెచ్చించడంలో సర్కారు పూర్తిగా విఫలం అయ్యిందని ఆరోపించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నడుస్తున్న రెస్తారెంట్లు, బిర్యాని సెంటర్లు, మండి హౌజులు, కళ్యాని బిర్యాని, టీ, టిఫిన్ హెటల్లపై చర్యలు తీసుకోవాలని సదానందం కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు పిట్ట భాస్కర్, జట్టి రాజు, సాయికృష్ణ, భూషనవేని శ్రీనివాస్, నరేష్, శివంగారి సతీష్, రాజేశం, అక్కెపల్లి క్రాంతి కుమార్, ఎం డి ఫహీం, మోర మనోహర్, కాసనగొట్టు విజయ్, మంథని కృష్ణ, అభి, రామగిరి అఖిల్, రెవెల్లి సందీప్, వెంకటేష్, సోడా బాబు, చాతరాజు రమేష్, మేరుగు రమేష్, కొమిరిశెట్టి రమేష్, మిట్టపల్లి వెంకటేషం, నూనేటి సంపత్, బండ కరుణాకర్, సుధాకర్, కుక్క అంజి తదితరులు పాల్గొన్నారు.

## ఊటూరు సహకార సంఘ నూతన చైర్మన్‌గా ముద్దసాని ప్రదీప్ రెడ్డి



**మానకొండూర్,మే 28,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరు సహకార సంఘ నూతన చైర్మన్ గా ముద్దసాని ప్రదీప్ రెడ్డి బుధవారం భాధ్యతలు స్వీకరించారు. సోమవారం సంఘ పాలకవర్గానికై నిర్వహించిన ఎన్నికల్లో సంఘ చైర్మన్‌గా ముద్దసాని ప్రదీప్ రెడ్డి సభ్యులుగా ఎడ్ల సత్తీష్ కుమార్, ఎర్ర మల్లయ్య, జెరిపోతుల సత్తీష్, రాపాక భాగ్యమ్మ, జంత లక్ష్మీ,కొత్త రాంరెడ్డి, మందల సంపత్ రెడ్డి, పడాల చక్రవర్తి, కంకణాల నర్సింహ రెడ్డి,పల్లె సత్యనారాయణ రెడ్డి, నల్లగాషె కొమురమ్మ ఎన్నికైయ్యారు. తనతో పాటు నూతనంగా ఎన్నికైన సభ్యుల సహకారంతో సహకార సంఘం మరింత అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన చైర్మన్ ముద్దసాని ప్రదీప్ రెడ్డి తెలిపారు.

### ఆర్జీ-త్రీ ఏరియా ఎస్వోటుజియంగా పదవీ బాధ్యతల స్వీకరణ



**రామగిరి, మే 28:-** ఆర్.జి-త్రీ ఏరియా ఎస్వోటుజియం గా నియమితులైన యం. రామ్మోహన్ బుధవారం ఆర్జీత్రీ, ఎపిఎ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు కు రిపోర్ట్ చేసి బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం రామ్మోహన్ ఆర్జి త్రీ ఏరియా లో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

# మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధం

- హైకోర్టు ఆర్డర్ పాటించని కేంద్రం, ఛత్తీస్ ఘడ్, ప్రభుత్వాలు
- మావోయిస్టులతో శాంతి చర్చలు చేపట్టాలి
- పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ డిమాండ్



**పెద్దపల్లి ప్రతినిధి :** నారాయణ పూర్ బూటకపు ఎన్ కౌంటర్ లో అమరులైన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం పై నిరసిస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీప అంబేద్కర్ విగ్రహం వద్ద పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రజాసంఘాల నాయకులు హాజరై మాట్లాడుతూ ఈనెల 21 నాడు నారాయణపూర్ ఎన్కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాల అప్పగింతపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర ప్రభుత్వం అక్కడి పోలీస్ వర్గాలు కుటుంబ సభ్యులకు మావోయిస్టు మృతదేహాలను ఇవ్వకుండా నాలుగు రోజులుగా ఇబ్బందులకు గురిచేస్తూ చివరకు పోలీసులే దహన సంస్కారాలు నిర్వహించడం చట్టవిరుద్ధమని అన్నారు. ఆర్టికల్ 19 భావ ప్రకటన స్వేచ్ఛ, ఆర్టికల్ 21ప్రకారం మృత దేహాలకు కూడా మానవ హక్కులు ఉంటాయని వాటిని పాటించకుండా కుటుంబ సభ్యులకు మృత దేహాలను అప్పగించకుండ వేధింపులకు గురి చేసారని ఆరోపించారు. కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాలు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవ రావు, సహచరుల మృతిపై అనుమానాలు వ్యక్తపరుస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవ రావు, ఇతర సహచర సభ్యుల బూటకపు ఎన్ కౌంటర్ పై సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జ్ చే న్యాయ విచారణ జరిపించాలని, ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీ తో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంకురి లక్ష్మణ్, బొడ్డుపల్లి రవి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మడి కొమురయ్య, పులిపాక రవీందర్, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, దళిత లైబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్వాడీ సుదర్శన్, కె వి పి ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లేపల్లి అశోక్, మోదుంపల్లి శ్రవణ్, ఉద్యమ కారుల టిజెటఎసి రాష్ట్ర నాయకులు ఆంజనేయ శర్మ, సుచరిత, పర్వతాలు, సత్యనారాయణ, గాండ్ల మల్లేశం, సుధాకర్, జగన్, సంతోషిని, బండి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు జాతి గుండెచప్పుడు స్వర్గీయ ఎన్టీఆర్

- అభిమాన సంఘం అధ్యక్షులు ఉప్పు రాజన్న
- జిల్లా కేంద్రంలో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు



**పెద్దపల్లి ప్రతినిధి :** విశ్వవిఖ్యాత నటసార్వభౌమ,తెలుగు ప్రజల ఆత్మగౌరవం, తెలుగు సినీ కళామతల్లి ముద్దుబిడ్డ పేద ప్రజల ఆరాధ్య దైవం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, పద్మశ్రీ, డాక్టర్, స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారని ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు ఉప్పు రాజన్న అన్నారు. ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు ఉప్పు రాజన్న ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి , అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పు రాజన్న మాట్లాడుతూ చలనచిత్ర, రాజకీయ రంగాలలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి, తెలుగునేల వున్నంతవరకూ తనను గుండెల్లో పెట్టుకుని పూజించేలా మరణంలేని జననాన్ని పొందిన చిరస్మరణీయుడు, తెలుగుజాతి గౌరవానికి నిలువెత్తు నిదర్శనమైన కారణజన్ముడు, తెలుగుభాష గొప్పతనాన్ని ఖండాంతరాలకు చాటిచెప్పిన యుగపురుషుడు, తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు, మనందరి ఆరాధ్యదైవం మహనీయుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు గారన్నారు. అంతేకాకుండా అన్నగారి అసాధారణ జీవితం మరియు వారసత్వాన్ని గుర్తించి ఆయన దార్శనిక నాయకత్వం కళా ప్రతిభ మరియు తెలుగు లక్ష్యం పట్ల అంచలమైన భక్తి తెలుగు వారి గుండెల్లో అన్నగారి జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు.ఎన్టీర్ తెలుగు గర్వానికి తిరుగులేని చిహ్నం, తెలుగు ప్రజలకు ఆయన చేసిన కృషి సినిమా మరియు రాజకీయ రంగాలను అధిగమించింది. సాంస్కృతిక ప్రముఖుడిగా తెలుగు చరిత్ర మరియు వారసత్వాన్ని జరుపుకునే మైలురాయి ప్రదర్శనల ద్వారా ఆయన తెలుగు భాష జానపద కథలు మరియు సంప్రదాయాలను తిరిగి ఉత్తేజపరిచారన్నారు. సినీ కళామతల్లి ముద్దుబిడ్డగా సినీ రంగంలో ఎన్నో విభిన్నమైన పాత్రలను ప్రదర్శించి తనదైన శైలిలో గుర్తింపును సాధించారన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి, 9 నెలల కాలంలోనే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీ నందమూరి తారక రామారావు గారు బాధ్యతలు తీసుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సామాజిక న్యాయం ,వికేంద్రీకరణ మరియు ప్రజా కేంద్రీకృత పరిపాలనపై ఆధారపడిన ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రజలకు అందించారన్నారు. అదేవిధంగా మహిళా సోదరీమణులు అందరూ నా తెలుగింటి ఆడబిడ్డలని, మహిళల కోసం ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చారన్నారు. అన్నగారి తుది శ్వాస వరకు పేద ప్రజల సంక్షేమం కోసమే పోరాడారన్నారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు రెండు అన్నగారికి తప్పకుండా భారతరత్న అవార్డు ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అన్న గారి అభిమానులకు ప్రతి ఒక్కరికి పేరుపేరున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అభిమానులు బొడ్డుపల్లి శ్రీనివాస్, భూతగడ్డ సంపత్, రంగు శ్రీనివాస్, చెన్నూరి రమేష్ , వరాల చంద్రయ్య, బొడ్డుపల్లి తిరుపతి, బొంకూరి నర్సయ్య, కొప్పుల మురళి, శ్రీపతి ప్రభాకర్ ,నాగుల ఓదెలు, ఆరిఫ్, అంగిడి కుమార్, ,ఆసిఫ్, రమేష్, దావల శ్రీనివాస్, శ్యామ్, వల్లెపు రవి, సురేష్, సలీం కార్తీక్, సుధాకర్, రవి, సత్యం, తాళ్ల కళ్యాణ్, సీనియర్ అభిమానులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ బోధనా పద్దతులతో ఇల్లంతకుంట మనబడి




**ఇల్లంతకుంట,మే 28, :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్( జీవశాస్త్రం)గా పనిచేస్తున్న ఉడుత మహేష్ చంద్ర రాష్ట్రస్థాయిలో బెస్ట్ ప్రాక్టీస్ అవలంబిస్తున్న ఉపాధ్యాయులుగా జిల్లా నుండి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాదు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేసిన సదస్సులో మహేష్ చంద్ర పాల్గొని తాను పాఠశాలలో ఆచరించిన వినూత్న పద్ధతులతో విద్యార్థులు వివిధ సైన్స్ కార్యక్రమాల్లో అంతర్జాతీయ, జాతీయ,రాష్ట్ర, జిల్లా స్థాయిలో వివిధ బహుమతులు సాధించారని తెలిపారు.మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాల పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో సేకరించిన 10 లక్షతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదుల విషయం రాష్ట్రస్థాయి అధికారుల దృష్టిని ఆకర్షించింది.తాను భవిష్యత్తులో చేపట్టబోయే వివిధ కార్యక్రమాలను,పాఠశాల విద్యార్థుల సంఖ్య పెంపుదలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి విజయాలను మహేష్ చంద్ర ప్రదర్శించారు.ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఐదు రోజులపాటు జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య,రిసోర్స్ పర్సన్స్ తిరుపతిరెడ్డి,యాద రవి ,భాస్కర్ రెడ్డి, దూస సంతోష్ , బయో సైన్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ మహేష్ చంద్రను సన్మానించడంతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. ప్రేమలత, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు మహేష్ చంద్రను అభినందించారు.

## బీసీలకు సముచిత స్థానం కల్పించింది ఎన్టీఆరే...

**- రాజకీయంగా ప్రోత్సహం అందించిన చరిత్ర ఆయనదే**

**- పూలే తర్వాత బడుగు వర్గాల కోసం ఆలోచన చేసిండు**

**- ఎన్టీఆర్ జయంతిలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**





**రామగిరి మే 28:-** స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పార్టీ ఆవిర్భావం తర్వాతనే తెలంగాణాలోని బీసీ వర్గాలకు సముచిత స్థానం లభించిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా మంథనిలోని బొక్కలవాగు వంతెనపై ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పార్టీ ఆవిర్భావం కంటే ముందు తెలంగాణాలోని అనేక మంది అట్టడుగు బడుగు వర్గాలు తల ఎత్తుకునే పరిస్థితులు ఉండేవి కావన్నారు. కానీ ఎన్టీఆర్ పార్టీ ఆవిర్భావం తర్వాత బీసీలను గౌరవించి ఎస్సీలను ముందుకు తీసుక్నొరని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా గౌడ, ముదిరాజ్, పద్మశాలి, యాదవ కులస్తులకు రాజకీయంగా ప్రజాప్రతినిధులగా అవకాశం కల్పిస్తూ ప్రోత్సాహం అందించి తల ఎత్తుకునేలా చేశారని అన్నారు. ఎన్టీఆర్‌తోనే ఎక్కువగా చైతన్యం వచ్చిందనే విషయాన్ని ఏనాటికి మర్చిపోమన్నారు. ఆనాడు మహాత్మ జ్యోతిరావుపూలే ఎలాగైతే బడుగు బలహీనవర్గాల కోసం ఆలోచన చేశారో ఆయన తదనంతరం ఎన్టీఆర్ కూడా అదే రీతిలో ఆలోచన చేశారని ఆయన కొనియాడారు. మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుతున్న తాము మహనీయుల విగ్రహాలతో పాటు ఎన్టీఆర్ విగ్రహాన్ని సైతం ఆవిష్కరించుకోవడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ అంటేనే ఒక మహెూతన్నమైన నాయకుడని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్బవ దినోత్సవ వేడుకలు

# అత్యంత వైభవంగా నిర్వహించాలి

## ◆ ఆర్జీ-1 జియం లలిత్ కుమార్



**గోదావరిఖని ప్రతినిధి :** ఆర్జీ-1 ఏరియాలో నిర్వహించు "తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను" అంగరంగ వైభవంగా స్థానిక జవహార్ లాల్ నెహ్రూ స్టేడియం నందు నిర్వహించాలని ఇందుకు సంబందించిన ఏర్పాట్ల గురించి బుధవారం రోజు జీఎం కార్యలయం నందు ఆర్జీ-1 జియం లలిత్ కుమార్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా జియం మాట్లాడుతూ ఆర్జీ-1 ఏరియాలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని, అన్ని గనులు డిపార్ట్ మెంట్ల ఉన్నతాధికారులు వారికి నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ వేడుకలను కన్నుల పండుగగా నిర్వహిస్తున్నట్లు, పలు సాంస్కృతిక కార్యాక్రమాలు, వివిధ రకాల రుచికరమైన స్టాళ్ళను ఏర్పాటు చేస్తున్నామని,సాయంత్రం 5.30 గంటల నుండి కార్యక్రమం ప్రారంభంకానున్నదని, కావున ఉద్యోగులు, సూపర్ వైజర్లు, యూనియన్ ప్రతినిధులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులు పట్టణ ప్రాంత పురజనులందరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాల్సిందిగా వారు తెలియజేశారు. అదే విధంగా ఉదయం జీఎం కార్యలయం నందు పతాక ఆవిష్కరణ జిఎం కార్యాలయం నుండి "తెలంగాణా రన్" అనంతరం జిఎం కార్యాలయం వద్ద ఉన్న తెలంగాణ తల్లి కి పులా మాలల ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని, జూన్ -2 న అన్ని గనులు, విభాగాల్లో ఉదయం జాతీయ పతాకాన్ని ఎగరవేయాలని, గనులను, కార్యాలయాలను మామిడి తోరణాలతో, కొబ్బరి, అరటి ఆకులతో రంగు రంగుల కాగితాలతో అలంకరించాలన్నారు. ఇందుకు సంబందించిన ఏర్పాట్ల పనుల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడ కుడా ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు పకడ్బందిగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జిఎం గోపాల్ సింగ్, డిజియం పర్సనల్ కిరణ్ బాబు, ఏజీఎం ఐ.ఈ.డి ఆంజనేయులు, ఏజీఎం ఎక్స్ ప్లోరేషన్ శివనారాయణ, ఏజెంట్లు చిలక శ్రీనివాస్, రమేష్, ఎన్విరాన్ మెంట్ ఆంజనేయ ప్రసాద్, డిజీ.ఎం వర్క్ షాప్ జితేందర్ సింగ్, డిజియం సివిల్ వరప్రసాద్, ధన లక్ష్మి బాయి, డిజియం ఫారెస్ట్ కర్ణ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఐ.టి మేనేజర్ రాజేష్, మేనేజర్లు డినిల్ కుమార్, రమేష్ కుమార్, సీనియర్ పిఒ శ్రావణ్ కుమార్, హనుమంత రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణ నిర్మూలించడం అందరి బాధ్యత

## ◆ జిల్లా విద్యాశాఖ అధికారిని మాధవి, ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ




**పెద్దపల్లి ప్రతినిధి :** మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలు అందరు భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చునని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి సంస్థ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా శాఖ అధికారిని మాధవి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అన్నారు. దీనికి పేద మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువ గా గురి అవుతున్నారని, సమాజంలో ప్రజలతో మరియు విద్యార్థులతో సన్నిహితంగా ఉండి గమనించి వారికి అవగాహనా కల్పించాలని, ముఖ్యంగా పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్స్ లో వారికి అవగాహనా కల్పించాలని అన్నారు. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా విస్తరిస్తున్న జటిలమైన సమస్య కాబట్టి పిల్లలకు ఫోన్ ఉపయోగించడం ద్వారా వచ్చే నష్టాలను తెలియజేయాలని అన్నారు. సమాజంలో ఉన్న చాలా సమస్యలకు ఆర్థిక కారణలతో పాటు, సామజిక కారణాలు దోహదం చేస్తాయి, మన చుట్టుపక్కల ఉండే ఇలాంటి వాళ్ళను ట్రాఫికెర్స్ టార్గెట్ చేసి, మాయమాటలు, ఉద్యోగం సినిమా అవకాశం అంటూ పట్టణాలకు తీసుకెళ్లి వ్యభిచార గృహాలలో అమ్ముతున్నారు, కాబట్టి మన డిపార్ట్మెంట్ జిల్లా నుండి గ్రామ స్థాయి వరకు అందరు అవగాహనా కలిగి ఉండి, అప్రమతం చేయడం ద్వారా దీన్ని నిర్మూలించవచ్చని అన్నారు. ఆనంతరం ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించు కోవచ్చన్నారు, ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు మహిళలు దీని బారిన పడుతున్నారని, ముఖ్యంగా యువత, పిల్లలు ఆకర్షణకు గురి అయి, పట్టణాలకు వచ్చి వ్యభిచార గృహాలలో అమ్మబడుతున్నారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి వరకు 30 వేల మంది అమ్మాయిలను మహిళలను కాపాడడం జరిగిందన్నారు. ఇందులో చిన్న పిల్లలు, యువతులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. సైబర్ ట్రాఫికింగ్ ద్వారా ఈ అక్రమ రవాణా చాలా పెరిగి పోయింది, ముఖ్యంగా విద్యార్థులు అనవసరం అయిన అప్స్ ద్వారా పర్సనల్ ఫొటోస్ వీడియోస్ పంపడం ద్వారా సెక్స్ ట్రాఫికింగ్ కి గురి అవుతున్నారు. మీరు జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ఉన్న మన సిబ్బంది ఈ విషయాలపై అవగాహనా పొంది ఇతరులకు అవగాహనా కల్పించాలని సూచించారు. ఈ శిక్షణలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం ఎలా జరుగుతుంది, బాధితురాలి పైన ఉండే ప్రభావాలు, సైబర్ అదారిత అక్రమ రవాణా, చట్టాలు బి ఎన్ ఎస్, ఐటిపిఎ, పోక్సో, పిసిఎమ్ఎ, సఖి, భరోసా, చైల్డ్ లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నంబర్స్ 1098, 100, 181, 1930, 181 ల గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ అధికారిని మాధవి, ప్రజ్వల ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ, జిసిడిఓ కవిత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రన్సిపాల్ అరుణ, ప్రజ్వల సిబ్బంది అంబర్ సింగ్, కెజిబివి, మోడల్ స్కూల్ ఊపాధ్యాయులు పాల్గొన్నారు.

# తబిత ఆశ్రమంలో ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



**గోదావరిఖని ప్రతినిధి :** ఎన్టీఆర్ 102వ జయంతి శుభ సందర్భంగా బుధవారం నాడు రామగుండం లోని "తబితా ఆశ్రమం"లో పిల్లల మధ్య 'కేక్ కటింగ్', పండ్ల పంపిణి' చేస్తు ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలు ఎన్టీఆర్ అభిమాని, తాజా మాజీ కార్పొరేటర్ 'కన్నూరి సతీష్ కుమార్' ఆధ్వర్యంలో నిర్వహించినారు. ఈ సందర్బంగా ఎన్టీఆర్ అభిమాని కన్నూరి సతీష్ కుమార్ మాట్లాడుతూ "సమాజమే దేవాలయం-పేద ప్రజలే దేవుళ్ళు" అని నినదించిన పేద ప్రజల పక్షపాతి, ఆకాశంలో సగభాగమైన ఆడవాళ్ళకు ఆస్తిలో కూడ సగభాగం అని చెప్పిన సామాజిక విప్లవ నాయకుడు, కళ కాసుల కోసం కాదు, ప్రజల కోసం అంటు చాటిన ప్రజా కాళారుడు, బడుగు బలహీన, హరిజన, గిరిజన, మైనారిటి వర్గాలకు అన్నింట అభివృద్ధిని, సంక్షేమం ను అందిచాలని ఆశించి నడుం బిగించి సాధన చేసిన అభినవ అంబేద్కరుడు మన నందమూరి తారక రాముడు. అందుకె ఎన్టీఆర్ అసాధ్యుడు, అమరుడు. ఎన్టీఆర్ అభిమాని గా ప్రజల పక్షాన నిరంతరం సామాజిక సేవ కొనసాగిస్తామని " అన్నారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు జనగామ తిరుపతి మాట్లాడుతూ "ఎన్టీఆర్ సామాజిక దృక్పథం, నిజాయితీ, క్రమశిక్షణ సేవానీరతి ఇప్పటి తరాలకు తెలపల్సిన అవసరం ఉందని " అన్నారు. ఈ కార్యక్రమం లొ సిరికొండ కోటి, ఎస్ కె బాబూమియా రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# భీం ఆర్మీ నూతన కమిటీ నియామకం.....!



**మానకొండూర్,మే 28,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ ఆద్వర్యంలో బుధవారం నియోజకవర్గస్థాయిలో భీం ఆర్మీ నూతన కమిటీ నియామక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి ఎలగందుల అనిల్ ముఖ్య అతిధిగా హజరై నియోజకవర్గ అధ్యక్షుడిగా నెలవేణి ఉదయ్,మానకొండూర్ మండలాధ్యక్షుడిగా నెలవేణి ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా ఎల్కపల్లి అనిల్ కుమార్,గొర్రె సాయి కిరణ్, ప్రధాన కార్యదర్శిగా ఇల్లందుల రాజు, కార్యదర్శిగా కాల్వల వంశీ, కోశాధికారిగా సుంకు అరవింద్, కార్యవర్గ సభ్యులుగా మోదుంపల్లి శివకుమార్, సంకెనపెల్లి నవీన్ కుమార్, అధికార ప్రతినిధిగా నేలవేణి సతీష్, ప్రచారా కార్యదర్శిగా తాళ్ళపెల్లి రాజ్ కుమార్ లను ఏకగ్రీవంగా నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ..... నియోజకవర్గ వ్యాప్తంగా భీం ఆర్మీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని తెలుపుతూ తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యదర్శి ఎలగందుల అనిల్, జిల్లా అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# అమెరికా డల్లాస్‌లో మాజీ మంత్రి కొప్పులకు ఘన స్వాగతం పలికిన ఎన్నారైలు

**ధర్మపురి, మే 28, :** అమెరికా డల్లాస్ లో మాజీ మంత్రి కొప్పులకు ఎన్నారైలు, బిఆర్ఎస్ పార్టీ శ్రేయోభిలాషులు ఘన స్వాగతం పలికారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 1.2 తేదీన జరిగే 25 ఏండ్ల బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు బుధవారం అమెరికాలోని డల్లాస్ కి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఎన్నారై లు, బిఆర్ఎస్ పార్టీ శ్రేయోభిలాషులు, స్వాగతం పలికారు. తనకు స్వాగతం పలికిన ఎన్నారైలకు బిఆర్ఎస్ పార్టీ శ్రేయోభిలాషులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాజీ మంత్రి కొప్పుల వెంట రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, రాష్ట్ర మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ ఉన్నారు. అమెరికా చేరుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డల్లాస్ లో జూన్ 1,2 తేదీల్లో నిర్వహించే 25 ఏండ్ల బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో పాల్గొంటారని నాయకులు తెలిపారు.



# మారు పేర్లు విజిలెన్స్ కేసులన్నింటిని వెంటనే పరిష్కరించాలి

## - జీఎల్బీకేఎస్-ఐఎఫ్టియూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.కృష్ణ






**రామగిరి, మే 28:-** సింగరేణి ఆర్జి-త్రీ జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి (జీఎల్బీకేఎస్-ఐఎఫ్టియూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ కృష్ణ, ఎస్సిసిడబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న లు జనరల్ మేనేజర్ కి మెమోరండం ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా (జీఎల్బీకేఎస్-ఐఎఫ్టియూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ కృష్ణ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా విజిలెన్స్ వద్ద పెండింగ్లో ఉన్న మారు పేర్లు ఇతర విచారణ నిమిత్తం ఉన్న అన్ని కేసులను యాజమాన్యం పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని దీనితో విసుకు చెందిన బాధితులంతా రోడ్ ఎక్కి సింగరేణి యజమాన్యం తమ సమస్యల్ని పరిష్కరించాలని గొంతు ఎత్తి అరిచిన కనుకరించక పోవడం వారి యెడల తీవ్రమైన వ్యతిరేకతతో ఉండడం వారి సమస్య పరిష్కరించకుండా అనేక చిక్కులు కల్పిస్తున్న సింగరేణి యాజమాన్యం వన్ టైం సెటిల్మెంట్ కింద చట్టబద్ధంగా ఉన్న జెన్యూన్ కేసుల్ని తక్షణమే పరిష్కరించాలని లేనట్లయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు బాధితులకు అండగా నిలుస్తాయని సింగరేణి యజమాన్యం అందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. సింగరేణి యాజమాన్యం యొక్క నిరంకుశ చర్యల్ని కార్మికులు కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాలని విజిలెన్స్ పెండింగ్ కేసుల్లో బాధితులుగా ఉన్న డిపెండెంట్ పిల్లలందరికీ సంఘీభావం ప్రకటించి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్సిసిడబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న, (జీఎల్బీకేఎస్ -ఐఎఫ్టియూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ నరేష్,బి అశోక్, నాయకులు ఐ రాజేశం, తోట్ల రాయమల్లు తో పాటు జే సతీష్, ఏ రాజశేఖర్, శ్రావణ్, జీ సుధాకర్, ఎం వెంకన్న, తిరుమల శ్రీనివాస్, రామెల్ల సందీప్, సంతోష్, హరీష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ చర్యలు తక్షణమే చేపట్టాలి

- సింగరేణి తవ్విన కాలువ,నాలా తో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రమాదం
- ఎలాంటి హాని జరిగిన సింగరేణి అధికారులే బాధ్యత
- మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు



**రామగిరి, మే 28:-** రామగిరి మండలం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో సింగరేణి తవ్విన కాలువ,నాలా తో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆర్జీ-త్రీ,అడ్రియాల జీఎం కొలిపాక నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు.రామగిరి మండలం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల ఎంఈఓ (ఎం.ఆర్.సి) కార్యాలయం మధ్య ఉన్న చిన్న వాగు ఉండగా, దీనిని ఇటీవల సింగరేణి అధికారులు జెసిబి వాహనం ద్వారా పెద్దకాలువ/నాళ గా తవ్వించారు. ఆర్జీ-త్రీ డివిజన్ లద్నాపూర్ భూనిర్వాసితుల కోసం పాత,కొత్త ఆర్అండ్ఆర్ సైట్లో సుమారు 1250 ప్లాట్లతో పాటు రామగిరి ఖిల్లా నుంచి వచ్చే వరదనీరు, సెంటినరికాలనీ సిటూ క్వార్టర్స్, రాంనగర్ నుండి వచ్చే మురికినీరు / వరదనీరు బయటకు వెళ్లడానికి కొత్తకుంటలో భారీ కాలువ/ నాళా తవ్వారు. దీనిలో భాగంగా ప్రభుత్వ పాఠశాల ఎంఈవో కార్యాలయం మధ్య నుంచి చిన్న కాలువను, భారీ లోతుతో తవ్వారు. ఇక ఇక్కడ అసలు కథ ప్రారంభమయ్యిందని తెలిపారు. పాఠశాల కాలువకు రక్షణ లేదు. భారీగా వరదనీరు ప్రవహించే సమయంలో విద్యార్థులు ఇందులో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. రక్షణ లేకుండా వాగును కాలువగా చేసిన అధికారులు తక్షణమే పరిశీలించి, రక్షణ చర్యలు చేపట్టాలి. పాఠశాల ప్రారంభానికి ముందే తమకు విన్నవిస్తున్నాం. కాబట్టి ఎలాంటి హాని జరిగిన సింగరేణి అధికారులే భాధ్యత వహించవల్సి ఉంటుంది. అలాగే రక్షణ చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

# పుణ్యక్షేత్ర పరిధిలో అన్యమత ప్రచారం గోవధ సంవరణ చట్టంను కఠినంగా అమలు చేయాలి



**ధర్మపురి, మే 28, :** పుణ్యక్షేత్ర పరిధిలో అన్యమత ప్రచారం, గోవధ సంవరణ చట్టంను కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ ధర్మపురి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ కి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మపురి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటి కావున జీవో 2007 ప్రకారం పుణ్యక్షేత్ర పరిధిలో అన్యమత ప్రచారం గానీ, గోవధ సంవరణ గాని కఠినంగా నిషేధించబడినది. కావున బక్రీద్ సందర్భంగా జరిగే గోవధను 1977 చట్ట ప్రకారం అడ్డుకొని మిగతా జంతువుల వధ కొరకు ధర్మపురి పుణ్యక్షేత్ర పరిధిలో ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని మెమొరాండం పట్టణ మున్సిపల్ కమిషనర్ కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అల్లం దుర్గాప్రసాద్, కస్తూరి రాజన్న, మ్యాన పూర్ణచందర్, ముత్యపు రమేష్, నలుమాసు వైకుంఠం, ఎలగందుల రవి, ఆసం సురేష్, కలకోట రాజేష్, తిరుమందాస్ సత్యనారాయణ, చీపురుశెట్టి దేవేందర్, మండలోజు సూరజ్, కాశెట్టి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## వేడుకలకు హాజరైయ్యే వారికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలి

**- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన ఆర్జీ-త్రీ,ఎపిఎ జియం**



**రామగిరి. మే 28:-** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల కోసం జూన్ 2 తేదీన నిర్వహించే స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో చేయవలసిన ఏర్పాట్లను బుదవారం పరిశీలించిన రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ఆయన మాట్లాడుతూ ఈ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసే వివిధ రకాల స్టాల్స్, సభ ప్రాంగణం, అమర వీరుల స్తూపం వద్ద ఏర్పాట్లను ఏ విధంగా చేయాలో అలాగే వేడుకలకు హాజరైయ్యే వారికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచిస్తూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, కాలనీవాసులు, పరిసర ప్రాంతాల వారు అధిక సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలని పేర్కొన్నారు. వారి తో పాటు ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్ బాబు, సివిల్ డీజీఎం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఎలక్ట్రికల్ డివైఎస్ఇ సంజీవ్ కుమార్, అధికారులు సునిల్ ప్రసాద్, రాజేశం తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీ కి పౌష్టిక ఆహారం పంపిణీ



**కోల్ సిటీ :** గోదావరిఖని బాపూజీ నగర్ లోని , గర్భిణి మహిళలకు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ ,సురభి శ్రీధర్ జన్మదినం సందర్భంగా మంగళవారం సాయంత్రం పౌష్టిక ఆహారం సంబంధించిన వస్తువులను అమ్మ పరివార్ స్వచ్ఛ సేవ సంస్థ ఆధ్వర్యంలో డా. సురభి శ్రీధర్ అందించారు. అనంతరం సురభి శ్రీధర్ మాట్లాడారు. గర్భిణీ తో ఉన్న మహిళలు పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భిణీ తో ఉన్న ప్రతి మహిళ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అమ్మ పరివర్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. నిస్సహాయ పిల్లలకు ఆశ్రయం ఇవ్వడం కాకుండా ప్రతిరోజు నిస్సహాయులకు, నిర్భాగ్యులకు అన్న దాన కార్యక్రమం చేపడుతున్న సంస్థ బాధ్యులందరికీ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ పక్షాన ధన్యవాదములు తెలుపుతున్నామని సురభి శ్రీధర్ తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో అమ్మ పరివార్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారి సహస్ర అమ్మ పరివార్ సంస్థ నిర్వాహకులు మంద నాగరాజు, కరణ్, అంగన్వాడి టీచర్ రమా తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కొరకు ధర్నా, రాస్తారోకో..

**- పోలీసులు సద్ది చెప్పడంతో వెనుదిరిగిన గ్రామస్తులు...**





**జమ్మికుంట మే 28 :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలు జరుగుతున్నాయని రోడ్డెక్కిన గ్రామస్తులు. జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టానుసారంగా తమ బంధువులకు వారికి అనుగుణంగా ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం జరిగింది అని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించలేదు అని గ్రామస్తులు గ్రామ కార్యదర్శిని నిలదీయగా, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన వారిని ఎంపిక చేయడం జరిగింది. మా చేతిలో ఏమీ లేదు అని తెలిపారు. గ్రామ కార్యదర్శి మాటలు విన్న గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శేఖర్ రెడ్డి మడిపల్లి గ్రామానికి చేరుకొని గ్రామస్తులకు సద్ది చెప్పడంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమాల్లో దూడపాక సుశీల, తాళ్లపల్లి నాగరాజు, ఎండి చాన్ పాషా, నేరెళ్ల తిరుపతి, అంబాల సమ్మక్క, దేవునూరి విజయ, అంబాల భారత సంద గళ్ళ మమత తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత

- ఆర్జీ-త్రీ, ఎపిఎ ఏరియా లో పర్యటించిన కేంద్ర పర్యావరణ డైరెక్టర్, శాస్త్రవేత్త కె.తరుణ్ కుమార్









**రామగిరి, మే 28:-** పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ ను వాడద్దని కేంద్ర పర్యావరణ అండ్ అటవీ శాఖ డైరెక్టర్, శాస్త్రవేత్త హైదరాబాద్ రీజియన్ కె.తరుణ్ కుమార్ అన్నారు. బుధవారం వారు రామగుండం -త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో పర్యటించారు. ముందుగా జియం కార్యాలయము నందు 22 మే నుండి 5 జూన్ వరకు నిర్వహిస్తున్న పర్యావరణ వక్షోత్సవాల అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర పర్యావరణ అండ్ అటవీ శాఖ డైరెక్టర్, శాస్త్రవేత్త హైదరాబాద్ రీజియన్ కె.తరుణ్ కుమార్ పాల్గొని జిఎం కార్యాలయ అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు ఉద్యోగులకు జ్యూట్ బ్యాగ్స్ అందజేశారు. తదుపరి జియం కార్యాలయ ఆవరణ లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవాలని, ముఖ్యంగా ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ ను అసలే వాడద్దని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అన్నారు. అనంతరం ఓసిపి-వన్ ఉపరితల గని రెమిడేషన్ ప్లాన్ లో భాగంగా జూలపల్లి, ముల్కలపల్లి, పన్నూర్, రత్నాపూర్, నాగేపల్లి గ్రామాలలో చేపట్టిన చెక్ డ్యామ్ లు, సీసీ రోడ్లు, సోలార్ లైట్లు, ఇంకుడు గుంతలు, బస్ షెల్టర్లు, ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఓసిపి-వన్ ఉపరితల గని లోని వ్యూ పాయింట్, పండ్ల మొక్కల పెంపకం, విండ్ బ్యారియర్, గ్రీన్ బ్యారియర్, ఎస్ టి పి ప్లాంట్ మొదలగునవి పరిశీలించారు. ఓసిపి -వన్ రెమిడేషన్ ప్లాన్ లో భాగంగా చేపట్టిన పనుల వివరాలను రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎన్విరాన్మెంట్ విభాగం జనరల్ మేనేజర్ సైదులు, ఎస్వోటుజియం ఎం.రామ్మోహన్, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్ బాబు, ఫైనాన్స్ ఎజియం పి.శ్రీనివాసులు, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, ఎన్విరాన్మెంట్స్ డీజీఎంలు పి.రాజారెడ్డి, కిషన్, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఫారెస్ట్రీ విభాగాధిపతి కళ్యాణ్, కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ విభాగం అధికారులు సిహెచ్. శ్రీనివాస్, రవి కిరణ్ తోపాటు వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సింగరేణి గనిలో కేంద్ర పర్యావరణ డైరెక్టర్ పర్యటన

**యైటింక్లయిన్ కాలని. :** కేంద్ర పర్యావరణ డైరెక్టర్, శాస్త్రవేత్త కె. తరుణ్ కుమార్ కత్తుల (హైదరాబాదు) రీజియన్, బుధవారం సింగరేణి రామగుండం రెండవ ఏరియాలో పర్యటించారు. వకీల్ పల్లి గని యాజమాన్యం గని ఏజెంట్ కార్యాలయం ఆవరణలో ఈనెల 22 నుండి జూన్ 5 వరకు నిర్వహిస్తున్న పర్యావరణ పరిరక్షణ క్యాంపెయిన్ లో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు వచ్చిన డైరెక్టర్ తరుణ్ కుమార్ కత్తుల ను ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య సాధారణంగా స్వాగతించారు. ఇక ఇక్కడికి వచ్చిన ఆయన ముందుగా వకీల్ పల్లి గని పరిసరాలను పరిశీలించి, గని అధికారులు, కార్మికులతో కలిసి కానీ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు ఉద్యోగులకు జ్యూట్ బ్యాగులు అందజేశారు. తదనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని, అదే క్రమంలో పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ ను అసలే వాడద్దని, అలాగే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం వకీల్ పల్లి భూగర్భ గని రెమిడేషన్ ప్లాన్ లో భాగంగా పెంచికలపేట్, సమ్మక్క గద్దెలు, న్యూ పెద్దంపేట్, న్యూ మారేడుపాక, కోల్ కారిడార్ రోడ్డు, అల్లూరు చెరువు, చందనాపూర్ తదితర గ్రామాలలో చేపట్టిన సీసీ రోడ్లు, సోలార్ లైట్లు, దోబీ ఘాట్, అల్లూరు చెరువు కట్ట, బస్ షెల్టర్లు, ఇంకుడు గుంటలు, చేతి పంపులు పరిశీలించారు. ఇక గని రెమిడేషన్ ప్లాన్ లో భాగంగా చేపట్టిన పనుల వివరాలను ఏరియా జీఎం వెంకటయ్య, డైరెక్టర్ తరుణ్ కుమార్ కు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ విభాగం జీఎం సైదులు, గని ఏజెంట్ ఎ.నెహ్రూ, కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ విభాగం అధికారులు సిహెచ్. శ్రీనివాస్, గని మేనేజర్ రవి కిరణ్, ఏరియా పర్యావరణ అధికారి సురేష్ బాబు, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మొహమ్మద్, డివైఎస్ఇ సివిల్ వినయ్ సాగర్, ఓసిపి.3 పర్యావరణ అధికారి వేణు కుమార్, ఫారెస్ట్ అధికారి నవీన్ కుమార్, డివైపిఎం శ్యాం ప్రసాద్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





# కార్మికుల కొరకు తలపడిన కలం యోధుడు "మునీర్"



**యైటింక్లయిన్ కాలని. :** ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు మునీర్ కు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సభ్యులు బుధవారం నివాళులు అర్పించారు. సాయంత్రం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సీనియర్ జర్నలిస్టు మునీర్ సంస్కరణ సభలో పాల్గొన్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి, బ్రాంచ్ ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్, సభ్యులు మునీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాజిరెడ్డి మాట్లాడుతూ.. నల్ల నేల ముద్దుబిడ్డ, సింగరేణి గని కార్మికుల హక్కులు, సంక్షేమం కొరకు అధికారులతో తలపడిన నిలబడిన కలం యోధుడు, సీనియర్ జర్నలిస్టు మునీర్ అన్నా అని కొనియాడారు. సింగరేణి కార్మికులు మునీర్ అన్నను ఆదర్శంగా తీసుకొని సమస్యల పరిష్కారం కొరకు రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నిజాయితీతో సమస్యల పరిష్కారానికి పేదల పక్షాన నిలబడటమే మునీర్ అన్న కు నిజమైన నివాళి అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో నాయకులు పర్లపెల్లి రవి, పోలాడి శ్రీనివాస్, పింగళి సంపత్ రెడ్డి, వడ్డేపల్లి శంకర్, నాగెల్లి సాంబయ్య, ఇస్సంపెల్లి రమేష్, బేతి చంద్రయ్య, తిరుపతి, సురేందర్, రవితేజ, వెంకటేష్, శ్రీనివాస్, తిరుపతి, ఐ.శ్రీనివాస్, లింగారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు వైద్య శిబిరం ఏర్పాటు

**ముత్తారం.మే.28.:** ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కరీంనగర్ సన్ రైస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని కేశనపల్లి గ్రామస్తులు 500కు పైగా సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బక్కతట్ల వినీత్,గ్రామ శాఖ అధ్యక్షులు పెగడ కుమార్,గ్రామ యూత్ అధ్యక్షులు నవీన్ రెడ్డి,సన్ రైస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రక్షిత, క్యాంప్ మేనేజర్ రాజేందర్, కోఆర్డినేటర్ సతీష్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తిరుపతి మరియు సన్ రైస్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రణవ్..

**హుజురాబాద్ మే 28:** మాటలు చెప్పడం కాదు చేతల్లో కూడా ముందు వరుసలో ఉంటారని మరోసారి రుజువు చేశారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.జమ్మికుంట మండల పరిధిలోని జగ్గయ్యపల్లి గ్రామంలోని శ్రీ భక్తఆంజనేయ స్వామి దేవాలయానికి వచ్చినప్పుడు బోర్ మోటార్ పాడైందని సభ్యులు వివరించగా ఇచ్చిన మాట ప్రకారం జగ్గయ్యపల్లి గ్రామంలోని శ్రీ భక్తఆంజనేయ స్వామి దేవాలయానికి బోర్ మోటార్ ఇప్పించారు ప్రణవ్.దీని పట్ల హర్షం వ్యక్తం చేశారు ఆలయ కమిటీ సభ్యులు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయినేని రాజేశ్వర్ రావు,గ్రామ శాఖ అధ్యక్షుడు బాపురావ్,ఆలయ కమిటీ చైర్మన్ దుగ్గినాల రవీందర్,గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్ రావు,వైస్ చైర్మన్ తూముల తిరుపతి రావు,కోశాధికారి రాజు,సభ్యులు పొనగంటి రాజేశ్వర్ రావు,ఆవిరినేని రవీందర్ రావు,నాయినేని రాజేశ్వర్ రావు,కంకట రాజశేఖర్,ముక్కిడి మహేందర్,గుజ్జ కిరణ్ రావు, వెంగల్ రావు,రాజేశ్వర్ రావు,లింగంపల్లి రాజు,గాజ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ఐటీ మంత్రి వర్యులను మర్యాద పూర్వకంగా కలసిన రాష్ట్ర కాంగ్రెస్ సేవాదల్ సెక్రటరీ..

**జగిత్యాల, ప్రతినిధి :** జగిత్యాల జిల్లా నుంచి తెలంగాణా సచివాలయం లో మాజీ మంత్రి జీవనరెడ్డి గారి తో కలిసి తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రి వర్యులు దూదిల్ల. శ్రీధర్ బాబు ని కాంగ్రెస్ సేవాదల్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎన్.ఎస్.యు. ఐ జిల్లా అధ్యక్షులు బోగోజీ. ముకేశ్ ఖన్నా మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్బంగా మంత్రివర్యులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం సమయం లో ముకేశ్ కన్నా చురుకుగా పాల్గొన్నాడని ప్రస్థావిస్తూ ,ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు..



# ఆరోగ్య , అభివృద్ధి ప్రదాత గొప్పలు చెప్పడం వరకేనా...?

## ◆ మాజీ జెడ్పీ చైర్మన్ సిద్ధం వేణు



**ఇల్లంతకుంట,మే 28,:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రంలో బుధవారం స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సిద్ధం వేణు మాట్లాడుతూ..... మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో రెండు నెలల క్రితం నుండి కొనుగోళు చేయక 30 వేలకు పైగా తూకం వేసి ఉంచిన దాన్యం బస్తాలు వర్షానికి తడిసిపోయాయని బస్తాలు మిల్లులకు తరలించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు.ఆరోగ్య,అభివృద్ధి ప్రదాత గొప్పలు చెప్పడం వరకేనా, వర్షానికి మొలకెత్తిన ధాన్యాన్ని చూసి కన్నీరు పెడుతున్న రైతులను పరామర్శించే తీరిక లేదా అంటూ ఎమ్మెల్యే కవ్వంపల్లిని ప్రశ్నించారు. మంత్రి పదవికై హైదరాబాద్ లాబీయింగ్ చేసే తీరిక ఉంది కాని రైతులను పరామర్శించే సమయం ఎందుకు లేదని, రైతుల రెక్కల కష్టం వర్షార్పణం అవుతున్నా అధికారులతో ఎందుకు సమీక్ష నిర్వహించడం లేదని రైతులపై చూపించే శ్రద్ధ ఇదేనాని ఎద్దేవా చేశారు.గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో నాలుగు రోజులుగా ధాన్యం బస్తాలు తూకం వేసి ఉన్నప్పటికీ లారీలు రాక వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు మొద్దునిద్రలొంచి తేరుకుని కొనుగోలు కేంద్రాల్లోని సమస్యలపై సమీక్షలు నిర్వహించి ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని,కొనుగోళ్ల వేగవంతం చేయకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.సమావేశంలో నాయకులు కూనబోయిన రఘు, సావనపల్లి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్వంత ఇంటి పథకం కోసం కృషి చేస్తాం:ఏఐటీయూసీ

## ◆ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు ముస్కె సమ్మయ్య

**రామగిరి, మే 28:-** సింగరేణి లో కార్మిక వర్గ శ్రేయస్సు కోసం ఏఐటియుసి నిరంతరం కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు ముస్కె సమ్మయ్య, వై.వి. రావులు పేర్కొన్నారు. సింగరేణి ఆర్జీ–త్రీ ఏరియా లోని ఏ ఎల్ పీ గని లో ఫిట్ సెక్రటరీ గంగాధర్ అధ్యక్షతన బుధవారం జరిగిన గేట్ మీటింగ్ లో వారు పాల్గొని ప్రసంగించారు. సింగరేణి లో ఏడవ సారి జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటియుసి గెలిచిన తరువాత కార్మికుల అనేక సమస్యల్ని పరిష్కరించడం కోసం యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి కృషి చేయడం జరిగిందన్నారు. కార్మికులు తమ పిల్లల విద్య కోసం లక్షల రూపాయలు ఖర్చును దృష్టిలో పెట్టుకొని సింగరేణి యాజమాన్యంతో స్ట్రక్చర్ సమావేశంలో మాట్లాడి సెంట్రల్ సిలబస్ విద్యను అందించాలని చేసిన డిమాండ్ మేరకు యాజమాన్యం అంగీకరించి భూపాల్ పల్లి, కొత్తగూడెం రామగుండంలో సెక్టార్ త్రీ పాఠశాలలలో సిబిఎస్ఇ సిలబస్ ను ప్రారంభించారన్నారు. అంతేకాక కార్మికులకు ప్రమోషన్ పాలసీలో భాగంగా ప్రమోషన్ వచ్చిన ప్రతి కార్మికుడికి ప్రమోషన్ ఇంక్రిమెంట్ల ఇప్పించడం జరుగుతుందని, సింగరేణిలో కార్పొరేట్ వైద్యం కోసం హైదరాబాదులో సింగరేణి కార్పొరేట్ వైద్యశాలను ఏర్పాటు చేయించడం జరుగుతుందని, సొంతింటి పథకాన్ని అమలు చేయడానికి ఏఐటియుసి కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఏఎల్పి కార్మికులకు 150 మందికి సర్ఫేస్ లో జనరల్ మజ్దూర్ లు గా ఇప్పించడం జరిగిందని, సింగరేణి లో పని చేస్తున్న జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ ను జనరల్ అసిస్టెంట్ గా మార్పు చేయించడం జరిగిందని తెలిపారు. ఏఐటియుసి కార్మికుల కు చేస్తున్న సేవలను గుర్తించిన ఏ.ఎల్.పి కి చెందిన వివిధ యూనియన్ ల నాయకులు, కార్యకర్తలు ఏఐటియుసి లో చేరగా, వారికి ఏఐటియుసి కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు జూపాక రాంచందర్, ఎం.ఆర్.సి రెడ్డి, నర్సింగరావు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.





# బొప్పాయితో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు.. కానీ దీన్ని ఇలా తింటేనే మంచిది!



బొప్పాయి.. అందరికీ అందుబాటులో ఉండే చవకైన రుచికరమైన, జ్యూసీ పండు. ఇది వేసవి కాలంలో తినడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది చాలా తీపి మరియు జ్యూసిగా ఉంటుంది, ఇది తిన్న తర్వాత చాలా తాజాగా అనిపిస్తుంది. బొప్పాయి చాలా రుచికరమైన పండు, ఇందులో అనేక విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇందులో ఉండే పాపిన్ అనే ఎంజైమ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే పోషకాలు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలో కూడా సహాయపడతాయి. అంతే కాదు బొప్పాయి తినడం వల్ల చర్మానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. అంతేకాదు.. బొప్పాయిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోండి. బొప్పాయి ప్రయోజనాలు: షుగర్‌ని నియంత్రించడం నుండి బరువు తగ్గడం వరకు, ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. బొప్పాయి చాలా రుచికరమైన పండు. ఇందులో అనేక విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇందులో ఉండే పాపిన్ అనే ఎంజైమ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందువల్ల, బొప్పాయిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. బొప్పాయిలో పపైన్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ ఎంజైమ్ ప్రోటీన్లను జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. బొప్పాయి సహజమైన భేదిమందు కూడా. ఇది మలబద్ధకం నుండి ఉపశమనాన్ని అందించడంలో కూడా సహాయపడుతుంది. అందువల్ల, ఉదయం ఖాళీ కడుపుతో దీన్ని తినడం వల్ల ప్రేగుల కదలిక మెరుగుపడుతుంది. ఉబ్బరం సమస్యను నివారిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి: బొప్పాయిలో యాంటీ–ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఫ్రీ రాడికల్స్ డ్యామేజ్‌ని తగ్గిస్తుంది. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇది కెరోటినాయిడ్స్ వంటి యాంటీ–ఆక్సిడెంట్లను కలిగి ఉంటుంది. ఇది ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. తద్వారా అనేక వ్యాధులను నివారిస్తుంది. గుండెకు ప్రయోజనకరం: బొప్పాయిలో విటమిన్ సి, యాంటీ–ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అందువల్ల, బొప్పాయి తినడం ఆరోగ్యకరమైన గుండెకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది: బొప్పాయిలో లైకోపీన్, విటమిన్ సి ఉన్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్ డ్యామేజ్‌ని తగ్గిస్తుంది. అకాల వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. డార్క్ స్పాట్స్‌తో పాటు ముడతలు, ఫైన్ లైన్‌లను తగ్గించడంలో కూడా ఇది చాలా సహాయపడుతుంది. ఫలితంగా మెరిసే, ఆరోగ్యకరమైన చర్మం ఏర్పడుతుంది. రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది: బొప్పాయిలో ఉండే ఫైబర్ బ్లడ్ షుగర్ నియంత్రణలో సహాయపడుతుంది . ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది, ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో చాలా సహాయపడుతుంది. కడుపు నిండుగా ఉంటుంది: బొప్పాయిలో ఫైబర్ ఉంటుంది. ఇది చాలా కాలం పాటు కడుపు నిండుగా ఉంచుతుంది. దీని కారణంగా, అతిగా తినాలనే కోరిక ఉండదు. బరువు పెరగడం లేదా ఉబ్బరం వంటి సమస్యలను నివారించడంలో కూడా ఇది సహాయపడుతుంది.

# మారేడు దళం.. సర్వ రోగాలకు దివ్యౌషధం..!

## ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇలా తింటే ప్రయోజనాలు అమోఘం..

బిల్వ పత్రం.. మారేడు దళం.. ఆ మహా శివుడికి అత్యంత ప్రితికరమైనది. పరమ శివుడిని ప్రసన్నం చేసుకోవాలంటే..చెంబు నీళ్లు, ఒక్క మారేడు దళం సమర్పిస్తే చాలని భక్తుల విశ్వాసం. ఎటువంటి ఆడంబరాలు లేకపోయినా బిల్వదళం అర్పిస్తే ఆ పరమేశ్వరుడు సంతోషిస్తాడని అంటారు. అయితే ఈ మారేడు దళం కేవలం పూజకు మాత్రమే కాదు.. ఆరోగ్యానికి కూడా చాలామంచిదని ఆయుర్వేద నిపుణుల చెబుతున్నారు. మారేడులో విటమిన్లు ఎ, బి1, బి2, సి, ఖనిజాలు, కాల్షియం, పొటాషియం, ఇనుముతో కూడిన అనేక పోషకాలున్నాయి. ముఖ్యంగా వేసవికాలంలో ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో మారేడు ఆకులు తింటే బోలెడు ఆరోగ్యప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులోని ఔషధ గుణాలు, ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. మారేడు ఆకులు.. ఆరోగ్య పరంగా ఎంతో మేలు చేస్తుంది. దీనిని తినడం వల్ల గుండె జబ్బులు, కాలేయ సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. ఖాళీ కడుపుతో బెల్‌పత్రి తింటే ఎన్నో ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో మారేడు ఆకులను తీసుకుంటే, అందులో ఉండే యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మారేడు ఆకులలో ధమనులు గట్టిపడకుండా నిరోధించే గుణం వుంది. ఇవి గుండెను వ్యాధుల నుండి రక్షిస్తాయి. బిల్వ పత్రంలో పొటాషియం సమృద్ధిగా ఉండటం వల్ల రక్తపోటుతో బాధపడేవారికి మేలు చేస్తుంది. బిల్వపత్రంలో ఉండే ఐరన్ రక్తంలో ఎర్ర రక్త కణాలు, హిమోగ్లోబిన్ కౌంట్‌ను పెంచుతుంది. బిల్వ పత్రంలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండటం వల్ల ఇది శరీరానికి తగినంత శక్తిని అందిస్తుంది. మారేడుతో అధిక కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. తరచూ మీకు నోటిపూతతో ఇబ్బంది పడేవారు ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో బెల్ పత్రి తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. దీని కోసం మీరు నాలుగు మారేడు ఆకులు తీసుకుని పచ్చిగానే నమిలి తినవచ్చు. అంతేకాదు..మధుమేహం బాధితులకు సైతం ఇది మందుగా పనిచేస్తుంది. బిల్వ పత్రం అతిసార, మొలలు, చక్కెర వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు చేస్తుంది. డయాబెటిక్ పేషెంట్ ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో బెల్‌పత్రిని తీసుకోవచ్చు. ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ ఆకులు తినటం వల్ల గ్యాస్, అసిడిటీ, అజీర్ణం నుండి ఉపశమనం లభిస్తుంది. మారేడులో ఉండే కాల్షియం దంతాలు, ఎముకలను బలోపేతం చేయడానికి, బోలు ఎముకల వ్యాధిని నివారిస్తుంది. జ్వరం, జలుబు, దగ్గు మరియు అలెర్జీలతో బాధపడేవారికి బెల్పత్రి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. వేసవిలో ఉదయాన్నే పరగడుపున ఈ పచ్చి ఆకును తింటే ఈ ప్రయోజనాలు పొందుతారు. మలబద్ధకం లేదా ఉదయం సరిగ్గా కడుపుని ఖాళీ చేయని సందర్భాల్లో తక్షణ ఉపశమనం పొందడంలో మారేడు ఆకులు చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఇది మీ పొట్టను శుభ్రపరచడమే కాకుండా మీ చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. బెల్ పత్రిని ఎలా తీసుకోవాలి? కొన్ని ఆకులను తీసుకుని నీటితో శుభ్రం చేసి వాటిని అలాగే నమిలి తినేయండి. లేదంటే మారేడు ఆకులో కాస్త నల్ల ఉప్పు వేసి కొద్దిగా వేడి చేసి తినవచ్చు. బేల్‌పత్రిని ఒక గ్లాసు నీటిలో మరిగించి దాని కషాయాన్ని కూడా సేవిస్తారు.



# రైతులకు అందుబాటులో జీలుగా విత్తనాలు...



**ఇల్లందకుంట మే 28 :** శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు ఇల్లందకుంట మండల కేంద్రం లో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు దేవస్థాన చైర్మేన్ రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ఖరీఫ్ సీసన్ లో రైతులకు జీలుగా విత్తనాలను సబ్సిడీ పై పంపిణీ చేస్తుందన్నారు. ఇల్లంతకుంట ,సిరిసేడు, మల్యాల గ్రామాలలో 100 క్వింటాల జీలుగు బస్తాలు ఉన్నాయన్నారు. అవసరం ఉన్నటువంటి రైతులు వినియోగించుకోవాలన్నారు .మన ఇల్లంతకుంట మండలంలో అత్యధికంగా వరి సాగు చేస్తున్నారని అన్నారు. ఎరువుగా వాడే జీలుగ, విత్తనాలు సబ్సిడీపై కొనుగోలు చేసి ప్రతి యేటా మే నెల రైతులకు సరైన సమయం అని ఈ సంవత్సరం రుతుపవనాలు ముందుగా వస్తున్నాయని వాతావరణ శాఖ పలుమార్లు సూచించిందన్నారు. జీలుగా విత్తనాలను రైతులకు సరఫరా చేయడంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిగా నిమగ్నమయ్యారన్నారు. రైతులకు ఎలాంటి అవసరాలు ఉన్న సంబంధిత వ్యవసాయ శాఖ ఏవో, ఏఈఓ ల ను సంప్రదించాలని అన్నారు. జీలుగు విత్తనాలు పొలంలో చల్లడం ద్వారా ఎరువుగా మారి అధిక పంట దిగుబడి వస్తుంది అన్నారు.

# మీరు మర్చిపోయి కూడా లెమన్ వాటర్ తాగకండి..!

## అది మీ ఆరోగ్యానికి మేలు కంటే హాని చేస్తుంది!

లెమన్ వాటర్ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. దాని ఆరోగ్య ప్రయోజనాల కారణంగా మనలో చాలా మంది ఉదయం నిద్ర లేవగానే ఒక గ్లాస్ లెమన్ వాటర్ తాగడం అలవాటుగా చేసుకున్నారు. ఇది శరీరాన్ని డిటాక్సిఫై చేసి బరువు తగ్గడంలో సహాయపడుతుంది. నిమ్మకాయ నీటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అయితే నిమ్మరసం తాగడం వల్ల కొంతమందికి హాని కలుగుతుందని మీకు తెలుసా? అవును, లెమన్ వాటర్ ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో అనేక సమస్యలు వస్తాయి ..కాబట్టి..ఎలాంటి వ్యక్తులు నిమ్మరసం తాగకూడదో ఇక్కడ తెలుసుకుందాం.. ఎసిడిటీ సమస్య ఉన్నవారు.. ఎసిడిటీ సమస్యలతో బాధపడేవారు లెమన్ వాటర్ ఎక్కువగా తీసుకోవడం మానుకోవాలి. వాస్తవానికి, ఇది పెద్ద మొత్తంలో సిట్రిక్ యాసిడ్ ను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో ఆమ్లతను మరింత పెంచుతుంది. దీని కారణంగా మీరు ఇతర కడుపు సంబంధిత సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. దంత సమస్యలు ఉన్నవారు .. దంత సమస్యలు ఉన్నవారు లెమన్ వాటర్ తాగడం మానుకోవాలి. నిమ్మకాయల్లో ఉండే యాసిడ్ పంటి ఎనామిల్‌ను దెబ్బతీస్తుంది. ఇది దంతాలలో సున్నితత్వ సమస్యలను కలిగిస్తుంది. మీకు దంత సమస్యలు ఉంటే, దానిని తీసుకునే ముందు మీ దంతవైద్యుడిని సంప్రదించండి. ఎముక సంబంధిత సమస్యలు ఉన్నవారు .. ఎముక సంబంధిత సమస్యలతో బాధపడేవారు నిమ్మరసం తాగకూడదు. నిమ్మరసం ఎక్కువగా తాగడం వల్ల మీ ఎముకలు దెబ్బతింటాయి. వాస్తవానికి, ఇందులోని యాసిడ్ కారణంగా, ఎముకలలో కాల్షియం తీవ్రమైన కోతను అనుభవిస్తుంది. ఇది మూత్రం ద్వారా విసర్జించబడుతుంది. దీని కారణంగా ఎముకలు బలహీనపడటం ప్రారంభిస్తాయి. లోపల నుండి బోలుగా మారతాయి. ఇది బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. కిడ్నీ సమస్యలు ఉన్నవారు.. కిడ్నీ వ్యాధితో బాధపడేవారు నిమ్మరసం తాగకూడదు. ఇది మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధితో బాధపడేవారు దీనిని పొరపాటున కూడా తీసుకోరాదు. హార్ట్ బర్న్ సమస్య.. హార్ట్ బర్న్ సమస్యతో బాధపడేవారు నిమ్మరసం తాగడం మానుకోవాలి. వాస్తవానికి, ఇది పెప్సిన్ అనే ఎంజైమ్‌ను సక్రియం చేస్తుంది. అంతే కాకుండా దీన్ని రోజూ తీసుకోవడం వల్ల పెప్టిక్ అల్సర్ సమస్య పెరుగుతుంది.

# ఈ వ్యాధులను తరిమికొట్టే సీతాఫలం.. ఆకులు కూడా అమృతమే!

సీతాఫలాన్ని ఆంగ్లంలో "కస్టర్డ్ యాపిల్" అంటారు . ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న భారత ఉపఖండంలో ప్రసిద్ధి చెందిన పండు. సీతాఫలం మాత్రమే కాదు, దాని ఆకులు కూడా చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. దీని ఆకులను ముఖ్యంగా ఆయుర్వేదంలో చాలా ఉపయోగకరంగా భావిస్తారు. ఎందుకంటే ఇది అనేక ఆరోగ్య సమస్యలను నయం చేస్తుంది. మీరు సీతాఫలం ఆకులను జ్యూస్, డికాక్షన్ లేదా టీ రూపంలో తీసుకోవచ్చు. ఇది శరీరానికి అనేక పోషకాలను అందిస్తుంది. మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. సీతాఫలం ఆకులు మన ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయో తెలుసుకుందాం. సీతాఫలం ఆరోగ్య ప్రయోజనాలు: సీతాఫలం ఆకుల్లో ఎన్నో పోషకాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి, ఐరన్, ఫైబర్, కాల్షియం కూడా ఉన్నాయి. ఇందులో చాలా యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి, శరీరాన్ని అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. శరీరంలో వాపు, నొప్పి నుండి ఉపశమనాన్ని అందించే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. డయేరియా సమస్య నుండి ఉపశమనం: సీతాఫలం ఆకులను తీసుకోవడం వల్ల అనేక పొట్ట సంబంధిత సమస్యలు నయమవుతాయి. సీతాఫలంలో టానిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది అతిసారాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే ఈ ఆకులో ఉండే పీచు అజీర్ణ సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. గ్యాస్ ఎసిడిటీ వంటి సమస్యలను తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. అధిక రక్తపోటు సమస్య నుండి ఉపశమనం: సీతాఫలం ఆకుల్లో పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇది అధిక రక్తపోటు సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే సీతాఫలం ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి పెరుగుతుంది. చర్మానికి మేలు చేస్తుంది: సీతాఫలం ఆకులు చర్మ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. ఇందులోని విటమిన్ సి చర్మానికి పూర్తి పోషణను అందిస్తుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చర్మానికి పోషణను అందిస్తాయి. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దద్దుర్లు, మొటిమల వంటి చర్మ సమస్యల నుండి ఉపశమనం పొందుతాయి. క్యాన్సర్ నుండి రక్షిస్తుంది: సీతాఫలం ఆకుల్లో క్యాన్సర్ నిరోధక శక్తి ఉందని చాలా అధ్యయనాలు కనుగొన్నాయి. సీతాఫలంలో ఉండే ఫైటోకెమికల్స్ యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాల వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. ఇందులో ఉండే విటమిన్ సి మరియు విటమిన్ ఎ పోషకాలు క్యాన్సర్ కణాలను నాశనం చేయడంలో సహాయపడతాయి.

# పుట్టగొడుగులు తింటే యూరిక్ యాసిడ్ పెరుగుతుందా? ఎలాంటి కూరగాయలు తీసుకోవాలి?

ఎలివేటెడ్ యూరిక్ యాసిడ్ ఈ రోజుల్లో సాధారణ సమస్యలలో ఒకటిగా మారుతోంది. ఇది జీవక్రియ రుగ్మత, దీనిలో శరీరం ప్యూరిన్‌లను జీర్ణించుకోలేకపోతుంది. అవి ఎముకలలో పేరుకుపోవడం ప్రారంభిస్తాయి. ఇది చేతులు, కాళ్లు, మణికట్టు చుట్టూ పేరుకుపోతుంది. తరువాత గౌట్ సమస్యలను కలిగిస్తుంది. ఇలా శరీరంలో ప్యూరిన్స్ పెరగడం వల్ల ఎముకల్లో ఖాళీలు ఏర్పడి వాపులు వస్తాయి. దీంతో కీళ్లలో దృఢత్వం, నొప్పి వస్తుంది. అటువంటి పరిస్థితుల్లో ప్యూరిన్ పెంచే ఆహారాలకు దూరంగా ఉండాలి. ఇంతకీ మష్రూమ్ తినడం వల్ల యూరిక్ యాసిడ్ పెరుగుతుందో లేదో తెలుసుకుందాం? పుట్టగొడుగులలో యూరిక్ యాసిడ్ పెంచడానికి పని చేసే ప్రోటీన్లు మంచి మొత్తంలో ఉంటాయి. ఇది మీ ఎముకలలో పెరగడం మొదలవుతుంది. వాపు పెరుగుతుంది. నిజానికి, మీరు పుట్టగొడుగులను తిన్నప్పుడు శరీరం వాటిని జీర్ణం చేస్తుంది. ప్యూరిన్లను విసర్జిస్తుంది. ఈ ప్యూరిన్ ఎముకలో పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. అడపాదడపా నొప్పిని కలిగించే సమస్యను సృష్టిస్తుంది. మీరు ప్రోటీన్ అధికంగా ఉండే ఇతర ఆహారాలను తిన్నప్పుడు ఈ నొప్పి తీవ్రమవుతుంది. అందుకే యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే లేదా మీకు గౌట్ సమస్య ఉంటే పుట్టగొడుగుల వినియోగాన్ని నివారించండి. మీ యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే, మీరు పుట్టగొడుగులకు బదులుగా అధిక ఫైబర్ ఫుడ్స్ తినవచ్చు. వోట్స్, గంజి, నారింజ వంటి పండ్లు వంటివి. ఇది కాకుండా మీరు ఈ సమస్యలో చాలా ఉపయోగకరంగా ఉండే మొలకెత్తిన ధాన్యాలను కూడా తీసుకోవచ్చు. ఈ పరిస్థితులన్నింటిలో మీరు పుట్టగొడుగులకు బదులుగా ఈ ఆహారాన్ని తినాలి. ఇది కాకుండా మీరు ఆకుకూరలు, పసుపు వంటి వాటిని తీసుకోవాలి. ఇది కాకుండా మీరు చియా గింజలను తినవచ్చు. గోరువెచ్చని నీరు తాగవచ్చు. ఈ పదార్థాలు యూరిక్ యాసిడ్ తగ్గించడంలో కూడా సహాయపడతాయి.

# మనుసు గెలుచుకున్న పంత్..

స్పోర్ట్స్




ఐపీఎల్ 2025 లీగ్ దశలో చివరి మ్యాచ్ ఉత్కంఠభరితంగా ముగిసింది. లక్నోలో జితేష్ శర్మ ఆర్‌సిబిని టాప్-2కి తీసుకెళ్లాడు. 33 బంతుల్లో 85 పరుగులు చేసిన అతని ఇన్నింగ్స్ మొత్తం మ్యాచ్ గమనాన్నే మార్చేసింది. కానీ అంతకు ముందు ఒక చిన్న చిలిపి సన్నివేశం అందరి దృష్టిని ఆకర్షించింది. లక్నో సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేష్ రాఠి నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో అతనిని మన్కడ్ చేయడానికి ప్రయత్నించాడు. కానీ కెప్టెన్ రిషబ్ పంత్ తరువాత అప్పీల్‌ను ఉపసంహరించుకున్నాడు. దిగ్వేష్ రతి జితేష్ శర్మను మన్కడేట్ చేశాడు. రిషబ్ పంత్ అప్పీల్‌ను విత్ డ్రా చేసుకున్నాడు కానీ విరాట్ కోహ్లీ ఈ చర్యపై చాలా సీరియస్ అయ్యాడు. క్వాలిఫయర్ 1 చేరుకోవడానికి ఆర్‌సిబికి రికార్డు ఛేజింగ్ అవసరం. వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్, స్టాండ్-ఇన్ కెప్టెన్ జితేష్ శర్మ జట్టును ఈ లక్ష్యం వైపు నడిపించాడు. అతను పూర్తి ఫామ్‌లో ఆడుతూ ఎకానా స్టేడియంలో రన్ రేట్‌ను 10 కంటే తక్కువగా తీసుకువచ్చాడు. మ్యాచ్‌ను మలుపు తిప్పడానికి చివరి ప్రయత్నంగా, %ూూ+% బౌలర్ దిగ్వేష్ రాఠి 17వ ఓవర్‌లో నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో రనౌట్‌కు ప్రయత్నించాడు. జితేష్ క్రీజు వెలుపల బాగా ఉన్నప్పుడు తన ఆట ప్రారంభమైంది. కానీ రీప్లేలలో రతి తన బౌలింగ్ యాక్షన్ పూర్తి చేసినట్లు తేలింది. కాబట్టి రనౌట్ చెల్లదు. %ూూ+% కెప్టెన్ రిషబ్ పంత్ కూడా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి అప్పీల్‌ను ఉపసంహరించుకున్నాడు. అయితే, థర్డ్ అంపైర్ నాటౌట్ నిర్ణయం తీసుకున్న తర్వాత, జితేష్ ఒక నిట్టూర్పుతో పంత్‌ను కౌగిలించుకున్నాడు. అదే సమయంలో, పెవిలియన్‌లో దిగ్వేష్ చేసిన ఈ చర్యను చూసి విరాట్ కోహ్లీ కోపంతో ఊగిపోయాడు. అతను పట్టుకున్న బాటిల్‌ను గ్లాసుపైకి విసిరేశాడు. దిగ్వేష్ రతి మన్కడ్ ప్రయత్నం క్రికెట్ క్రీడా స్ఫూర్తిపై చర్చకు దారితీసింది. అతను ఇప్పటికే %ఖూ% 2025లో ఒక మ్యాచ్ కోసం సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. అతని 'నోట్‌బుక్ సెలబ్రేషన్'పై కూడా వివాదంలో చిక్కుకున్నాడు. కెప్టెన్ రిషబ్ పంత్ అప్పీల్‌ను ఉపసంహరించుకోవడం ద్వారా క్రీడా స్ఫూర్తికి ఒక ఉదాహరణగా నిలిచాడు. ఈ మ్యాచ్ గురించి చెప్పాలంటే, టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్, కెప్టెన్ రిషబ్ పంత్ తుఫాను సెంచరీ ఇన్నింగ్స్ కారణంగా 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. పంత్ తన ఐపీఎల్ కెరీర్‌లో రెండవ సెంచరీని సాధించాడు. 61 బంతుల్లో 11 ఫోర్లు, 8 అద్భుతమైన సిక్సర్లతో అజేయంగా 118 పరుగులు చేశాడు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు త్వరిత ఆరంభాన్ని ఇచ్చారు. కోహ్లీ 54 పరుగులతో అర్ధ సెంచరీ చేశాడు. దీని తర్వాత, తప్పిపోయిన మన్కడ్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకుని, జితేష్ శర్మ %=జదీ%కి విజయాన్ని అందించాడు. స్టాండ్-ఇన్ కెప్టెన్ కేవలం 33 బంతుల్లో అజేయంగా 85 పరుగులు చేశాడు. జట్టు ఇంకా 8 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. ఇలా చేయడం ద్వారా అతను మ్యాచ్ ఫలితాన్ని మార్చాడు. మయాంక్ అగర్వాల్ అతనికి మంచి మద్దతు ఇచ్చి 41 పరుగులు చేశాడు. ఆర్‌సిబి ఈ లక్ష్యాన్ని 6 వికెట్లు మిగిలి ఉండగా, 8 బంతులు ముందుగానే సాధించింది.

## ఆర్‌సీబీ అభిమానుల్లో కొత్త ఆశలు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ఐపీఎల్ 2025 ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. ఈ సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో టాప్ 2లో నిలిచి, క్వాలిఫైయర్ 1 ఆడేందుకు అర్హత సాధించింది. ఆర్‌సీబీ చరిత్రను పరిశీలిస్తే, ప్రతిసారి పాయింట్ల పట్టికలో టాప్ 2లో నిలిచిన సందర్భంలో ఫైనల్‌కు చేరుకుంది. ఇది ఆర్‌సీబీ అభిమానుల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది.ఆర్‌సీబీ ఐపీఎల్ చరిత్రలో మూడుసార్లు (2009, 2011, 2016) ఫైనల్‌కు చేరుకుంది. ఈ మూడు సందర్భాల్లోనూ లీగ్ దశలో పాయింట్ల పట్టికలో టాప్ 2లో నిలిచింది. ఆర్‌సీబీ లీగ్ దశలో రెండవ స్థానంలో నిలిచి, డెక్కన్ ఛార్జర్స్ (అప్పటి హైదరాబాద్ ఫ్రాంచైజీ)తో ఫైనల్‌లో తలపడింది. 2011 సీజన్: ఆర్‌సీబీ లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచి, చెన్నై సూపర్ కింగ్స్ తో ఫైనల్‌లో ఆడింది. 2016 సీజన్: ఆర్‌సీబీ లీగ్ దశలో రెండవ స్థానంలో నిలిచి, సన్‌రైజర్స్ హైదరాబాద్ తో ఫైనల్‌లో పోటీపడింది.ఈ మూడు సందర్భాల్లోనూ ఆర్‌సీబీ టైటిల్ గెలవలేకపోయినా, ఫైనల్‌కు చేరుకుంది. ఈసారి కూడా టాప్ 2లో నిలవడంతో, ఆర్‌సీబీ ఫైనల్‌కు చేరుకుంటుందనే అంచనాలు బలంగా ఉన్నాయి.ఆర్‌సీబీ ఇప్పుడు పంజాబ్ కింగ్స్ తో క్వాలిఫైయర్ 1 మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే ఆర్‌సీబీ నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఒకవేళ ఓడినా, క్వాలిఫైయర్ 2లో ఎలిమినేటర్ విజేతతో మరో అవకాశం లభిస్తుంది. ఆర్‌సీబీ అభిమానులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ట్రోఫీ ఈసారి దక్కుతుందేమో చూడాలి. టాప్ 2లో నిలిస్తే ఫైనల్‌కు చేరుకునే ఆర్‌సీబీ చరిత్ర ఈసారి టైటిల్ గెలిచి కొత్త చరిత్ర సృష్టిస్తుందో లేదో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.





## 58 మందిలో వైభవ్ సూర్యవంశీదే అగ్రస్థానం

ఐపీఎల్ 2025 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ సంచలన ప్రదర్శనతో క్రికెట్ ప్రపంచాన్ని అబ్బురపరిచాడు. కేవలం 14 ఏళ్ల వయసులో గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్‌లో అతను చేసిన శతకం ఎన్నో రికార్డులను బద్దలు కొట్టింది. ముఖ్యంగా, తన శతకంలో అతను బౌండరీల ద్వారా సాధించిన పరుగుల శాతం ప్రపంచంలోనే అత్యధికంగా నిలిచి, 58 మంది సెంచరీ హీరోల జాబితాలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వైభవ్ సూర్యవంశీ కేవలం 38 బంతుల్లో 101 పరుగులు (7 ఫోర్లు, 11 సిక్సర్లతో) సాధించి, ఆర్ఆర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతని ఈ మెరుపు ఇన్నింగ్స్‌లో 94 పరుగులు కేవలం బౌండరీల ద్వారానే రావడం విశేషం. అంటే, తన శతకంలో 93% పరుగులు బౌండరీల ద్వారానే సాధించాడు. ఇది ఐపీఎల్ చరిత్రలో ఏ బ్యాట్స్‌మెన్ సెంచరీలోనైనా బౌండరీల ద్వారా సాధించిన అత్యధిక పరుగుల శాతంగా మారింది.ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 58 మంది బ్యాట్స్‌మెన్ సెంచరీలు సాధించారు. ఈ 58 మందిలో వైభవ్ సూర్యవంశీ తన శతకంలో అత్యధిక బౌండరీ పర్సంటేజీతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ రికార్డును సాధించడం ద్వారా అతను తన సహచర ఆటగాడు యశస్వి జైస్వాల్ రికార్డును బద్దలు కొట్టాడు.

## కొన్ని రోజులు క్రికెట్ గురించి ఆలోచించడం మానేస్తా

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ ఈ సీజన్‌లో పెద్దగా ఆకట్టుకోలేదు. తాజాగా బెంగళూరుతో మ్యాచ్?లో సెంచరీ మినహా, పంత్?చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్? ఆడలేదు. భారీ అంచనాలతో దిగిన పంత్ 14 మ్యాచ్?ల్లో 24.45 సగటుతో కేవలం 269 పరుగులే చేసి, అభిమానులను తీవ్ర నిరాశ పర్చాడు. ఇక లఖ్?నవూ మ్యాచ్?లు ముగిశాయి. వచ్చే నెలలో టీమ్‌ఇండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో రిషభ్ పంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.కొన్ని రోజులు క్రికెట్ గురించి ఆలోచించడం మానేస్తానని అన్నాడు. కాస్త బ్రేక్ తీసుకొని, ఇంగ్లాండ్?తో ఐదు టెస్టుల సిరీస్? కోసం మళ్లీ ప్రాక్టీస్ మొదలు పెడతానని చెప్పాడు. కాగా, ఈ సిరీస్?కు బీసీసీఐ ఇటీవల భారత జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు శుభ్?మన్ గిల్ కెప్టెన్?, పంత్ వైస్ కెప్టెన్?గా ఎంపికయ్యాడు. ఈ సిరీస్ జూన్ 13 నుంచి ఆగస్టు 04 వరకు జరగనుంది. 'ఐపీఎల్ టోర్నీ త్వరలోనే ముగుస్తుంది. ఆ తర్వాత టీమ్‌ఇండియా, ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నేను కొన్ని రోజులు క్రికెట్ గురించి ఆలోచించను. ఆ తర్వాత ఇంగ్లాండ్ టెస్టు సిరీస్?కు ప్రిపేర్ అవుతాను. ప్రతి మ్యాచ్‌లోనూ బాగా ఆడాలనే అనుకుంటాను. కానీ, అన్నిసార్లు మనం అనుకున్నట్లు జరగదు. బెంగళూరుతో మ్యాచ్‌లో నాకు మంచి ప్రారంభం దక్కింది. దీన్ని భారీ ఇన్నింగ్స్?గా మార్చాలి అనుకున్నా. నేను ఇప్పటికీ ఉత్తమ ప్లేయర్ల నుంచి నేర్చుకుంటూనే ఉంటున్నాను' అని పంత్ ఆర్సీబీ మ్యాచ్ అనంతరం మాట్లాడాడు.

# లక్నో చెత్త రికార్డు నమోదు



ఐపీఎల్ 2025 చివరి లీగ్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ఆర్సీబీ చేతిలో 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. 227 పరుగులు చేసినప్పటికీ రిషబ్ పంత్ కెప్టెన్సీలోని లక్నో జట్టు ఈ దారుణమైన ఓటమిని చవిచూసింది. ఈ క్రమంలో లక్నో జట్టు బౌలింగ్ ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. ఐపీఎల్ చరిత్రలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇంత పెద్ద లక్ష్యాన్ని ఛేదించడం ఇదే తొలిసారి. అదే సమయంలో ఈ మ్యాచ్‌లో ఓటమి తర్వాత ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు పేరు మీద చెత్త రికార్డు నమోదైంది.ఈ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ముందుగా బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. ఈ మ్యాచ్ లో రిషబ్ పంత్ 118 పరుగులతో అజేయంగా నిలిచాడు. అయినప్పటికీ లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లు ఈ భారీ లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయారు. ఆర్సీబీ 18.4 ఓవర్లలోనే ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో గెలిచి ఆర్సీబీ క్వాలిఫయర్-1కి చేరుకుంది. అదే సమయంలో ఈ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ మూడు సార్లు 200 కంటే ఎక్కువ స్కోరు చేసింది. ఆ మూడు సార్లు కూడా లక్నో జట్టు ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఇప్పుడు ఐపీఎల్ చరిత్రలో మూడు సార్లు 200 కంటే ఎక్కువ స్కోరు చేసిన తర్వాత కూడా ఓడిపోయిన మొదటి జట్టుగా లక్నో సూపర్ జెయింట్స్ నిలిచింది. ఈ సీజన్ లో ముందుగా మార్చి 24న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుపై లక్నో 209 పరుగులు చేసింది. కానీ లక్నో జట్టు ఆ లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. ఢిల్లీ ఆ మ్యాచ్‌లో విజయం సాధించింది. దీని తర్వాత రెండోసారి లక్నో సూపర్ జెయింట్స్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుపై 205 పరుగులు చేసింది. అప్పుడు కూడా రిషబ్ పంత్ జట్టు ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. అయితే తాజాగా ఆర్సీబీపై 227 పరుగులు చేసిన తర్వాత కూడా లక్నో జట్టు ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది.ఈ మ్యాచ్ లో అద్భుతంగా బ్యాటింగ్ చేసిన కెప్టెన్ రిషబ్ పంత్ తన ఐపీఎల్ కెరీర్‌లో రెండో సెంచరీని సాధించాడు. ఐపీఎల్‌లో ఈ అద్భుతమైన సెంచరీని రిషబ్ పంత్ ఏడేళ్ల తర్వాత చేశాడు. గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడుతున్నప్పుడు రిషబ్ పంత్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుపై సెంచరీ చేశాడు. ఆర్సీబీపై 61 బంతుల్లో 118 పరుగులు చేసి రిషబ్ పంత్ అజేయంగా నిలిచాడు. ఇందులో 11 ఫోర్లు, 8 సిక్సర్లు రిషబ్ పంత్ బ్యాట్ నుంచి వచ్చాయి.




## ముంబయి జట్టులోకి బెయిర్ స్టో

025 ఐపీఎల్ ప్లేఆఫ్స్ మ్యాచ?లపై క్లారిటీ వచ్చేసింది. క్వాలిఫయర్? 1లో పంజాబ్- ఆర్సీబీ, ఎలిమినేటర్? మ్యాచ్?లో గుజరాత్- ముంబయి తలపడనున్నాయి. నాలుగు జట్లు ఛాంపియన్?గా నిలవడమే లక్ష్యంగా ప్లేఆఫ్స్? బరిలో దిగనున్నాయి. ఈ నేపథ్యంలో ముంబయి ఇండియన్స్?కు కాస్త ఊరటనిచ్చే వార్త.ప్లేఆఫ్స్ పోరు?లో ముంబయి జట్టులో టీ20 స్టార్ ప్లేయర్ బరిలో దిగనున్నాడు. ఆల్?రౌండర్? విల్ జాక్స్? స్థానాన్ని ఇంగ్లాండ్ ప్లేయర్ బెయిర్ స్టో భర్తీ చేయనున్నాడు. ఇప్పటికే ముంబయి క్యాంప్?లో చేరిన బెయిర్ స్టో, నెట్స్?లో తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ముంబయి తమ సోషల్ మీడియా అకౌంట్?లో పోస్ట్ చేసింది. మే 30న గుజరాత్?తో జరగనున్న ఎలిమినేటర్ మ్యాచ్?లో బెయిర్ స్టో బరిలో దిగడం పక్కా! ఇది ముంబయికి కలిసొచ్చే అంశం. దీంతో ముంబయి ఫ్యాన్స్? ఫుల్ ఖుషి అవుతున్నారు.సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మతో కలిసి బెయిర్ స్టో ఓపెనింగ్ చేసే ఛాన్స్ ఉంది. తొలి బంతి నుంచే హిట్టింగ్ ప్రారంభించే రోహిత్?తో బెయిర్ స్టో జతకట్టనుండడం అభిమానుల్లో అంచనాలు పెంచేస్తోంది. అటు రోహిత్- ఇటు బెయిర్ స్టో ధనాధన్ ఇన్నింగ్స్?తో జట్టుకు మంచి ఆరంభం ఇవ్వాలని ముంబయి ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. కాగా, గతేడాది జరిగిన మెగా వేలంలో బెయిర్? స్టో అన్?సోల్డ్?గా మిగిలి పోయాడు. వేలంలో అతడిని ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు. తాజాగా ఈ టోర్నీలో ఆడే ఛాన్స్ దక్కింది. విల్ జాక్స్?కు రిప్లేస్?మెంట్?గా ముంబయి బెయిర్ స్టోను తీసుకుంది. అతడు రూ. 5.25 కోట్లకు ముంబయి జట్టుతో చేరాడు.కాగా, ముల్లాన్?పూర్ వేదికగా మే 30న గుజరాత్- ముంబయి మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్?లో నెగ్గిన జట్టు క్వాలిఫయర్ 2కు అర్హత సాధిస్తుంది. ఓడిన టీమ్ టోర్నీ నుంచి ఎలిమినేట్ అవుతుంది.

## క్వాలిఫయర్-1లో గెలవాలంటే 2 మార్పులు చేయండి

### ఆర్సీబీ మాజీ హెడ్ కోచ్ సంజయ్ బంగర్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో లీగ్ మ్యాచ్‌లు ముగిశాయి. ప్లేఆఫ్స్ మే 29 నుంచి ప్రారంభమవుతున్నాయి. క్వాలిఫయర్-1లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు ముల్లన్‌పూర్‌లో తలపడనున్నాయి. మంగళవారం రాత్రి ఆర్సీబీ లక్నో జట్టును 6 వికెట్ల తేడాతో ఓడించి క్వాలిఫయర్-1లో తమ స్థానాన్ని సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో క్వాలిఫయర్-1కి ముందు ఆర్సీబీ వారి ప్లేయింగ్ ఎలెవన్‌లో రెండు కీలక మార్పులు చేయాలని ఆర్సీబీ మాజీ హెడ్ కోచ్ సంజయ్ బంగర్ జట్టుకు సలహా ఇచ్చారు. స్టార్ స్పోర్ట్స్‌లో జరిగిన చర్చ సందర్భంగా సంజయ్ బంగర్ మాట్లాడుతూ.. ఆర్సీబీ ప్లేయింగ్ ఎలెవన్‌లో నువాన్ తుషారాను కొనసాగించాలని సలహా ఇచ్చారు. దీనితో పాటు లియామ్ లివింగ్‌స్టోన్, రొమారియో షెపర్డ్ స్థానంలో జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్‌లను తిరిగి తీసుకురావాలని ఆయన సిఫార్సు చేశారు. ఆర్సీబీకి వ్యతిరేకంగా బలమైన పంజాబ్ కింగ్స్ జట్టు ఉందని.. వారు ఈ సీజన్లో ఆరు లేదు ఏడు సార్లు 200 పరుగుల మార్కును దాటిందని అన్నారు. విదేశీ బ్యాటర్‌గా ఆడుతున్న లివింగ్‌స్టోన్ ఈ సీజన్‌లో పరుగులు సాధించలేకపోతున్నాడని.. కాబట్టి ఆర్సీబీ వారి బౌలింగ్ ను పూర్తిగా బలోపేతం చేసుకోవాలని సూచించాడు. ఈ కలయికను తయారు చేయవచ్చని తాను భావిస్తున్నానన్నారు.ఆర్సీబీ జట్టులోకి జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ లాంటి మ్యాచ్ విన్నర్ ఆటగాళ్లు క్వాలిఫయర్-1లో తిరిగి వస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. వారిద్దరు జట్టులో చేరితే ఆర్సీబీ మరింత బలంగా మారనుంది. ఐపీఎల్ 2025లో భాగంగా 70వ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లక్నో సూపర్ జెయింట్స్ జట్టును 6 వికెట్ల తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ ఐపీఎల్ చరిత్రలో అతిపెద్ద లక్ష్యాన్ని ఛేదించింది. దీనితో పాటు ఆర్సీబీ ప్రత్యర్థి జట్ల సొంత మైదానాల్లో 7 మ్యాచ్‌లను గెలిచిన మొదటి జట్టుగా కూడా నిలిచింది.

# విశ్వజి



## ఈ నూనె జుట్టుకు రాసుకుంటే.. మీరు వద్దన్నా జుట్టు పెరుగుతుంది, గుంజినా కూడా ఊడదు

ఈ మధ్యకాలంలో చాలా మంది ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య జుట్టు రాలిపోవడం. జుట్టు అధికంగా రాలిపోవడం వలన చాలా మంది తమలోని ఆత్మ విశ్వాసాన్ని కోల్పోతున్నారు. బయటికి కాన్ఫిడెంట్‌గా ఉండలేకపోతున్నారు. అలాంటి వ్యక్తులు చియా విత్తనాల నుంచి తీసే నూనె రాసుకుంటే అత్యద్భుతమైన ఫలితాలు వస్తాయి. వద్దన్నా జుట్టు పెరుగుతుంది. అలాగే రాలిపోవడం కూడా తగ్గిపోతుంది. అసలు ఈ నూనె వలన జుట్టుకు ఎలాంటి ఉపయోగాలు కలుగుతాయనేది ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం. 1. బలమైన జుట్టు చియా విత్తనాల్లో ఉండే ప్రోటీన్ జుట్టుకు బలం కలిగిస్తుంది. డ్యామేజ్ అయిన జుట్టును ఈ నూనె లోపలి నుంచి వాటిని రిపేర్ చేస్తుంది. ఇది హెయిర్ ఫాలికల్స్‌ని బలంగా మార్చుతుంది, తద్వారా జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. “పిచ్చెక్కించే పచ్చి మామిడికాయ పచ్చడి.. రుచి నషాళానికి ఎక్కాల్సిందే, ఎలా చేసుకోవాలంటే?” 2. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ చియా విత్తనాలు ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కలిగి ఉంటాయి. ఇవి జుట్టుకు పోషణను అందించి, కుదుళ్లను హైడ్రేట్ చేయడంలో సహాయపడతాయి. హైడ్రేటెడ్ జుట్టు వల్ల హెయిర్ ఫాలికల్స్ డ్యామేజ్ కాకుండా ఉంటాయి, దీంతో జుట్టు బలంగా, మందంగా పెరుగుతుంది. “ఏడాది తర్వాత పవర్ ఫుల్ రాజయోగం..3 రాశులు నక్కతోక తొక్కబోతున్నారు” 3. కుదుళ్లకు మాయిశ్చర్ చియా విత్తనాలు జుట్టుకు తగిన మాయిశ్చర్‌ను అందిస్తాయి. ఈ నూనెను జుట్టుకు అప్లై చేసినప్పుడు, స్కాల్ప్‌కు మంచి పోషణ అందించి, జుట్టు తేమను నిలుపుతుంది. దీని వల్ల చుండ్రు సమస్య తగ్గిపోతుంది. అలాగే జుట్టు రాలే సమస్యకు చెక్ పెట్టగలుగుతుంది. 4. యాంటీ ఆక్సిడెంట్లు “ కోటీశ్వరులు కూడా కక్కుర్తి పడి తినే రెసిపి ఇదే..ఎలా చేయాలంటే” చియా విత్తనాల నూనెలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్‌ను నిరోధించి, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తాయి. తద్వారా, జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది మరియు తెల్లవెంట్రుకల సమస్య రాకుండా చేస్తాయి. 5. కుదుళ్ల ఆరోగ్యం చియా విత్తనాల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కూడా ఉంటాయి. ఇది జుట్టుపై వచ్చే దురద మరియు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. తద్వారా జుట్టు ఆరోగ్యంగా ఉంటుందని చెప్పవచ్చు. వీటితో పాటు అనేక రకాల ప్రయోజనాలను ఈ నూనె అందజేస్తుంది. టిప్స్: చియా విత్తనాల నూనెను జుట్టుకు నేరుగా అప్లై చేసి మసాజ్ చేయండి. దీనివల్ల బ్లడ్ సర్క్యులేషన్ మెరుగవుతుంది. చియా సీడ్ ఆయిల్ యొక్క కొన్ని చుక్కలను జుట్టుకు అప్లై చేసి, 10-15 నిమిషాలు మసాజ్ చేయాలి. తర్వాత తలస్నానం చేయండి. మీరు జుట్టుకు మాస్క్ కూడా తయారుచేసుకోవచ్చు. 2 టేబుల్ స్పూన్ చియా సీడ్స్ ఆయిల్ లో తేనె కలిపి అప్లై చేయండి. ఇది జుట్టు హైడ్రేషన్‌కు మేలు చేస్తుంది.

### ఈ ఐదు ఆరోగ్య సమస్యలు ఉంటే వేసవిలో

## పుచ్చకాయను తినొద్దు.. తింటే అంతే సంగతి!



వేసవి వచ్చిందంటే చాలు పుచ్చకాయ గుర్తుకువస్తుంది. ఎర్రగా, తియ్యగా ఉండే ఈ పుచ్చకాయను తినడం అందరికి చాలా ఇష్టం. వేసవి తాపాన్ని తగ్గించడంలో పుచ్చకాయకు మించిన పండు మరొకటి లేదు. అందుకే చాలామంది వేసవిలో పుచ్చకాయను ఇష్టంగా తింటారు. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుతుంది. విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొంతమంది పుచ్చకాయను తినకూడదు. ఎందుకంటే కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి పుచ్చకాయ మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుంది. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండాలి? కిడ్నీ సమస్యలు ఉన్నవారు శరీరంలో రక్త ప్రసరణ తగ్గితే .. మీ ఆరోగ్యం డేంజర్ జోన్‌లో పడ్డట్లే.. లక్షణాలు ఇవే! కిడ్నీ సమస్యలు ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండటం ఉత్తమం. ముఖ్యంగా డయాలసిస్ చేయించుకుంటున్నవారు లేదా కిడ్నీలు సరిగా పనిచేయని వారు పుచ్చకాయ తినకూడదు. ఎందుకంటే పుచ్చకాయలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన వ్యక్తుల్లో కిడ్నీలు పొటాషియంను సమతుల్యం చేస్తాయి. కానీ కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో అధిక పొటాషియం రక్తంలో పేరుకుపోతుంది. దీనివల్ల హైపర్‌కలేమియా అనే పరిస్థితి వస్తుంది. ఇది గుండె లయను దెబ్బతీస్తుంది ప్రాణాంతకం కూడా కావచ్చు. కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు పుచ్చకాయ తినే ముందు వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారు: పుచ్చకాయలో సహజ చక్కెరలు ఉంటాయి. మధుమేహం ఉన్నవారు పుచ్చకాయను మితంగా తినాలి లేదా పూర్తిగా మానుకోవాలి. పుచ్చకాయ గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతుంది. మధుమేహం నియంత్రణలో లేనివారు పుచ్చకాయ తింటే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగి సమస్యలు వస్తాయి. ఒకవేళ తినాలనుకుంటే, చిన్న ముక్క మాత్రమే తినాలి. ఇతర ఆహారాలతో కలిపి తినడం వల్ల చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. మీ ఆహార ప్రణాళికలో పుచ్చకాయను చేర్చుకునే ముందు మీ వైద్యుడిని లేదా డైటీషియన్‌ను సంప్రదించడం ఉత్తమం. జీర్ణ సమస్యలు ఉన్నవారు: కొంతమందికి పుచ్చకాయ తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, గ్యాస్, విరేచనాలు వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ప్రకోప ప్రేగు సిండ్రోమ్ సెన్సిటివిటీ ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండాలి. పుచ్చకాయలో ఫ్రక్టోజ్ అనే చక్కెర ఉంటుంది. ఇది కొంతమందికి జీర్ణం కావడం కష్టం. అలాగే పుచ్చకాయలో ఉండే కొన్ని సమ్మేళనాలు కూడా జీర్ణ సమస్యలను కలిగిస్తాయి. మీకు తరచుగా జీర్ణ సమస్యలు ఉంటే, పుచ్చకాయను తినడం మానేసి చూడండి, మీ సమస్యలు తగ్గుముఖం పడితే, పుచ్చకాయ మీకు పడటం లేదని అర్థం చేసుకోవచ్చు. అలెర్జీలు ఉన్నవారు “రోగ నిరోధక శక్తి పెంచుకోవాలంటే ఇవి తినండి!” పుచ్చకాయ అలెర్జీలు చాలా అరుదు. కానీ కొంతమందికి పుచ్చకాయ తిన్న తర్వాత అలెర్జీ లక్షణాలు కనిపించవచ్చు. చర్మంపై దద్దుర్లు, దురద, వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. మీకు ఇతర పండ్లకు అలెర్జీలు ఉంటే, పుచ్చకాయ తినే ముందు జాగ్రత్తగా ఉండటం మంచిది. గుండె సమస్యలు ఉన్నవారు: గుండె సమస్యలు ఉన్నవారు పుచ్చకాయను మితంగా తినాలి. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల రక్త పరిమాణం పెరుగుతుంది. ఇది గుండెపై ఒత్తిడిని పెంచుతుంది. ముఖ్యంగా గుండె బలహీనంగా ఉన్నవారు లేదా గుండె వైఫల్యం ఉన్నవారు పుచ్చకాయను ఎక్కువగా తినకూడదు. మీ గుండె సమస్య తీవ్రతను బట్టి పుచ్చకాయ తినవచ్చా లేదా అనేది మీ వైద్యుడు నిర్ణయిస్తారు. ఈ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండటం లేదా మితంగా తినడం మంచిది. అయితే, ప్రతి ఒక్కరి శరీరం ఒక్కోలా ఉంటుంది. ఒకరికి సమస్య కలిగించిన ఆహారం మరొకరికి సమస్య కలిగించకపోవచ్చు. కాబట్టి, మీకు నిర్దిష్ట ఆరోగ్య సమస్యలు ఉంటే, పుచ్చకాయ తినే ముందు మీ వైద్యుడిని లేదా పోషకాహార నిపుణుడిని సంప్రదించడం ఉత్తమం. వారు మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి పుచ్చకాయ తినవచ్చా లేదా అనేది సరైన సలహా ఇవ్వగలరు.

### శరీరంలో రక్త ప్రసరణ తగ్గితే ..

## మీ ఆరోగ్యం డేంజర్ జోన్‌లో పడ్డట్లే.. లక్షణాలు ఇవే!


మన శరీరం ఒక అద్భుతమైన యంత్రం. ప్రతి అవయవానికి సక్రమంగా రక్తం సరఫరా అయితేనే అది సక్రమంగా పనిచేస్తుంది. రక్తం ద్వారానే కణాలకు ఆక్సిజన్, పోషకాలు అందుతాయి. వ్యర్థాలు తొలగిపోతాయి. అయితే, జీవనశైలి మార్పుల వల్ల చాలామందిలో రక్త ప్రసరణ సరిగ్గా జరగడం లేదు. దీనివల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తాయి. కాబట్టి, రక్త ప్రసరణ సరిగా లేనప్పుడు మన శరీరం కొన్ని సంకేతాలు ఇస్తుంది. వాటిని గుర్తిస్తే సమస్య తీవ్రం కాకుండా నివారించవచ్చు. శరీరం చేసే హెచ్చరిక సంకేతాలు: పాదాలు, చేతులు చల్లగా ఉండటం: చలికాలంలో చేతులు, కాళ్ళు చల్లగా ఉండటం సహజమే. కానీ, ఎప్పుడూ చల్లగా ఉంటే రక్త ప్రసరణ సరిగా లేదని అర్థం. ముఖ్యంగా కాలి వేళ్లు నీలం రంగులోకి మారినా, తిమ్మిర్లు వచ్చినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. నడిచేటప్పుడు కండరాలు పట్టేసినట్లు అనిపించడం, నొప్పి రావడం రక్త ప్రసరణ సరిగా లేకపోవడానికి ఒక సంకేతం. దీనిని “క్లాడికేషన్” అంటారు. రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడటం వల్ల కండరాలకు తగినంత ఆక్సిజన్ అందక నొప్పి వస్తుంది. చర్మం రంగు మారడం: చర్మంపై నీలం లేదా ఊదా రంగు మచ్చలు కనిపించడం కూడా రక్త ప్రసరణ సమస్యకు సంకేతం. చర్మానికి తగినంత రక్తం అందకపోతే ఇలా జరుగుతుంది. గాయాలు త్వరగా మానకపోతే రక్త ప్రసరణ సరిగా లేదని అనుమానించాలి. రక్తం సరఫరా సరిగా లేకపోతే కణాలకు పోషకాలు అందవు. దీంతో పుండ్లు మానడానికి ఎక్కువ సమయం పడుతుంది. నపుంసకత్వం: పురుషుల్లో అంగస్తంభన సమస్యలు కూడా రక్త ప్రసరణ సరిగా



లేకపోవడం వల్ల వస్తాయి. అంతే కాకుండా జుట్టు రాలడం, గోళ్లు పెరగకపోవడం కూడా రక్త ప్రసరణ సమస్యలకు సంకేతాలు. తలకు, గోళ్లకు రక్త ప్రసరణ సరిగా లేకపోతే ఇలా జరుగుతుంది. రక్త ప్రసరణ సరిగా లేకపోతే వచ్చే సమస్యలు: గుండె, మెదడు సమస్యలు: గుండెకు రక్త ప్రసరణ సరిగా లేకపోతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు వస్తాయి. మెదడుకు రక్త ప్రసరణ సరిగా లేకపోతే స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. దీనివల్ల పక్షవాతం, జ్ఞాపకశక్తి కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయి. కాళ్ళకు రక్త ప్రసరణ సరిగా లేకపోతే కాలు తీసివేయాల్సిన పరిస్థితి కూడా రావొచ్చు. అంతే కాకుండా కిడ్నీలకు రక్త ప్రసరణ సరిగా లేకపోతే కిడ్నీలు ఫెయిల్ అయ్యే ప్రమాదం ఉంది. రక్త ప్రసరణ మెరుగుపరచుకోవడానికి చిట్కాలు: క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి. ముఖ్యంగా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు ఎక్కువగా తినండి. కొవ్వు, ఉప్పు, చక్కెర తక్కువగా తీసుకోండి. ధూమపానం మానేయండి. ఈ ధూమపానం రక్తనాళాలను దెబ్బతీస్తుంది. బరువు అదుపులో ఉంచుకోండి. అధిక బరువు వల్ల రక్తనాళాలపై ఒత్తిడి పెరుగుతుంది. %ూశ్రీంశీ =ఝు% షుగర్ ఉన్నవారు కొబ్బరి నీరు తాగితే ప్రమాదమా? ఒత్తిడి తగ్గించుకోండి. దీని వల్ల రక్తనాళాలు కుంచించుకుపోతాయి. యోగా, ధ్యానం వంటివి చేయండి. నీరు ఎక్కువగా తాగడం వల్ల రక్తం పలుచగా ఉంటుంది, ప్రసరణ సాఫీగా జరుగుతుంది. మీ శరీరంలో పైన పేర్కొన్న సంకేతాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించండి. రక్త ప్రసరణ సమస్యలను ముందుగా గుర్తిస్తే తీవ్ర పరిణామాలను నివారించవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా రక్త ప్రసరణను మెరుగుపరచుకోవచ్చు, ఆరోగ్యంగా ఉండవచ్చు.

# మార్కెట్

## శాంతించిన పసిడి.. తులంపై రూ.1,550 తగ్గుదల



న్యూఢిల్లీ : ఈక్విటీ మార్కెట్లతోపాటు బంగారం ధరలు భారీగా తగ్గాయి. ఆభరణాల వర్తకులు, స్టాకిస్టులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో పుత్తడి ధర ఒకేరోజు రూ.1,500కి పైగా పడిపోయింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం ధర రూ.1,550 తగ్గి రూ.91,450కి పరిమితమైనట్టు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. గతవారంలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన తులం ధర రూ.93 వేల స్థాయిలో ఉండగా, ప్రస్తుతం రూ.92 వేల దిగువకు పడిపోయింది. ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలడంతో మరోసారి ఆర్థిక మాంద్యం గుప్పిట్లోకి ప్రపంచ దేశాలు వెళ్లే అవకాశం ఉన్నదన్న ఆందోళనలు మదుపరులో నెలకొన్నాయని, ఫలితంగా విక్రయాలకు మొగ్గుచూపడం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఉన్నతాధికారి సౌమిల్ గాంధీ తెలిపారు. పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్ పూర్తిగా దెబ్బతిన్నదని, వాణిజ్య ఉద్రిక్తత పరిస్థితులపై అమెరికా స్పష్టతనిచ్చే అవకాశం కోసం మదుపరులు వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నారని చెప్పారు. ఇటు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో తులం ధర రూ.280 దిగి రూ.90,380గా నమోదైంది. వెండిది కూడా అదే దారి.. వరుసగా తగ్గుతూ వచ్చిన వెండి ధరలు సోమవారం కూడా భారీగా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో కిలో వెండి రూ.3,000 దిగొచ్చి రూ.92,500కి పరిమితమైంది. గత ఐదు సెషన్లలో వెండి రూ.10,500 తగ్గినట్టు అయింది. ఇటు హైదరాబాద్‌లో కిలోవెండి రూ.1.03 లక్షలుగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ 10.16 డాలర్లు తగ్గి 3,027.20 డాలర్లకు పరిమితమవగా, వెండి 30.04 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

### నష్టాల నుంచి కోలుకున్న స్టాక్ మార్కెట్లు..

## 74వేల ఎగువన సెన్సెక్స్..!



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నాటి నష్టాల నుంచి కోలుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. చైనా సైతం ప్రతీకార సుంకాలను ప్రకటించడంతో వాణిజ్య యుద్ధం భయాల మధ్య మార్కెట్లు ఒక్కసారిగా భారీగా పతనమయ్యాయి. గ్లోబల్ మార్కెట్‌లో సానుకూల పవనాలతో మార్కెట్లు.. దేశీయ మార్కెట్లు సైతం లాభాల్లో మొదలయ్యాయి. కిందటి సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 74,013.73 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 73,424.92 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. 74,859.39 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. చివరకు 1,089.18 పాయింట్లు లాభంతో 74,227.08 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం నిఫ్టీ 374.25 పాయింట్లు పెరిగి 22,535.85 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,968 షేర్లు లాభపడ్డాయి. మరో 843 షేర్లు పతనం కాగా.. మరో 115 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో జియో ఫైనాన్షియల్, శ్రీరామ్ ఫైనాన్స్, టైటాన్ కంపెనీ, సిప్లా, భారత్ ఎలక్ట్రానిక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. పవర్ గ్రిడ్ నష్టపోయింది. క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ, రియాల్టీ, టెలికాం, మీడియా రెండు నుంచి 4శాతం వరకు పెరగడంతో అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.8 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ రెండుశాతం వరకు పెరిగాయి.

## భారత్‌లో 39శాతానికిపైగా బ్యాంకు ఖాతాలు మహిళల పేరిటే..!

### పొదుపులోనూ బెస్టే..!

భారతదేశంలోని మొత్తం బ్యాంకు ఖాతాల్లో 39.2శాతం అకౌంట్స్ మహిళల పేరిట ఉన్నాయి. ఇందులో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. పట్టణ మహిళల కంటే గ్రామీణ ప్రాంతాల మహిళల సంఖ్యే ఎక్కువగా ఉన్నది. 42.2శాతం బ్యాంకు ఖాతాలు గ్రామీణ మహిళల పేరిట ఉన్నాయి. ఈ విషయాన్ని గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ‘ఉమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా 2024’: సెలెక్టెడ్ ఇండికేటర్స్ అండ్ డేటా పేరుతో నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక భారత్‌లో లింగ ప్రాతిపదికన సమగ్ర చిత్రాన్ని చూపించింది. ఇందులో జనాభా, విద్య, ఆరోగ్యం, ఆర్థిక భాగస్వామ్యం, నిర్ణయాలు తీసుకోవడం వంటివాటికి సంబంధించిన సమగ్ర డేటా ఉన్నది. ఈ గణాంకాలను వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాల నుంచి సేకరించారు. ఈ డేటా ప్రకారం.. బ్యాంకు డిపాజిట్లలో మహిళల వాటా 39.7శాతంగా ఉన్నది. గ్రామీణ భారతదేశంలోని వారి భాగస్వామ్యం అత్యధికంగా ఉన్నది. ఇక్కడ ప్రతి రెండు ఖాతాల్లో దాదాపు ఒకటి మహిళ పేరుతో ఉంది. ఇంకా విశేషమేంటంటే.. బ్యాంకు ఖాతాల్లో మహిళల భాగస్వామ్యం గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికం. ఇక్కడ ఖాతాదారుల్లో వారి వాటా 42.2శాతంగా ఉన్నది.

# పార్టీలో నిజమైన కార్యకర్తలే సుప్రీం

**కార్యకర్తలే అధినేతలుగా మహానాడు**

**కోవర్టు రాజకీయాలు సహించేది లేదు**

**వైఎస్ వివేకా హత్యలో నన్నే మోసం చేయాలని చూశారు**

**మహానాడు రెండోరోజు ప్రసంగంలో చంద్రబాబు**



కడప : కార్యకర్తలే నా హై కమాండ్.. వారే సుప్రీం అని టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీలో వారికే పెద్దపీట అన్నారు. టీడీపీ మహానాడులో రెండో రోజు ఆయన మాట్లాడుతూ.. మళ్లీ జన్మ ఉంటే తెలుగు గడ్డపై పుడతా అన్నారు.. కార్యకర్త నా హై కామాండ్.. కార్యకర్తె నా సుప్రీం అని స్పష్టం చేశారు.. తొలిసారిగా 65 మంది యువతకు సీట్లు ఇచ్చాం... ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలిచారని గుర్తుచేశారు.. లోకేష్ 6 శాసనాలు ప్రవేశ పెట్టారు.. ఆయనకు ఉన్న నాలెడ్జితో మంచి ఆలోచనలు చేస్తున్నారు.. టీడీపీ కొత్తతరహా పరిపాలనకు శ్రీకారం చుట్టింది.. ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయం తీసుకుంటున్నాం అన్నారు.. కార్యకర్తలే అధినేతలుగా మహానాడు నిర్వహిస్తున్నాం.. కొన్ని నియోజకవర్గాల్లో ఓడినా మెజార్టీ వచ్చిందని వెల్లడించారు.. ఇక, గుండె పోటుతో వివేకానంద రెడ్డి మృతి చెందారు... ఆ నాడు నేనుకూడా నమ్మాను.. గొడ్డలితో నరకడం వల్ల మెదడు కూడా బయటకు వచ్చినా దాచారు అంటూ వైఎస్ వివేకా హత్య కేసుపై చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు.. ఆ రోజు సాయంత్రానికి అనేక మలుపులు తిప్పింది ఎవరో మీకు తెలుసు... మరుసటి రోజు నారాసుర రక్త చరిత్ర అని రాశారని ఫైర్ అయ్యారు. వివేకా హత్య కేసు విషయంలో నాలాంటి నాయకుణ్నే మోసం చేయగలిగారు. గుండెపోటుతో వివేకా చనిపోయారని ప్రచారం చేశారు.. అందరిలా నేనూ నమ్మాను. సాయంత్రానికి గొడ్డలిపోటు- విషయం బయటకి వచ్చింది. నాపై నెపం వేసేందుకు దుష్ప్రచారాలు చేశారని చంద్రబాబు మండిపడ్డారు.అయితే, మన దగ్గర ఉండే కొందరు కోవర్టు రాజకీయాలు చేస్తున్నారు.. తప్పులు చేసే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.. నేరస్తులు ఖబడ్దార్.. నా వద్ద మీ ఆగడాలు సాగవు.. కోవర్టులతో రాజకీయాలు చేస్తే ఉరుకోను అని వార్నింగ్ ఇచ్చారు.. కోవర్టుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు సీఎం చంద్రబాబు.. పార్టీలోకి వలస పక్షులు వస్తాయ్.. పోతాయ్.. నిజమైన కార్యకర్త శాశ్వతంగా ఉంటాడని తెదేపా చంద్రబాబు అన్నారు. నేరస్థులు చేసే కనికట్టు- మాయపై అందరూ అప్రమత్తంగా ఉండాలి. కోవర్టులను పార్టీలోకి పంపాలనుకుంటే మీ ఆటలు సాగవు. సోషల్ మీడియాలో ఆడబిడ్డలపై దుష్ప్రచారాలు చేస్తే సహించం. ఆడబిడ్డలపై అసభ్యంగా ప్రవర్తించే వారికి అదే చివరి రోజు అవుతుందని చంద్రబాబు అన్నారు.

# సత్తా అంటే జగన్‌ను తిట్టడం కాదు

**సత్తా అంటే కడపలో మహానాడు పెట్టడం కాదు**

**సత్తా అంటే సూపర్ సిక్స్ హామీల అమలు**

**ఎవరి ఇంటికైనా వెళ్లి హామీల గురించి అడగ గలరా**

**మహానాడుపై జగన్ సూటి ప్రశ్న**



అమరావతి : కడప వేదికగా టీడీపీ మహానాడు జరుగుతోన్న వేళ.. ఆ పసుపు పండుగపై వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు.. మహానాడు పెద్ద డ్రామాగా అభివర్ణించిన ఆయన.. దమ్ముంటే కడపలో మహానాడు పెట్టడంకాదు...రాష్ట్రంలో ఏ ఇంటికైనా వెళ్లి తాము ఈ పనిచేశామని టీడీపీ వాళ్లు ధైర్యంగా చెప్పుకోగలరా..అని ప్రశ్నించారు. టీడీపీ వాళ్లు ఇచ్చిన మేనిఫెస్టోలు, బాండ్లు, కరపత్రాలు ఇప్పటికీ ప్రతి ఇంట్లో ఉన్నాయి.. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు ఏమయ్యాయని ప్రజలు నిలదీస్తారని పేర్కొన్నారు. చంద్రబాబు మహానాడులో ఫోజులు ఇస్తున్నాడు.. టీడీపీ తెలుగు డ్రామా పార్టీ అంటూ కొత్త నిర్వచనం చెప్పారు.. సత్తా అంటే కడపలో మహానాడు పెట్టడం కాదు.. ఇచ్చిన హామీలు నెరవేర్చడం నిజమైన సత్తా అవుతుంది.. కడపలో మహానాడు పెట్టి.. జగన్‌ను తిట్టడం సత్తా ఎలా అవుతుందని నిలదీశారు. రాష్ట్రం ఎలాంటి పరిస్థితుల్లో ఉందో అందరూ చూస్తున్నారు.. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ఉండాలి. చంద్రబాబు రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు జగన్.. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్ని-కై-న ప్రజాప్రతినిధులను ప్రలోభ పెట్టి, బెదిరించి, భయపెట్టి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు.. చంద్రబాబుది దౌర్భాగ్యపు పాలని అని విమర్శించారు.. కోవిడ్ లాంటి మహమ్మారి వచ్చి ఆదాయాలు తగ్గి, ఖర్చులు పెరిగి, తీవ్ర సంక్షోభం ఉన్నా.. ఏరోజు కూడా వాటిని సాకులుగా చూపించలేదు.. ప్రజలకు చేయాల్సిన మేలు చేయకుండా పక్కనపెట్టలేదు.. ఎన్ని సమస్యలున్నా ప్రజలకు సంతోషంగా మేలు చేశాం.. ఎన్నికల వేళ ఇచ్చిన ప్రతి హామీని కూడా నెరవేర్చాం.. సీఎం కార్యాలయం నుంచి ప్రతి కార్యాలయంలోనూ కూడా మేనిఫెస్టో పెట్టాం.. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ దాన్ని అమలు చేసేట్టు-గా చేశాం.. 99శాతం హామీలను అమలు చేశాం.. అంత గొప్పగా ప్రజలకు మేలు చేశాం.. అందుకనే అప్పటి స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేశామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

# యువగళం పాదయాత్రపై పుస్తకం

**మహానాడు వేదికపై ఆవిష్కరించిన చంద్రబాబు**

కడప : వైకాపా అరాచక పాలనపై గళమెత్తుతూ తాను చేపట్టిన యువగళం పాదయాత్ర విశేషాలతో రూపొందించిన 'ద వాయిస్ ఆఫ్ పీపుల్' పుస్తకావిష్కరణ మహానాడు వేదికపై జరిగింది. తొలి ప్రతిని యువనేత నారా లోకేశ్ సీఎం చంద్రబాబుకు అందజేశారు. 2023 జనవరి 27న కుప్పం శ్రీవరదరాజస్వామి పాదాలచెంత నుంచి ప్రారంభించి 226 రోజులపాటు- లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఏపీ రాజకీయాలను మలుపుతిప్పింది.2,097 గ్రామాల మీదుగా 226 రోజులపాటు- 3,132 కి.మీ మేర జైత్రయాత్రలా సాగింది. పాదయాత్రలో తనకు ఎదురైన అనుభవాలు, యాత్రను అడ్డగించేందుకు నాటి వైకాపా ప్రభుత్వం అడుగడుగునా సృష్టించిన అడ్డంకులు, ఆనాటి అరాచకపాలనలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, కన్నీటిగాథలను ఈ పుస్తకంలో సచిత్రంగా కళ్లకు కట్టినట్లుగా చూపారు. పుస్తకాన్ని ఆసక్తిగా తిలకించిన చంద్రబాబు.. యువనేత లోకేశ్‌ను అభినందించారు. యువగళం పాదయాత్ర ద్వారా రాష్ట్ర ప్రజల్లో చైతన్యం నింపారని, ఆనాటి అనుభవాలను పుస్తకరూపంలో తేవడం బాగుందంటూ ప్రశంసించారు.

# లోకేశ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాలి

**మహానాడులో ధూళిపాళ్ల, పయ్యావుల డిమాండ్**

కడప : మంత్రి నారా లోకేశ్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించాలంటూ డిమాండ్ ముందుకు వచ్చింది. కడపలో జరుగుతోన్న మహానాడు వేదికగా నారా లోకేష్‌కు కీలక పదవి ఇవ్వాలని పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే ధూళిపాళ నరేంద్ర ప్రతిపాదించారు. నారా లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని తాము మినీ మహానాడులో తీర్మానించామని సీఎం చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా ధూళిపాళ నరేంద్ర చెప్పారు. పార్టీలోని వారంతా కోరుకుంటున్న విధంగా నారా లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని సీఎం చంద్రబాబుకు ధూళిపాళ నరేంద్ర విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే మంత్రి నారా లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కట్టబెట్టాలని తెలుగుదేశం పార్టీలో ఏకాభిప్రాయం వ్యక్తమవుతుంది. అందులోభాగంగా పార్టీలోని సీనియర్ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితోపాటు- పలువురు నేతలు ఇదే విషయాన్ని బుధవారం మహానాడు వేదికగా స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్ కావాలని పార్టీ కార్యకర్తల నుంచి డిమాండ్ వస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. కార్యకర్తలతో పాటు- నేతలంతా ఇదే కోరుకుంటున్నారని చెప్పారు. లోకేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కావాలన్నది ఇప్పుడు అత్యవసరం అన్నారు. పార్టీ మరింత బలోపేతం కావాలంటే ఇది సహేతుకమైన నిర్ణయమని పేర్కొన్నారు. కడపలోని 'మహానాడు' ప్రాంగణంలో ఆయన ఈమేరకు వ్యాఖ్యలు చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా మరోసారి సీఎం చంద్రబాబు నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. ఆ క్రమంలో నారా లోకేశ్‌ను సైతం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇప్పటికే నారా లోకేశ్.. ప్రజా క్షేత్రంలోనే కాదు.. మంత్రిగా కూడా సక్సెస్ అయ్యారని పార్టీ కేడర్ సైతం స్పష్టం చేస్తుంది. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ స్థానం నుంచి నారా లోకేశ్ విజయం సాధించారు. అనంతరం చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో అత్యంత కీలమైన విద్య, ఐటీ- శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అదీకాక.. 2023 జనవరి 27వ తేదీన నారా లోకేశ్.. చిత్తూరు జిల్లా కుప్పం నుంచి యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర ద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రజా క్షేత్రంలో లోకేశ్ పరిణితి చెందిన నాయకుడిగా ప్రజల నుంచి మనన్నలు అందుకున్న విషయం విదితమే.

# విద్యుత్ సంస్కరణలతో ప్రజలకు మేలు

**దేశంలో సంస్కరణలు ప్రవేశ పెట్టిన ఘనత బాబుదే**

**మహానాడులో విద్యుత్ సంస్కరణలపై గొట్టిపాటి తీర్మానం**

కడప : దేశంలో మొట్టమొదటి సారిగా విద్యుత్ సంస్కరణలు అమలు చేసింది సీఎం చంద్రబాబు అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులపై మహానాడులో మంత్రి గొట్టిపాటి తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1998లో విద్యుత్ రంగ సంస్కరణలను ప్రవేశ పెట్టిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ యే.. ఏపీను మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన నేత కూడా చంద్రబాబేనని పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేశాడని ఆరోపించారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదు.. కానీ, వైసీపీ హాయాంలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని అన్నారు. అయితే, పారిశ్రామికవేత్తలను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన చరిత్ర హీనుడు జగన్ మోహన్ రెడ్డి అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించాడు. తన అనుయాయులను దోచిపెట్టి విద్యుత్ రంగంపై రూ.1.29 లక్ష కోట్లు- భారం మోపిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి.. 17 మంది సీఎంలు రూ. 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంగా మార్చితే.. అందులో 15 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఘనత చంద్రబాబుదే అన్నారు. ప్రధాన మంత్రి కార్యక్రమంలో పెట్టుబడిదారులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి ఆకట్టుకున్న ఒకే నాయకుడు చంద్రబాబు.. 72 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా మా ప్రభుత్వం పని చేస్తుంది.. రైతులకు పగటి పూటే నాణ్యమైన ఉచిత విద్యుత్ ను మా ప్రభుత్వం అందిస్తుందని చెప్పుకొచ్చారు. విద్యుత్ వినియోగదారుడిని, ఉత్పత్తిదారునిగా మా ప్రభుత్వం మార్చుతుందని గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. ఇక, రూ. 65 వేల కోట్లతో రిలయన్స్ 500 సీబీజీ ప్లాంట్లను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి అన్నారు. ఈ సీబీజీ ప్లాంట్ల ద్వారా రాష్ట్రంలో 2.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాము.. రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడితో సోలర్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నాయి.. పూడిమడకలో 1,200 ఎకరాల్లో కిఈ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ హైడ్రోజన్ హాబ్ ను ఏర్పాటు చేస్తుంది అన్నారు. 2030 నాటికి ఏటా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం.. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా రాష్ట్రంలోని సుమారు 57 వేల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని మంత్రి గొట్టిపాటి అన్నారు.

# ఎపిలో నైరుతి రాకతో భారీ వర్షాలు

**హెచ్చరిక చేసిన విపత్తు నిర్వహణ సంస్థ**

అమరావతి : నైరుతి ఋతుపవనాలు బుధవారం నాటికి ఆంధ్రప్రదేశ్ అంతటా పూర్తిగా విస్తరించాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు కోస్తాంధ్రలో భారీ వర్షాలతో పాటు-గా ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే ఛాన్స్ ఉన్నందున గోదావరి, నాగావళి, వంశధార నదీ పరివాహక లోతట్టు- ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనిపై వరద ప్రభావిత జిల్లాల అధికారా యంత్రాంగానికి ఇప్పటికే సూచనలు జారీ చేశామని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాగా, హోం,విపత్తు నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల ప్రకారం నదీ తీరాలు, సరస్సులు, చెరువులు, కాలువల్లో మునిగిపోయే ప్రాంతల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు- చేయాలని జిల్లా కలెక్టర్లకు ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనలు జారీ చేసినట్లు- తెలిపింది. ఈ హెచ్చరిక బోర్డుల్లో భద్రతా సూచనలు, సహాయం కోసం అత్యవసర నెంబర్ల సమాచారం ఉంచాలని వెల్లడించింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, శ్రీసత్యసాయి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే ఛాన్స్ ఉందన్నారు. అయితే, శుక్రవారం (మే30) నాడు అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొనింది.

# 4కోట్ల విలువైన గంజాయి పట్టివేత

భద్రాద్రి కొత్తగూడెం : తెలంగాణలో డ్రగ్స్, గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా.. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతూనే ఉంది. పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా.. వీటి రవాణా మాత్రం ఆగడంలేదు. ఈజీ మనీకి అలవాటు పడ్డ వారు గంజాయిని రవాణా చేస్తున్నారు. తాభాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. పక్కా సమాచారంతో బుధవారం జూలూరుపాడు మండలంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి 8.30 క్వింటాళ్ల గంజాయి పట్టుకున్నారు. అనంతరం తొమ్మిది మంది సభ్యుల ముఠాను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన గంజాయి ధర మార్కెట్ లో రూ.4 కోట్లకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి ముఠాపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎపిలో పెరుగుతున్న కరోనా కేసులు

**మరో ఇద్దరికి పాజిటివ్‌గా గుర్తింపు**

విజయవాడ : కరోనా వైరస్ మరోసారి కలవరపెడుతోంది.. ప్రపంచవ్యాప్తంగా విజృంభించి.. ఎన్నో లక్షలమంది ప్రాణాలు తీసిన ఈ వైరస్.. మరోసారి విరుచుకుపడుతోంది.. అయితే ఈ కొత్త వేరియంట్ డేంజర్కాదని వైద్యులు అంటున్నా, జాగ్రత్తగా ఉండాల్సిందేనని సూచిస్తున్నారు. దేశవ్యాప్తంగా క్రమంగా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది.. ఇప్పటికే పాజిటివ్ కేసుల సంఖ్య వెయ్యి దాటిపోయినట్లు- అధికారిక లెక్కలే చెబుతున్నాయి.. అయతే, ఏపీలోనూ కోవిడ్ 19 కేసులు వెలుగు చూస్తున్నాయి.. రాష్ట్రంలో తాజాగా, మరో మూడు కరోనా పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో పరీక్షల అనంతరం ఏలూరుకు చెందిన భార్యాభర్తలకు కరోనా సోకినట్లుగా తేల్చారు వైద్యులు.. మరోవైపు, తెనాలికి చెందిన 83 ఏళ్ల వృద్ధుడు కరోనా బారినపడ్డారు. వృద్ధుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఇద్దరికి కరోనా నిర్ధారణ కాగా, దేశవ్యాప్తంగా కేసులు వెయ్యి దాటినట్టు- అధికారులు వెల్లడించారు. అయితే, కరోనా బారినపడకుండా.. ప్రజలు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు వైద్యులు..

# బాసర ఆర్జీయూకెటిలో నోటిఫికేషన్ విడుదల

బాసర : ఆర్జీయూకేటీ- బాసర, మహబూబ్ నగర్ సెంటర్ లలో ఆరు సంవత్సరాల సమీకృత విద్యా విధానంలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించుటకు అడ్మిషన్ నోటిఫికేషన్ ను వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ విడుదల చేశారు. గ్రామీణ పేద విద్యార్థులకు 2008వ సంవత్సరంలో ప్రారంభించిన ఈ విశ్వవిద్యాలయం సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా ఏర్పాటయిందని, తదనుగుణంగా ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్నామని తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పేద విద్యార్థులు పొందుతున్నారని ఈ సందర్భంగా తెలిపారు. నోటిఫికేషన్ వివరాలు డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యూ. ఆర్ జి యు కే టి. ఏసి. ఇన్ వెబ్ సైట్ ను సందర్శించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఓయస్డి ప్రొఫెసర్ మురళీ దర్శన్, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కో కన్వీనర్ డాక్టర్ దేవరాజు, అసోసియేట్ డీన్ డాక్టర్ విటల్, మంతపురి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఏడాది లోపే ఎన్నో పనులు చేసి చూపాం

**రాజకీయ తీర్మానంలో రామ్మోమన్ నాయుడు**

కడప : విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, పోలవరం, అమరావతి ఏడాదిలోపే సాధ్యం చేసి చూపామని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. కడపలో జరుగుతున్న మహానాడులో రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలు, బడుగు బలహీనవర్గాల కోసం పుట్టిన పార్టీ తెదేపా. ఎన్టీఆర్ పార్టీని స్థాపించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. యువత, చదువుకునే వారిని ప్రోత్సహించారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' సహా ఏ మూల సిద్ధాంతాలతో ఎన్టీఆర్ పార్టీని స్థాపించారో.. ఆ విధానాలను సీఎం చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారు. ఆటంకాలు లేకుండా తెదేపా, జనసేన, భాజపా పార్టీలు కూటమి ప్రభుత్వాన్ని పటిష్ఠంగా నడుపుతున్నాయి. సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే మొదలయ్యాయి. తెదేపా హయాంలో పీపీపీ విధానంలో విమానాశ్రయాల నిర్మాణం చేపడుతున్నాం. ల్యాండ్ పూలింగ్ విధానం తీసుకొచ్చింది చంద్రబాబు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ విధానానికి శ్రీకారం చుడుతున్నారు. కోటి మంది సభ్యత్వాలు కలిగిన ఏ-కై-క ప్రాంతీయ పార్టీ తెదేపా. ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొంది. సంక్షోభాలను ఎదురొడ్డి విజయవంతంగా ముందుకు సాగింది' అని రామ్మోహన్ నాయుడు అన్నారు.

# విద్యుత్ సంస్కరణలకు చంద్రబాబు రోల్ మోడల్

**ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రశంసలు**


కడప : వైకాపా ప్రభుత్వ విధానాలు నచ్చక ఎదిరించి పోరాడానని తెదేపా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆ సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుతో పాటు- పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ భుజం తట్టి ప్రోత్సహించారని.. తెదేపా కుటుంబం తనను అక్కున చేర్చుకుందని గుర్తుచేసుకున్నారు. మంత్రి నారా లోకేశ్‌కు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు అప్పగించి.. కార్యకర్తల ఆకాంక్షలను నెరవేర్చాలని కోటంరెడ్డి కోరారు. వైకాపా దుర్మార్గాలకు ప్రజలంతా భయపడుతున్న రోజుల్లో నిర్బంధాలు, నిషేదాజ్ఞలను లోకేశ్ లెక్కచేయకుండా కార్యకర్తల భుజం తట్టి ప్రోత్సహించారన్నారు.కడపలో నిర్వహిస్తున్న మహానాడులో విద్యుత్ సంస్కరణల తీర్మానంపై కోటంరెడ్డి మాట్లాడారు. విద్యుత్ సంస్కరణలకు చంద్రబాబు రోల్ మోడల్ అని కోటంరెడ్డి కొనియాడారు. ఈ విషయం తాను చెప్పింది కాదని.. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు అనేక సందర్భాల్లో చెప్పారని గుర్తు చేశారు. ఈ అంశంలో రాజకీయ ప్రత్యర్థులు సైతం చంద్రబాబును అభినందించక తప్పదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను 17 మంది ముఖ్యమంత్రులు పాలిస్తే 16 మంది హయాంలో విద్యుత్ ఉత్పాదన 5వేల మెగావాట్లు- మాత్రమే ఉందని చెప్పారు. చంద్రబాబు హయాంలో 16వేల మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని వివరించారు. దీన్ని బట్టి విద్యుత్ రంగంలో ఆయనకు ఉన్న అనుభవాన్ని చెప్పొచ్చన్నారు. వైకాపా విధానాలతో దెబ్బతిన్న రాష్ట్రాన్ని చంద్రబాబు గాడిన పెట్టారని కోటంరెడ్డి అన్నారు. ఆయన కాకుండా వేరే వ్యక్తి సీఎంగా ఉండి ఉంటే ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి తలెత్తేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తూ రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు- పోలవరం ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కోసం అంతర్జాతీయ స్థాయిలో పెట్టు-బడులు తీసుకొస్తున్నారని కోటంరెడ్డి చెప్పారు.



## స్పిరిట్ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడం సరైనదేనా

సందీప్ వంగా ఎందుకింతగా రియాక్ట్ అయ్యారు అర్జున్ రెడ్డి సినిమాతో ఓవర్ నైట్ స్టార్ డైరెక్టర్ అనిపించుకున్న సందీప్ రెడ్డి వంగా అనూహ్యంగా వార్తల్లోకి వచ్చాడు. నిజానికి స్పిరిట్ సినిమా నుంచి దీపికా తప్పుకుందనే వార్త ముందు వెలుగులోకి వచ్చింది. దానికి దీపికా పెట్టిన కొన్ని కండిషన్స్ కారణమని కూడా అన్నారు. దీపికా పెట్టిన కండిషన్స్ నచ్చకపోవడంతో ఆమెను ప్రాజెక్టు నుంచి తప్పోమని కోరారని, దాంతో ఆమె వెళ్లిపోయిందని బయటకు తెలిసింది. అంతేకాదు, అనిమల్ సినిమాలో సెకండ్ హీరోయిన్ లాంటి పాత్రలో బోల్డ్ క్యారెక్టర్‌లో నటించిన తృప్తి డిమ్రి స్పిరిట్‌లో హీరోయిన్ అంటూ సందీప్ రెడ్డి ప్రకటించాడు. అయితే అనూహ్యంగా ఈ వార్తలు వచ్చిన తర్వాత బాలీవుడ్‌లో స్పిరిట్ ఒక ఏ రేటెడ్ సినిమా అని, ఎక్కువగా బోల్డ్ సీన్స్, లిప్ లాక్‌లు ఉండడంతోనే దీపికా నటించలేనని బయటకు వచ్చిందని బాలీవుడ్ మీడియా పోర్టల్స్‌లో ప్రచారం మొదలైంది. దీంతో ఈ విషయం మీద ఫైర్ అవుతూ సందీప్ రెడ్డి ట్వీట్ చేశాడు. సినిమా కథ చెప్పి మిమ్మల్ని సినిమాలోకి ఆహ్వానించినప్పుడే ఒక సైన్ చేయని నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్‌లోకి మీరు అడుగుపెట్టినట్లే, కానీ మీరు ఒక యంగ్ యాక్టర్‌ని నాశనం చేయాలనే ఉద్దేశంతో ఆ సినిమా కథ బయటికి చెప్తున్నారని తెలిసింది. అక్కడే మీ క్యారెక్టర్ ఏంటో బయటపడుతుంది. ఇంకా ఈ ఫేక్ ఫెమినిజం ముసుగుతో ఏం చేయాలనుకుంటు న్నారు? సరే, ఈసారి కథ మొత్తం చెప్పండి, నాకు ఏమీ ఫరక్ పడదు అంటూ ఆయన రాసుకొచ్చాడు. అయితే నిజానికి దీపికా పడుకోనే గతంలో ఎప్పుడూ వివాదాల జోలికి వెళ్లలేదు. ఆమె పలువురు హీరోలతో డేటింగ్ చేస్తుందనే వార్తలు వచ్చినా సరే, వాటిని ఖండించలేదు సరికదా, తర్వాత ఒక స్టార్ హీరోని వివాహం చేసుకొని రిలేషన్‌లోకి అడుగు పెట్టింది. ఆమెను వెనకేసుకొస్తూ ఇప్పుడు బాలీవుడ్‌లో ఆర్టికల్స్ రావడంతో దాన్ని పిఆర్ స్టంట్ అంటూ సందీప్ రెడ్డి వంగాతో సహా చాలామంది అభివర్ణిస్తున్నారు. అయితే ఇక్కడ తప్పు ఎవరిది అనే ప్రస్తావన వస్తే, ఎవరిదీ అని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చిన వారు ఎవరూ సినిమా మీద ఇలాంటి విషపు ప్రచారాలు చేయించలేదు. తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సందీప్ రెడ్డి వంగా ఇమేజ్ మరికొంత డామేజ్ అయ్యే అవకాశం ఉంటుంది.










## తదుపరి సినిమాలపై మహేశ్ టీమ్ ఫోకస్

**పలువురు దర్శకులను లైన్‌లో పెట్టినట్లు టాక్**

గుంటూరు కారం సినిమా తర్వాత మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. ఇప్పటికీ ఈ సినిమా టైటిల్ ఫిక్స్ చేయలేదు. ప్రస్తుతానికి పలు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమాకి సమ్మర్ బ్రేక్ ఇచ్చారు. ఎప్పటిలాగే మహేష్ బాబు వెకేషన్‌కి వెళ్లిపోయాడు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ షెడ్యూల్ ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. అయితే ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు పూర్తవుతుంది, సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుంది అనే విషయం మీద ఎవరికీ క్లారిటీ- లేదు. అయినప్పటికీ ఈ సినిమా పూర్తయిన తర్వాత మహేష్ బాబు ఎవరితో సినిమా చేయాలనే విషయం మీద ఆయన టీం ప్లానింగ్ రెడీ చేస్తోంది. నిజానికి ఈ సినిమా పూర్తి అయిన వెంటనే ఆయన ముగ్గురు దర్శకులను లైన్‌లో పెట్టారు. ముందుగా సందీప్ రెడ్డి డైరెక్షన్‌లో ఒక సినిమా చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు- చెబుతున్నారు. ఒకవేళ అప్పటికే సందీప్ రెడ్డి సిద్ధంగా లేకపోతే, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సినిమా సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఎందుకంటే కల్కి సినిమా తర్వాత ఆ సినిమా బాగా నచ్చడంతో మహేష్ బాబు స్వయంగా ఆయనతో సినిమా చేయడానికి ఆసక్తి చూపాడు. వైజయంతి మూవీస్‌తో అనుబంధం కారణంగా నాగ్ అశ్విన్ కూడా మహేష్ తో సినిమా చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఆ సమయానికి ఆయన కూడా అందుబాటులో లేకపోతే.. అప్పుడు బుచ్చిబాబు డైరెక్షన్‌లో సినిమా చేసే అవకాశం ఉంది. ప్రస్తుతానికి బుచ్చిబాబు రామ్ చరణ్ హీరోగా 'పెద్ది' అనే సినిమా చేస్తున్నాడు. అయితే మహేష్ కోసం తాను ఇప్పటికే స్క్రిప్ట్ సిద్ధం చేసుకుంటు-న్నానని గతంలో కూడా ఆయన వెల్లడించారు. కాబట్టి రాజమౌళి సినిమా తర్వాత వెంటనే ఈ ముగ్గురిలో ఎవరో ఒకరితో ఒక సినిమా ప్లాన్ చేసే అవకాశం ఉంది.





## మిరాయ్ టీజర్ అదుర్స్


హనుమాన్' లాంటి భారీ హిట్ అందుకున్నా తేజ సజ్జ మళ్ళీ అదే తరహాలో 'మిరాయ్' వంటి భారీ పాన్ వరల్డ్ చిత్రంతో వస్తున్నాడు. యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కిస్తున్న ఈ షూటింగ్‌కి, కొంచెం ఎక్కువ సమయం తీసుకుంటున్నప్పటికీ ఆ మధ్య వచ్చిన గ్లింప్స్ అందరికీ షాకిచ్చింది. ఒక్కో పోస్టర్ మాత్రం మూవీ అంచనాలు బాగా పెంచేసింది. ఇక ఈ రోజె అవై-టె-డ్ టీ-జర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. టీజర్ ఊహించని రీతిలో ఉందని చెప్పాలి. ఒక్క మాటలో చెప్పాలంటే మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఉంది. ఇండియన్ సినిమా దగ్గర ఎన్నో భారీ సినిమాలు వస్తున్నాయి కానీ కంటెంట్ ఉంటే దానికి తగ్గట్టుగా కావాల్సిన ప్రామిసింగ్ విజువల్స్ కూడా చాలా మెయిన్. ఇక 'మిరాయ్' దానికి అతీతంగా ఉందని చెప్పడంలో సందేహం లేదు. స్టన్నింగ్ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఒక హాలీవుడ్ సినిమా చూస్తున్న ఫీల్ వచ్చింది. ముఖ్యంగా మంచు మనోజ్.. అదరకొట్టాడు. సాహస సన్నివేశాల్లో తేజ ఎక్కడా కూడా అసలు కాంప్రమైజ్ అయినట్టే కనిపించడం లేదు. అలాగే ఇండియన్ సినిమాకు ఒక సరికొత్త అవుట్ ఆఫ్ ది బాక్స్ సినిమాగా ఇవ్వబోతున్నట్లు- తెలుస్తుంది. ఇక లాస్ట్ షాట్‌లో రాముని రాకపై చూపించిన విజువల్ వర్ణనాతీతం.. మొత్తానికి 'మిరాయ్' తెలుగు ఇండస్ట్రీని మరో మెట్టు- ఎక్కించేలా కనిపిస్తుంది.

## కమల్‌తో అనుబంధం మరువలేనిది

### థగ్‌లైఫ్ ప్రమోషన్‌లో శివరాజ్ కుమార్

తమిళ సూపర్ స్టార్ కమల్ హాసన్‌కు ఎలాంటి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో మనకు తెలిసిందే హీరోల్లో సైతం ఆయనకు పిచ్చ ఫ్యాన్స్ ఉన్నారు. ఇక ప్రజంట్ మణిరత్నం దర్శకత్వంలో 'థగ్ లైఫ్' మూవీ నటించాడు. త్రిష, శింబు వంటి స్టార్స్ అందరూ భాగం కాబోతున్న ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల చెన్నైలో ఈ సినిమా ఆడియో ఈవెంట్‌లో ఎంతో అద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శివరాజ్ కుమార్, తన అభిమాన నటుడి గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఒకసారి కమల్ సర్ మా ఇంటికి వచ్చారు. నాన్నగారితో మాట్లాడుతుంటే నేను పక్కన నిలబడి ఆయన్నే చూస్తూ ఉన్నాను. అప్పుడు ఆయన నన్ను చూసి షేక్‌హ్యాండ్ ఇచ్చారు. ఆ తర్వాత నేను ఆయన్ని కౌగిలించుకోవచ్చా అని అడిగాను, ఆయన నవ్వుతూ సరే అన్నారు. ఆ తర్వాత నేను మూడు రోజుల వరకు స్నానం చేయలేదు. ఆయన వాసన నాపై అలాగే ఉండాలని. ఆయనంటే నాకు అంత అభిమానం. అలాగే నేను క్యాన్సర్‌తో పోరాడుతున్న సమయంలో కమల్ హాసన్ నుంచి వచ్చిన ఫోన్ కాల్ ఎప్పటికి మర్చిపోలేను. నాకు నా తండ్రి డాక్టర్ రాజ్‌కుమార్‌తో మాట్లాడినట్లు- అనిపించింది' అని శివరాజ్ కుమార్ వెల్లడించారు.



## హరిహర వీరమల్లులో అదిపోతున్న సాంగ్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, దర్శకులు క్రిష్ జాగర్లమూడి అలాగే జ్యోతి కృష్ణలు తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీ ఎప్పుడో రావాల్సింది.. కానీ ఎన్నో ఇబ్బందులు ఎదురుకొని ఫైనల్‌గా ఈ జూన్ 12న గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ కాబోతుంది. ఇక విడుదల సమయం దగ్గర పడుతుండడంతో, ఒక్కో అప్ డేట్ వదులుతున్నారు మూవీ మేకర్స్. కాగా ఇప్పటికే మూడు పాటలు రిలీజ్ కాగా, తాజాగా సినిమా నుంచి నాలుగో సాంగ్ కూడా విడుదలైంది. ఇక ఈ సాంగ్ లో నిధి లుక్ అదిరిపోయింది. లిరిక్స్ బ్యాగ్రౌండ్ స్మూత్‌గా కిక్కిచ్చేలా ఉందని చెప్పాలి. కీరవాణి మంచి ట్యూన్‌ని అందించగా శ్రీహర్ష ఈమని ఇచ్చిన సాహిత్యం కూడా బాగుంది. ఇక ఈ సాంగ్ లో లిప్సిక భాష్యం గొంతు, బాగా ప్లస్ అయ్యిందని చెప్పాలి. అలాగే సాంగ్ లో విజువల్స్ కూడా ఒకింత ఆశ్చర్యకరంగా ఉన్నాయి. సాంగ్ మూడ్ కి తగ్గట్టుగా సెట్ చేసిన సెట్టింగ్స్ విశేషంగా ఆకట్టు-కుంటు-న్నాయి. ఇక నిధి అగర్వాల్ అయితే మెయిన్ ఎసెట్ అని చెప్పవచ్చు. తన గ్లామర్ ఇంకా తన డాన్స్ మూమెంట్స్ సాంగ్ లో చాలా బాగున్నాయి. మొత్తానికి నాలుగో పాట కూడా అదిరిపోయింది.



## రామ్‌చరణ్‌తో త్రివిక్రమ్ మూవీ

గుంటూరు కారం' సినిమా తర్వాత త్రివిక్రమ్ ఎవరితో సినిమా చేస్తాడు అనే విషయం మీద చాలా చర్చలు జరిగాయి. మొదట ఈ మాటల మాంత్రికుడు అల్లు అర్జున్‌కి కథ చెప్పాడు, దాదాపుగా అది ఫిక్స్ అయిపోయింది అనుకున్న తరుణంలో, అల్లు అర్జున్‌కి, కథ నచ్చకపోవడంతో ఆయన అట్లీతో సినిమా చేసేందుకు వెళ్లారు. ఇప్పుడు త్రివిక్రమ్ ఇతర హీరోలతో సినిమాలు చేసేందుకు ప్లానింగ్ చేసి, చివరికి వెంకటేష్ హీరో గా ఒక సినిమా ఫైనల్ చేశారు. ఇందు లో హీరోయిన్‌గా రుక్మిని వసంత్‌ని కూడా ఫిక్స్ చేశాడు. అయితే ఇప్పుడు ఈ మూవీకి సంబంధించిన మరో షాకింగ్ న్యూస్ వైరల్ అవుతుంది. ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం రామ్ చరణ్‌ను సంప్రదించగా, ఆ పాత్రలో నటించేం దుకు చరణ్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఇక త్వరలోనే ఆ సినిమా పట్టాలెక్కనున్నది. ఇక ఇప్పుడు మరో వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాని ప్రకారం రామ్ చరణ్ తర్వాత సినిమా కూడా త్రివిక్రమ్ శ్రీనివాస్‌తోనే ఉండబోతోంది. ప్రస్తుతానికి రామ్ చరణ్ 16వ సినిమాగా 'పెద్ది' రూపొందుతోంది. ఈ సినిమా పూర్తియిన వెంటనే ఆయన వెంకటేష్ సినిమాలో నటించబో తున్నాడు. ఆ సినిమా పూర్తి అయిన వెంటనే త్రివిక్రమ్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో ఒక మంచి పాన్ ఇండియా సబ్జెక్ట్ రూపొందిస్తున్నారని తెలుస్తోంది. ఆ రకంగా రామ్ చరణ్ బ్యాక్ టు- బ్యాక్ ప్రాజెక్ట్స్ గురూజీ తోనే చేయబోతున్నాడు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఇప్పటివరకు త్రివిక్రమ్ ఏ సినిమా చేసినా సితార ఎంటర్-టైన్‌మెంట్స్ లేదా హారిక హాసినితోనే చేసేవాడు. కానీ ఇప్పుడు రామ్ చరణ్‌తో చేయబోయే సినిమాకి కొత్త బ్యానర్ ఒకటి రంగంలోకి దిగబోతున్నట్లుగా తెలుస్తోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com